www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
బుధవారం 25 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 29 , పేజీలు : 12 వెల:రూ.5/-



## ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందేల తన వంతు కృషి చేస్తా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు జూన్ 24:**
ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందేల తన వంతు కృషి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు, ఆదిలాబాద్ మండల ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన 38 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య

# రైతులే మా ప్రథమ ప్రాధాన్యం

- రైతును రాజు చేయడమే మా లక్ష్యం
- వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తున్నాం
- 9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ
- కెసిఆర్ ఎగ్గొట్టిన 7వేల కోట్లను కూడా జమచేసి చూపాం
- సన్నవడ్లకు 500 బోనస్ ఇస్తామని ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే
- బనకచర్లకు తలూపిందే కెసిఆర్... దీనిపై అసెంబ్లీలో చర్చకు రావాలి
- రైతునేస్తం సభలో సిఎం రేవంత్ రెడ్డి ఉద్వేగపేరిత ప్రసంగం



**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**
రైతు భరోసా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం అంటే.. రైతును రాజును చేయడం అని తెలుసన్నారు. రైతులకు అండగా నిలిచి, వారికి చేదోడువాదోడుగా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. వ్యవసాయాన్ని దండగ అనే స్థాయి నుంచి పండగ చేసేందుకే వైఎస్ఆర్ ఆనాడు ఉచిత విద్యుత్ అందించారని చెప్పారు. రైతుల ఆశీర్వాదం వల్లనే చిన్న వయస్సులో సీఎం అయ్యానని, రైతాంగం అభివృద్ధికి సాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారంతో పూర్తయింది. 9 రోజుల్లో 9 వేలకోట్ల మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుభరోసా కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద 'రైతు నేస్తం'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ఎగ్గొట్టిన రూ. 7 వేల కోట్ల రైతు భరోసా తమ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. 70 లక్షల మంది రైతుల కళ్ళల్లో సంతోషం చూస్తున్నామని.. రైతుభరోసా కోసం 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు నిధులు రిలీజ్ చేయడం రికార్డ్ అని అన్నారు. 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా ఇచ్చామని.. కోటి 49 లక్షల ఎకరాలకు రైతు భరోసా ఇచ్చామని అన్నారు. తెలంగాణ చరిత్ర అంతా రైతులదే అని... భూమి చుట్టూనే మన పోరాటాలు, జీవితాలు ముడిపడ్డాయని అన్నారు. రైతులను ఆదుకున్న చరిత్ర కాంగ్రెస్‌దే అని అన్నారు. మా ప్రజాప్రభుత్వంలో మొదటి

## శ్రీ ఉజ్జయిని మహాకాళి జాతర ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

- తెలంగాణ బోనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది
- బోనాల జాతర ఏర్పాట్లలో అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలి
- శ్రీ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతర నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం

- 9రోజుల్లో 9 వేల కోట్లు రైతు ఖాతాలో జమ
- సన్నధాన్యం రైతులకు క్వింటాకు 500 చొప్పన బోనస్
- రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాం
- 9 రోజుల్లో 9వేలకోట్లు ఖాతాల్లో జమ
- దేశంలో గ్రీన్ రివల్యూషన్ ఘనత కాంగ్రెస్‌దే
- రైతు భరోసా విజయోత్సవ సభలో డిప్యూటి సిఎం భట్టి

## లక్షకు పైగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్

- చురుకుగా సాగుతున్న నిర్మాణ పనులు
- ఒక్కో ఇంటికి 40 మెట్రిక్ టన్నుల ఇసుక ఉచితం
- రెవెన్యూ, హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**



రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇప్పటి వరకు దాదాపు 3 లక్షల ఇండ్లు మంజూరు చేయగా ఇందులో 2.37 లక్షల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను కూడా అందజేయడం జరిగిందన్నారు. 1.03 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.దమంగళవారం నాడు సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో మంత్రిగారు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 22,500 కోట్ల రూపాయలతో నియోజకవర్గానికి

# పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం

- 18 నెలల కాంగ్రెస్ పాలన గోల్డెన్ పీరియడ్
- రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంది
- కులగణనతో మోడీకి సవాల్ విసిరిన ఘనత మనదే
- నామినేటెడ్ పోస్టులు పొందిన వారు బాగా పనిచేయాలి
- జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యతగా వ్యవహరించాలి
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిని అధిష్టానం సూచిస్తుంది
- పార్టీ క్రమశిక్షణ తప్పిన వారిపై వేటుకు వెనకాడం
- పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం రేవంత్






**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**
పదేళ్లపాటు తెలంగాలో కాంగ్రెస్‌దే అధికారమని, మరోమారు అధికారంలోకి తీసుకుని వచ్చేలా పార్టీనేతలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వారు బాధ్యతలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత 18 నెలల కాంగ్రెస్ పాలన నిజంగానే గోల్డెన్ పీరియడ్ అన్నారు. రాబోయే రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో జరిగిన పీఏసీ సమావేశంలో పలు కీలకమైన అంశాలపై చర్చించారు. పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. త్వరలో మార్కెట్, టెంపుల్ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం పార్టీని సిద్ధం

## కృష్ణా, గోదావరి జలాలపై కుట్రలు

- ఎపి సిఎం తీరు నమ్మదగినదిగా లేదు
- బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**
గోదావరి,కృష్ణ జలాల వినియోగానికి సంబంధించిన అంశంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యవహరిస్తున్న తీరును

# కాంగ్రెస్ ప్రభుత్వానికి దశాదిశా కరువైంది..

- రాష్ట్ర క్యాబినెట్ మీటింగ్ ఎందుకు పెట్టారన్నదే సందేహంగా మారింది..
- క్యాబినెట్ మీటింగ్లో తేల్చింది ఏమీ లేదు, నిర్ణయాలు ఏమీ లేవు....
- బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి దశాదిశా కరువైందని, అసలు క్యాబినెట్ మీటింగ్ ఎందుకు పెట్టారన్నదే సందేహంగా మారిందని, ఆ సమావేశంలో తేల్చింది ఏమీ లేదని , నిర్ణయాలు ఏమీ లేవని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రోజున మీడియాతో ఆయన మాట్లాడారు. అందులోని విశేషాలు ... కాంగ్రెస్ కేబినెట్ మీటింగ్ అట్టహాసంగా జరిగింది. కానీ వారం రోజుల పాటు సుదీర్ఘ ప్రిపరేషన్ తర్వాత జరిగిన ఆ సమావేశంలో తేల్చింది



## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

- తమ ఫోన్లు ట్యాప్ చేసినట్లు వాంజ్మూలం
- నత్తనడకన సాగుతోన్న ట్యాపింగ్ కేసు
- బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్
- బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ఆరోపణ

**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**
దమ్ము, ధైర్యం లేక తమ ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వల్ల రాష్ట్రంలో భాజపా చాలా చోట్ల ఓడిపోయిందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో



## ఇరాన్-ఇజ్రాయిల్ మధ్యముగిసిన యుద్ధం

- కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకారం
- కీలక ప్రకటన చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**న్యూయార్క్,జూన్( వెలుతురు):**
ఇరాన్-ఇజ్రాయెల్‌యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన

## రాజధాని అమరావతిలో మరో 44వేల ఎకరాల సేకరణ


- గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.. విద్యా సంస్థలు.. ఆస్పత్రుల నిర్మాణం
- భూమి ఇచ్చే వారికి మెరుగైన ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు
- జీఏడీ టవర్.. హెచ్‌వోడీ టవర్.. నిర్మాణాలు
- ఎన్సీసీ షాపూర్‌జీ పల్లంజీకి, ఎల్ అండ్ టీకి టెండర్ ఆర్డర్
- అమరావతిలో స్టార్ హోటల్ నిర్మాణానికి ఆమోదం
- స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు
- పోలవరం ప్రాజెక్ట్ 2027లో పూర్తి అయ్యేలా చర్యలు
- కేబినేట్‌లో పలు నిర్ణయాలు..వెల్లడించిన మంత్రి పార్థసారథి



**అమరావతి,జూన్24( వెలుతురు):**
రాజధాని రెండో విడత భూసేకరణను కేబినెట్ ఆమోదించింది. రాజధానిలో మరో 44వేల ఎకరాల సేకరణకు మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర పి4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి ఓకే చెప్పింది. టెన్నిస్ ప్లేయర్ సాకేత్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఏపీ కేబినెట్ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.. కీలక నిర్ణయాలకు ఆమోముద్ర వేశారు.. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత.. మీడియాతో మాట్లాడిన మంత్రి

## బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

- దీనిపై దుష్ప్రచారాన్ని అడ్డుకోవాలి
- తెలంగాణ వాడుకోగా మిగిలిన నీటినే వాడుకుంటాం
- తెలంగాణ అనేక ప్రాజెక్టులు కడుతున్న అడ్డుకోవడం లేదు
- కేబినేట్‌లో సిఎం చంద్రబాబు వెల్లడి



**అమరావతి,జూన్24( వెలుతురు):**
పోలవరం బనకచర్లపై తెలంగాణ నేతలు అందరూ మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణ కేబినెట్‌లో బనకచర్లపై వాళ్లు డిస్కస్ చేశారని అన్నారు. ఏపీ కూడా మన వాదనలు వినిపించాలని సూచించారు. తెలంగాణ వాళ్లు అనుమతి లేని ప్రాజెక్ట్‌లను కూడా కడుతున్నారని సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి..)

## ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేల తన వంతు కృషి చేస్తా

అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందిస్తు వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వాలు ఎవైన పేదల సంక్షేమమం కోసమే పని చేస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలను పొందడానికి దళారులను నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో అధికారులు బిజెపి నాయకులు దయాకర్ సంతోష్ మయూర్ చంద్ర సత్యానంద్ వెంకన్న ముకుంద తదితరులు ఉన్నారు

## లక్షకు పైగా ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్

3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ నెల 23వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్ఎంసి) మినహా రాష్ట్రంలోని 95 నియోజకవర్గాలకుగాను 88 నియోజకవర్గాలలో లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ పూర్తయిందని, వర్షాకాలం సీజన్ ను దృష్టిలో పెట్టుకొని గ్రౌండింగైన ఇండ్లను వీలైనంత త్వరగా బేస్మెంట్ పనులు పూర్తి చేసుకునేలా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులకు సూచించారు. ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్ లో సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, హనుమకొండ, వికారాబాద్, సిద్దిపేట, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల పనితీరు మరింత మెరుగు పడాలని, తక్షణమే ఆయా జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఒక్కో ఇంటి కోసం 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోందని ఈ ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులు పొందే విధంగా క్షేత్ర స్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిని బట్టి లబ్దిదారులకు ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడుతల్లో ఇందిరమ్మ లబ్దిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నామని తెలిపారు. బేస్మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత 1.25 లక్షలు, స్లాబ్ పూర్తయిన తర్వాత 1.75 లక్షలు, మిగిలిన పనులు పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇంటి స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2BHK ఇండ్లను కేటాయించాలని, అలాగే మొండి గోడలతో ఉన్న 2BHK ఇండ్లను పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకోవడానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ప్రధానంగా 2BHK అసంపూర్తిగా ఉన్న జీహెచ్ఎంసి, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

# కృష్ణా, గోదావరి జలాలపై కుట్రలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. నీటి వాటా విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణకు నష్టం చేయాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కీలక అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి చురుగ్గా స్పందించాల్సిన అవసరం ఉన్నా, కేబినెట్ సమావేశంలో దీనిపై ఎలాంటి చర్చ జరగకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ భవన్‌లో జగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రం ఎదుర్కొంటున్న కీలక సమస్యలపై తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇప్పటికే కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ దోచుకున్న తీరును గుర్తు చేసిన ఆయన, ఇప్పుడు అదే పరిస్థితి గోదావరి జలాలపై పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒక్కటై గోదావరి జలాలను కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. బీజేపీ నేతలూ నిర్లక్ష్యంగా మాట్లాడకూడదని, కేంద్రంలో మంత్రి స్థాయిలో ఉన్న వారు కూడా వాస్తవ పరిణామాలు తెలుసుకోకుండా వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదమన్నారు. గోదావరి-కావేరీ లింక్ అంశాన్ని గొడవగా మార్చి, తన ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకోవాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించిన జగదీష్ రెడ్డి, అపెక్స్ కమిటీ సమావేశం కోసమే ప్రయత్నించాలే తప్ప, చంద్రబాబుతో ప్రత్యక్ష సమావేశం అనే ఆలోచనే తప్పు అని అన్నారు. చంద్రబాబుతో చర్చలకు వెళ్లడం అంటే దాసోహంగా మారిపోయినట్టేనని, తెలంగాణ ప్రభుత్వాన్ని ఈ విషయంలో గట్టిగా స్పందించాలంటూ డిమాండ్ చేశారు. కేసీఆర్ చేసిన సూచనలతో ఇప్పటి పరిస్థితులను పోల్చుతూ, అప్పట్లో కేసీఆర్ సముద్రంలో వృథాగా పోతున్న నీటిని రెండు రాష్ట్రాలు కలిసి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించాలని లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నం పూర్తిగా వక్రదిశలోనిదని, ఆయన లక్ష్యం తెలంగాణ ప్రజల హక్కులను పక్కదారి పట్టించడమేనన్నారు. రైతుల సంక్షేమం పేరుతో ప్రభుత్వం చేస్తున్న సంబరాలపై కూడా జగదీష్ రెడ్డి కఠినంగా స్పందించారు. 'రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసినందుకా సంబరాలు? రైతు భరోసా మూడు విడతలు వాయిదా వేసినందుకా సంబరాలు?' అని ప్రశ్నించారు. రైతులు అంటే కేవలం కొన్ని రాజకీయ నేతల కుటుంబాలేనా అని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు నమ్మి గెలిపించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆంధ్ర ప్రయోజనాలను కాపాడేలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

## కెసిఆర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్

మాట్లాడుతూ..ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు నత్తనడక సాగుతోందని, బిజెపి, కాంగ్రెస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని విమర్శించారు. అందుకే ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో వేగం లేదని అన్నారు. ప్రభాకర్ రావు నిబంధనలు అతిక్రమించి మాజీ సిఎం కెసిఆర్ కోసం పని చేశారని ఈటల రాజేందర్ ఆరోపించారు. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారని మండిపడ్డారు. ప్రభాకర్‌రావు ఐపీఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కేసీఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని భాజపా నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. 'భాజపాను దెబ్బతీయడానికే ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడ్డారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సీబీఐతో విచారణ చేయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది.

# ఇరాన్-ఇజ్రాయిల్ మధ్యముగిసిన యుద్ధం

జారీ చేశారు. యుద్ధం ముగిసిందంటూ ట్రంప్ పోస్ట్ పెట్టారు. కాల్పుల విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని వెల్లడించారు. 24 గంటల్లో సీజ్ ఫైర్ అమలులోకి వస్తుందని చెప్పారు. 12 రోజుల యుద్ధానికి ఇది ముగింపు అని ప్రకటించారు. పశ్చిమాసియాలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. ఇరాన్ పై అమెరికా నుంచి తీవ్రస్థాయి దాడులు చేసిన వెంటనే మరుసటి రోజు ఇజ్రాయెల్ ఆ దేశంపై ముప్పేట దాడులు చేయడంతో ఇరాన్ విలవిలలాడిపోయింది. ఇజ్రాయెల్ చేసిన ఎదురుదాడులను ఇరాన్ ప్రతిఘటించింది. అత్యంత వ్యూహాత్మకంగా ఇజ్రాయెల్ సోమవారం ఇరాన్ సైన్యం ఇరానియన్ రెవెల్యూషనరీ గార్డు (ఐఆర్‌జి) ప్రధాన కార్యాలయంపై బాంబుల వర్షం కురిపించింది. మరో వైపు ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఎవిన్ ప్రిజన్‌ను కూడా ధ్వంసం చేసింది. ఇరాన్ తాజాగా ఇజ్రాయెల్‌పై ట్రూప్రామిస్ త్రీ పేరిట సైనిక చర్యకు దిగిందని సైనిక వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ నగరాలు జెరూసలెం, హఫియా, టెల్ అవీవ్‌పై ఇరాన్ దాడులకు పాల్పడింది. ఈ క్రమంలో ఇరాన్ ,ఇజ్రాయెల్ యుద్ధం ముగిసిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన సోషల్ మీడియా 'ట్రూత్'లో మంగళవారం పోస్టు చేశారు. 'అందరికీ అభినందనలు. ఇజ్రాయెల్, ఇరాన్‌లు పూర్తి కాల్పుల విరమణకు అంగీకరించాయి. మరో ఆరు గంటల్లో చర్యలు ప్రారంభం కానున్నాయి. 12 గంటల్లో యుద్ధం అధికారికంగా ముగియనుంది. తొలుత ఇరాన్ కాల్పుల విరమణను ప్రారంభించనుంది. అనంతరం ఇజ్రాయెల్ దాన్ని అనుసరించనుంది. దీంతో 12 రోజుల యుద్ధానికి ముగింపు కార్డు పడనుంది. ఒక దేశం కాల్పుల విరమణ పాటించేప్పుడు మరో దేశం శాంతి, గౌరవంతో ఉండాల్సి ఉంటుంది. ప్రతిదీ సరిగ్గా జరుగుతుందనే భావిస్తున్నాను. ఇందు కోసం నేను రెండు దేశాలను అభినందించాలనుకుంటున్నాను. ఈ యద్ధం ఏళ్ల తరబడి కొనసాగి ఉంటే పశ్చిమాసియా నాశనమయ్యేది. కానీ అలా జరగలేదు. ఇక ముందూ అలా జరగదు. ఇజ్రాయెల్, ఇరాన్‌తో సహా మధ్యప్రాచ్యం, ప్రపంచ దేశాలతోపాటు అమెరికాకు దేవుడి దయ ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# రైతులే మా ప్రథమ ప్రాధాన్యం

ప్రాధాన్యం రైతులే. రైతుల తర్వాత మహిళలు, యువత మా ప్రాధాన్యం. రైతులకు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చాం.. నిలబెట్టుకున్నాం అని సిఎం అన్నారు.. 25 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ చేశాం. గత ముఖ్యమంత్రి వరి వేసుకుంటే ఉరి వేసుకోవడమే అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సన్నవడ్లు పండిస్తే బోనస్ ఇస్తామని చెప్పాం. అంతేకాకుండా 48 గంట్లలో డబ్బు జమ చేశాం. దేశంలోనే అత్యధికంగా వరి పండించే రాష్ట్రమని గర్వంగా చెప్పుకొంటున్నాం. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.8 లక్షల కోట్లకుపైగా అప్పులు మా నెత్తిన పెట్టి వెళ్లారు. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టడం.. కూలడం కూడా జరిగిపోయింది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుకు ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయి? రాష్ట్రం దివాలా తీస్తే వాళ్లంతా ఎలా సంపన్నులయ్యారు? కేసీఆర్ వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూత వేయించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలు తీసుకువచ్చామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయం. మహిళలు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. వెయ్యి మెగావాట్ల సౌర విద్యుత్‌పై విద్యుత్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నాం. మహిళలకు రూ.21వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చి ఆదుకున్నాం. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల విక్రయానికి చర్యలు చేపట్టాం. శిల్పారామంలో 150 షాపుల ఏర్పాటుకు స్థలం కేటాయించాం. వెయ్యి బస్సులు కొని ఆర్టీసీకి మహిళలు అ÷–దదెకు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. 8 వేల ఐకేపీ కేంద్రాలను మహిళల చేతుల్లో పెట్టాం. పాఠశాలల్లో ఆహార పదార్థాల సరఫరా బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించాం. పదేళ్ల భారాస పాలన, 18 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చ పెట్టాలి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.గోదావరి జలాలపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా?అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. ' అసెంబ్లీలో చర్చ కోసం స్పీకర్‌కు లేఖ రాయాలి. కేసీఆర్ చెప్పిన తేదీన అసెంబ్లీలో చర్చ చేపట్టే బాధ్యతను మంత్రి శ్రీధర్‌బాబు తీసుకుంటారు. ఆధారాలు, సంతకాలతో అసెంబ్లీలో చర్చకు వస్తా. కేసీఆర్ సిద్ధమా?ఒకరోజు గోదావరి జలాలు, రెండో రోజు కృష్ణా జలాలపై చర్చిద్దాం. గతంలో సంతకాలు చేసిన కాగితాలు అసెంబ్లీ ముందు ఉంచుతా' అని సీఎం అన్నారు.రైతునేస్తం సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2016లో బానకచర్లకు పునాది వేసింది కేసీఆరే అని.. రోజమ్మ రొయ్యల పులుసు తిని నీళ్లు అప్పగించింది ఎవరని సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఎవరు తెలంగాణకు ద్రోహం చేశారో చర్చిద్దామంటూ సవాల్ విసిరారు. మా పాలన, మీ పాలనపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. కృష్ణానదిపై కేసీఆర్ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని అన్నారు. గోదావరి బనకచర్ల విషయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. చంద్రబాబుతో ఉండేవాడిని అయితే.. అక్కడే ఉండేవాడినని అన్నారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు కేసీఆర్ సిద్ధమా అని ప్రశ్నించారు సీఎం రేవంత్. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనే దమ్ము కేసీఆర్ కు ఉందా అని అన్నారు. నీటి హక్కుల విషయంలో తెలంగాణకు మరణశాసనం రాసిందే కేసీఆర్ అని మండిపడ్డారు.

## కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం- డిప్యూటి సిఎం భట్టి

కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం.. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా మూలంగా రాష్ట్రంలో సాగు యోగ్యమైన 1.49 కోట్ల ఎకరాలకు 69.70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి 9 వేల కోట్లు వేశామని చెప్పారు. సన్నధాన్యం సాగు చేస్తున్న రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ రూపంలో ఈరోజు వరకు 1,199 కోట్ల రూపాయలు రైతులకు ప్రజా ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. రైతన్నకు ఊహించని ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చేందుకు రైతు బీమా పథకాన్ని అమలు అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం కింద 42.16 లక్షల మంది రైతులకు బీమా అందించామని స్పష్టం చేశారు.రాష్ట్రంలో రూ.22వేల కోట్ల వ్యయంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఒక్కో అసెంబ్లీ స్థానంలో 3వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడాతూ.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 10లక్షల వరకు వైద్య సదుపాయం అందిస్తున్నాం. దీంతో 94లక్షల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. రూ.6వేల కోట్ల విలువైన 189 కోట్లు ఉచిత బస్సు టికెట్లు ఇచ్చాం.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తున్నాం. 93.7లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం. సంక్షేమ కార్యక్రమాలకు రూ. 95,351 కోట్లు ఖర్చు చేస్తున్నాం అని చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పారు. ఇప్పటికే 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని.. మరో 30 వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని స్పష్టం చేశారు. 'నిరుపేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రతి పాఠశాల 25 ఎకరాల్లో.. 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం. మొదటి సంవత్సరం 58 పాఠశాలలు నిర్మించేందుకు 11,600 కోట్లు కేటాయించాంరాష్ట్రంలోని 3.10 కోట్ల మంది పేదలకు ఉగాది నుంచి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. సన్న బియ్యం కోసం ప్రతి సంవత్సరం 13,525 కోట్లు ఖర్చు చేస్తుంది. రాష్ట్రంలోని సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. ఇందుకుగాను తాజా బ్జడెట్లో 23,373 కోట్లు కేటాయించాం.' అని భట్టి వ్యాఖ్యానించారు.

దేశ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లికించదగ్గ రోజు, ఈరోజు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పి రుజువు చేసుకున్నామని అన్నారు. 70 లక్షల మంది రైతులకు తొమ్మిది రోజుల్లో రూ. తొమ్మిది వేల కోట్లు వారి ఖాతాల్లో వేశామని గుర్తు చేశారు. ం

సచివాలయం ముందు ఏర్పాటు చేసిన రైతు భరోసా విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలు త్యాగాలు చేసిన మహాను భావుడు రాజీవ్ గాంధీ అన్నారు. వ్యవసాయం అంటే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటే వ్యవసాయమని తెలిపారు. రైతులకు మద్దతు ధర ఇచ్చింది కాంగ్రెస్, రైతులకు నిధులు ఇవ్వాలని చెప్పింది కాంగ్రెస్.. దేశంలో గ్రీన్ రెవల్యూషన్ తెచ్చింది కాంగ్రెస్ అని చెప్పారు. రైతులకు రూ. 21 వేల కోట్ల రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని.. భూమి లేని నిరుపేద కుటుంబానికి సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని చెప్పామన్నారు. రైతులకోసం బీఆర్ఎస్ ఏమీ చేయలేదని.. రైతులకు ఇవ్వాల్సిన అన్నింటినీ బంద్ చేసిందని విమర్శించారు. రైతు బంధు పేరుతో అరకొర నిధులు వేశారని ఆరోపించారు. చెప్పిన మాట ప్రకారం తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా ఇచ్చిన ప్రజా ప్రభుత్వాన్ని రైతులు ఆశీర్వదించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. 'సంక్షోభం నుంచి సంక్షేమం వైపు వెళ్తున్నాము. ఇతర రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయి. రాజీవ్ గాంధీ సూచనల మేరకు ముందుకు వెళ్తున్నాము. కొంతమంది కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు. 25 లక్షల మందికి రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశాం. మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు ఇతర పార్టీలకు లేదు. నాడు మన్మోహన్ సింగ్ చేశారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం చేసింది. అప్పటి ప్రభుత్వాలు నెలల తరబడి రైతుబంధు అన్నారు. పూర్తిగా కూడా చేయలేదు. తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతు భరోసా వేశాము. కష్టాలు, ఇబ్బందులు ఉన్నా నిధులు విడుదల చేశాం. పాత పథకాలు ఏవీ తీసివేయలేదు. గ్రామీణ తెలంగాణ మా గుండెల్లో ఉంటుంది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లక్ష కోట్లు రైతులకు ఖర్చు చేశాం. మాకు ప్రజలు ఐదు సంవత్సరాలు ప్రజలు సమయం ఇచ్చారు. మేము ఇచ్చిన హామీలు అన్నింటినీ నెరవేర్చి ప్రజల ముందుకు వెళతాం.' అని మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు.

## శ్రీ ఉజ్జయిని మహాకాళి జాతర ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**

శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లు ఏర్పాట్లు ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి( హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి ) పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహకాళి దేవస్థానం నందు ఆషాడ జాతర బోనాలు ఉత్సవాలు జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధ్యక్షతన చేపట్టాగా స్థానిక శాసనసభ్యులు శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, అడిషనల్ సి పి విక్రం సింగ్ మాన్ అలాగే ఆలయ కమిటీ సభ్యులు తో కలసి మంత్రి పాల్గొని ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్ర కలిగిన ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడ జాతర బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని దానికి తగ్గట్టుగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తూ బోనాల జాతరను విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఉజ్జయిని మహాకాళి దేవస్థానం సికింద్రాబాద్ నందు జూలై 13న అమ్మవారికి బోనాలు సమర్పణ, 14 న రంగం ( భవిష్యవాణి) అమ్మవారిని అంబారిపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని, రెండు రోజులలో భక్తులు, ప్రజలు లక్షల్లో తరలి వస్తారని ఆ దిశగా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖ అధికారులు ఆదేశించారు. ముఖ్యంగా 13వ తేదీన దేవాలయంలో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించాలని



దేవాలయ, పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులందరూ సేవా భావం అలాగే బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. అదేవిధంగా రెవిన్యూ దేవాదాయ, పోలీస్, జిహెచ్ఎంసి అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని ముఖ్యంగా 14వ తేదీన అంబారీ ఊరేగింపులో భక్తులు, ప్రజలకు తొక్కిసలాటలు కాకుండా పోలీస్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని అలాగే గోల్కొండ బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, శ్రీ ఉజ్జయిని మహాకాళి బోనాలు, లాల్ దర్వాజా బోనాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. బోనాలు నిర్వహించే దేవాలయాల్లో ఎక్కడ కూడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి సూచించారు. రాష్ట్రం తో పాటు దేశం నలుమూలల నుండి తెలంగాణ బోనాల ఉత్సవాలకు భక్తులు తరలి వస్తారని నిరంతర విద్యుత్, త్రాగునీరు, వాహనాల పార్కింగ్, వాహనాల మళ్లింపు, ట్రాఫిక్ నియంత్రణ, భారీ కేటింగ్ ఏర్పాట్లు, నిరంతరం నీటి నిల్వలు పరిశీలన, పారిశుద్ధ్య పనులు అలాగే మొబైల్ టాయిలెట్స్, సిసి కెమెరాల నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులు మంత్రి ఆదేశించారు.

స్థానిక శాసనసభ్యులు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఉజ్జయిని మహంకాళి బోనాలు అంటేనే తెలంగాణకు ఒక ప్రత్యేకమని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టితో ఏసి పనిచేయాలని, వివిధ శాఖల అధికారులు పోలీసు అధికారుల సర్వీసును ఈ జాతరలో ఉపయోగించుకోవాలని అన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పణ, ఊరేగింపులో భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఏర్పాట్లు ఘనంగా ఉండాలని పేర్కొన్నారు. తదుపరి విద్యుత్ శాఖ, రోడ్డు భవనాలు శాఖ, దేవాదాయశాఖ, రెవిన్యూ శాఖ, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, పోలీస్ శాఖ, అగ్నిమాపక శాఖ, ఆరోగ్యశాఖ లతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ తో కలిసి మంత్రి సమీక్షించారు. ముందుగా మంత్రితో పాటు దేవాదాయ కమిషనర్, జిల్లా కలెక్టర్ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్. కామేశ్వర్, ఆదనపు సి. పి విక్రమ్ సింగ్ మాన్, జాయింట్ కమిషనర్ రామకృష్ణా రావు, టెంపుల్ ఈ. ఓ మనోహర్ రెడ్డి, జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఎస్. సి విద్యుత్ శాఖ చక్రపాణి, ఈ ఈ ఆర్ అండ్ బి మనోహర్, DMHO డాక్టర్. వెంకటి, జి హెచ్ ఎం సి, హెచ్. HMDA, మెడికల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదేళ్లపాటు కాంగ్రెస్‌దే అధికారం

చేయాలని చెప్పారు.'మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేలా పని చేయాలి. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీ కమిటీ నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పని చేస్తేనే పదవులు వస్తాయి. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన వారికి పదవులు ఇచ్చాం. లక్ష్యాలు నిర్దేశించుకొని పార్టీ నాయకులు పని చేయాలని సూచించారు. నేను గ్రామాల్లోకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణలో కులగణన చేసి మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరాం. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకువచ్చాం. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తీసుకువస్తున్నాం. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రియాశీలంగా ఉండాలి. పార్టీ పదవిని కార్యకర్తలు చిన్నచూపు చూడవద్దు. పదవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యకర్తలకే తీరని నష్టం అని సీఎం అన్నారు. రానున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ ఉప ఎన్నికలో గెలవాల్సిందే అని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షీ నటరాజన్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నిక కోసం గ్రేటర్ పరిధిలోని నాయకులందరినీ సమన్వయం చేయాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. ఇక.. అభ్యర్థి ఎంపికకు సంబంధించి గత కొన్ని రోజులుగా చర్చ



నడుస్తోంది. తామే అభ్యర్థులమంటూ కొంతమంది తేల్చిచెబుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి దీనిపై స్పష్టత ఇచ్చారు. ఇంకా అభ్యర్థిని ఖరారు చేయలేదని చెప్పారు. అభ్యర్థి ఎంపికపై ఎవరూ మాట్లాడకూడదని సీఎం ఆదేశించారు. ఏ ఎన్నిక జరిగినా ఒకే పక్రియ ప్రకారం అభ్యర్థి ఎంపిక ఉంటుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కూడా అదే పక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. పదవులు వచ్చిన వాళ్ళు రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఇక.. పీఏసీ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హాట్ హాట్ చర్చ జరిగింది. వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మంత్రులు కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేకపోవడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. ప్రతి చిన్న పనికి మంత్రుల వద్దకు రావడంతో పని భారం పెరుగుతోందని వారు చెప్పుకొచ్చారు. మరోవైపు నిన్న గాంధీ భవన్‌లో గొర్రెలతో నిరసన చేయడంపై సీఎం చాలా సీరియస్ అయ్యారు. గాంధీ భవన్‌లో ఇలాంటివి ఎంటర్ టైన్ చేయొద్దని ఆదేశించారు. నిరసనకు ఓ పరిమితి ఉంటుందన్నారు. కాంగ్రెస్ అందరి అభిప్రాయం తీసుకుంటుంది.. అందరినీ గౌరవిస్తుందన్నారు. ఇది పార్టీ ఆఫీసా ఇంకా ఏమైనానా అని గాంధీభవన్ ఆఫీస్ బేరర్స్‌ను ప్రశ్నించారు. ఇష్టా రీతిలో నిరసనలు చేస్తుంటే ఏం చేస్తున్నారు అని సీఎం ప్రశ్నించారు. పార్టీలో క్రమశిక్షణ దాటితే వేటు తప్పదని సీఎం హెచ్చరించారు. అలాగే ఇంచార్జ్ మంత్రుల పనితీరుపై కూడా సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో నామినేటెడ్ పదవులు భర్తీ చేసే భాధ్యత ఇంచార్జ్ మంత్రులకు అప్పగించినా చేయడం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 99 శాతం గెలిచేలా ఇంచార్జ్ మంత్రులే బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రుల దగ్గర ఫండ్స్ పెట్టామని, వాటిని సరిగ్గా ఉపయో గించడం లేదని పీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్, భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

*స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్*



**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**
ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ కోసం ఢిల్లీ తరహాలో ఆర్డినెన్స్ తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ గారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ నో ప్రాపర్టీ నో లాస్ కింద ఎలాంటి లాభాపేక్ష లేకుండా పనిచేయాల్సినటువంటి విద్యా సంస్థలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయన్నారు. తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ పాఠశాలలో అడుగుపెట్టింది మొదలు పెన్ను,పెన్సిల్ నుండి పుస్తకాలు,యూనిఫామ్లు,షూస్,టై,బెల్ట్ యదేచ్ఛగా అమ్ముతు పాఠశాలలను బిజినెస్ సెంటర్లుగా మార్చారని అన్నారు.అధిక ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా మారాయని అన్నారు.రాష్ట్రంలో విద్య హక్కు చట్టం ఊసే లేదని దీనిపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

## అంజనాదేవి ఆరోగ్యంపై రూమర్లు

- అమ్మ ఆరోగ్యంగా ఉందన్న నాగబాబు

**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**



మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవికి తీవ్ర అనారోగ్యం అని.. హాస్పిటల్ లో జాయిన్ చేశారంటూ ఉదయం నుంచి వార్తలు వస్తున్నాయి. అటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేబినెట్ మధ్యలో నుంచే హైదరాబాద్ వచ్చేస్తున్నాడని.. చిరంజీవి, రామ్ చరణ్ షూటింగ్ క్యాన్సిల్ చేసుకున్ని వస్తున్నారంటూ పుకార్లు వచ్చాయి. తాజాగా వీటిపై నాగబాబు స్పందించారు. 'మా తల్లి ఆరోగ్యం చాలా బాగుంది. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలన్నీ ఫేక్' అంటూ ఖండించారు. ఉదయం నుంచి ఈ రకమైన వార్తలు రావడంతో మెగా ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. కానీ అవేమీ నిజం కాదని తేలిపోయింది. గతంలోనూ ఇలాంటి వార్తలు చాలానే వచ్చాయి. రెండు, మూడు సార్లు చిరంజీవి స్వయంగా స్పందిస్తూ రూమర్లను ఖండించారు. తన తల్లి ఆరోగ్యంపై ఇలాంటివి రాయొద్దంటూ వేడుకున్నారు. కొద్ది నిముషాల క్రితమే ఉపాసన కూడా అంజనాదేవితో చేసిన ఓ వంటల వీడియోను షేర్ చేసింది. దాన్ని బట్టి ఆమెకు ఎలాంటి అనారోగ్యం లేదని తెలుస్తోంది.

## హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల ఉత్సవాలు -2025 వివిధ ఆలయాలకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రులు, ముఖ్య నేతలు

1.శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయం , సికింద్రాబాద్ - **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి** (13.07.25)
2. శ్రీ సింహవాహిని మహంకాళి ఆలయం , లాల్ దర్వాజ హైదరాబాద్ - **ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క** (20.07.25)
3. శ్రీ మహంకాళి సహిత మహాకాళేశ్వర స్వామి దేవస్థానం ,నాచారం ఉప్పల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా - **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి** (20.07.25)
4. శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం కార్వాన్ - **మంత్రి దామోదర రాజనర్సింహ** (20.07.25)
5. శ్రీ భాగ్యలక్ష్మి ఆలయం, చార్మినార్ - **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి** (20.07.25)
6. శ్రీ అక్కన్న మాదన్న ఆలయం, హరి బౌలి - **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
7. శ్రీ కట్టమైసమ్మ ఆలయం, చిలకలగూడ సికింద్రాబాద్ - **పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి** (20.0725)
8. శ్రీ ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానం ,బల్కంపేట - **మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్** (01.07.25)
9. శ్రీ నల్లపోచమ్మ ఆలయం సబ్జిమండి - **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు** (20.07.25)
10. ఖిలా మైసమ్మ ఆలయం ఎన్టీఆర్ నగర్ srr నగర్ - **మంత్రి సీతక్క** (20.07.25)
11. శ్రీ మహంకాళి ఆలయం మీరాలంమండి - **మంత్రి జూపల్లి కృష్ణారావు** (20.07.25)
12. శ్రీ ముత్యాలమ్మ ఆలయం, బేల - **మంత్రి గడ్డం వివేక్ వెంకట్ స్వామి** (20.07.25)
13. శ్రీ మహంకాళి ఆలయం గౌలీపుర (శ్రీ భారతమాత కోట మైసమ్మ ఆలయం) -**మంత్రి వాకిటి శ్రీహరి**
14. శ్రీ జగదాంబ ఆలయం, సుల్తాన్ షాహి - **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్** (20.07.25)
15. శ్రీ జగదాంబ మహంకాళి ఆలయం, గోల్కొండ కోట - **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్** (26.06.25)
16. శ్రీ మహంకాళి ఆలయం, ఉప్పుగూడ - **గుత్తా సుఖేందర్ రెడ్డి శాసన మండలి చైర్మన్** (20.07.25)
17. శ్రీ బంగారు మైసమ్మ ఆలయం, బోయిగూడ - **రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్** (20.07.25)
18. శ్రీ బంగారు మైసమ్మ ఆలయం,హరి బౌలి - **గద్వాల విజయ లక్ష్మీ, జీహెచ్ఎంసీ మేయర్** (20.07.25)
19. శ్రీ మహంకాళి ఆలయం, అంబర్ పేట - **బండా ప్రకాష్ ,శాసన మండలి డిప్యూటీ చైర్మన్** (20.07.25)
20. శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం,అలియాబాద్ - **జాటోథ్ రామచందర్ నాయక్ డిప్యూటీ స్పీకర్**(20.07.25)

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**

## ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ఆర్టీసీ నూతన బస్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**కామారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 24:**
ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో ఆర్టీసీ నూతన బస్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు ,లక్ష్మీకాంత రావు ,జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ,ఇతర ముఖ్య నేతలు అధికారులు.. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మదన్ మోహన్ ఎప్పుడు కలిసిన ఎల్లారెడ్డి కి బస్ డిపో అడుగుతుండే వారు.. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సహాయం చేయడానికి ఆయన శాసన సభ్యులు అయ్యారు.. హైదరాబాద్ లో ఎప్పుడూ కలిసిన ఎల్లారెడ్డి బస్ డిపో అడుగుతారు తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం రాకముందు ఆర్టీసీ మూతపడే పరిస్థితి ఉండేది.. ఒక్క కొత్త బస్సు కొనలేదు..ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజా పాలన





ప్రభుత్వం ఏర్పడగానే 48 గంటల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించాం ఇప్పటి వరకు 190 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించాం.. 6300 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు.. తెలంగాణ ఉద్యమంలో నై చెలగ బస్సు క పయ్య అని ఉద్యమాన్ని చేశారు .వారు సమ్మె చేసి మరణిస్తున్న పట్టించుకోలేదు మా ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నాం మేము రెండు కొత్త బస్సు డిపో లు పెద్దపల్లి జిల్లా కేంద్రం ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం కు అందించాం ఎల్లారెడ్డి బస్ డిపో పై ముఖ్యమంత్రి గారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం చరిత్ర లో 9 రోజుల్లో 9 వేల కోట్ల పంట పెట్టుబడి సహాయం అందించాం గతంలో పంట పెట్టుబడి సహాయం మూడు నెలల వరకు ఇచ్చేది.. మేము 9 రోజుల్లో 9 వేల కోట్లు వేశాం దేశంలో29 రాష్ట్రాలు ఉంటే సన్న బియ్యం పంపిణీ తెలంగాణ లో మాత్రమే ఇస్తున్నాం 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్,సన్న వడ్లు బోనస్ ,రైతు రుణమాఫీ , ఇందిరమ్మ ఇళు ఇస్తున్నాం 10 ఏళ్లలో ఎంత మందికి డబుల్ బెడ్ రూం లు ఇచ్చారు..మేము ఒక సంవత్సరంలోనే ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే కార్యక్రమం ప్రభుత్వం తీసుకుంది 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారా.. ఇప్పుడు అప్లికేషన్ పెట్టుకోగానే రేషన్ కార్డు ఇస్తున్నాం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచడానికి రాజీవ్ యువ వికాసం తీసుకొస్తున్నాం కరీంనగర్ ఎంపీగా ఢిల్లీ వేదికగా సోనియా గాంధీ గారిని ఒప్పించడానికి శక్తి మేర పని చేశా. 10 ఏళ్లలో ఆర్థిక విధ్వంసం చేశారు.. అనేక సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి చేస్తున్నాం విద్యార్థి రైతు, కార్మికులు సంతోషంగా ఉండేలా అనేక కార్యక్రమాలు చేశాం మదన్ మోహన్ గారికి హృదయ పూర్వక అభినందనలు బస్ స్టేషన్ నిర్మాణం ,కొత్త బస్సుల ఏర్పాటు పై వారికి అభినందనలు జుక్కల్ ఎల్లారెడ్డి కి అనుసంధానంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నాం శాసన సభలో మదన్ మోహన్ త్వరగా స్పందిస్తారు నిద్రలో లేచిన నుండి ఎల్లారెడ్డి అభివృద్ధి పై మాట్లాడతారు.. నేను 1999 లో NSUI అధ్యక్షుడిగా మార్క్ ఫేడ్ చైర్మన్ గా ఎంపీ గా ఇప్పుడు హుస్నాబాద్ ఎమ్మెల్యే గా గెలిచి మంత్రి అయ్యాను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి ప్రజా సమస్యలపై పోరాడాలి..

## నేటి నుంచి బీసీ చేతి వృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం

- బోనాల ఉత్సవాల సందర్భంగా ఎగ్జిబిషన్
- హాజరుకానున్న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాకారులు
- పర్యావరణ హితం, చేతివృత్తుల వారికి చేయూత
- బీసీ చేతి వృత్తుల వారి ఉత్పత్తులకు మార్కెటింగ్
- ఐదు రోజుల ఎగ్జిబిషన్ నేడే ప్రారంభం
- తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి చేతివృత్తుల ప్రదర్శన
- ప్రారంభించనున్న బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హాజరుకానున్న మంత్రులు, అధికారులు, సంఘాలు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**
తెలంగాణ ప్రభుత్వము బోనాల ఉత్సవాల సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25-06-2025 నుండి 29.06.2025 వరకు ఐదు (5) రోజులు బి.సి. చేతివృత్తుల కళాకారులచే తయారుచేసిన వివిధ వస్తువుల ప్రదర్శన మరియు అమ్మకం (Exhibition cum sale) నిర్వహిస్తున్నారు. ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల ప్రదేశములో ప్రతిష్టాత్మకంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారుచేసిన మట్టిపాత్రలు, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, పూసలవారి సామగ్రి అలాగే పోచంపల్లి, గద్వాల, నారాయణ పేట మొదలైన చేనేత ఉత్పత్తులు, గౌడన్నలచే 'నీరా' స్టాల్, ఇతర బిసి వర్గాలు తయారుచేసిన వస్తువులు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేపలు, రొయ్యల వంటకాలు మరియు ఇతర భోజన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయత్రం 09:30 గంటల వరకు ఉంటుంది. ప్రవేశము ఉచితము. బీసీ చేతివృత్తుల వారి పర్యావరణ హితమైన ఉత్పత్తుల ప్రదర్శనకు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలి. ఈ ప్రదర్శనను తిలకించి వారికి నచ్చిన వస్తువులు, పర్యావరణ హితమైన, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఉత్పత్తులు కొనుగోలు చేసి చేతివృత్తుల వారికి చేయూత ఇవ్వాలని, ఈ ప్రదర్శన విజయవంతము చేయాలని బి.సి. సంక్షేమ శాఖ తరపున మంత్రివర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు కోరడమైనది.

## డ్రగ్స్‌తో లక్షలు సంపాదించాలన్న ఆశ

- పోలీసులకు దొరకి ఉన్న ఉద్యోగం పోగొట్టుకున్న టెక్కీ

**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**
సాఫ్ట్వేర్ ఉద్యోగంతో వస్తున్న లక్షల జీతాలు సరిపోవంటూ డ్రగ్స్ అమ్మకాలకు దిగడంతో చేస్తున్న ఉద్యోగం ఊడింది. ఒకటికి రెండుసార్లు ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడి ఊచలు లెక్కించాల్సిన పరిస్థితి ఏర్పాడింది. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన వి. వెంకట జగదీశ్వర్ రెడ్డి (25) అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవులపల్లి ప్రాంతం మైఫిల్ హోటల్ సమీపంలో డ్రగ్స్ ను తీసుకు వెళ్తుండగా డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్ మంగళవారం తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద 23.3 ఎండీఎంఏ డ్రగ్స్, సెల్ ఫోన్, బైకును స్వాధీనం చేసుకున్నారు. బీటెక్ చదివి బెంగళూరులో కాట్నీ వెల్ అనే సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ అక్కడే డ్రగ్స్ కి అలవాటు పడ్డాడు.బెంగళూరుకు చెందిన సైఫ్ షరీఫ్ అనే వ్యక్తి వద్ద రూ. 1500 ఒక గ్రాము చొప్పున ఎండీఎంఏ డ్రగ్స్ ను కొనుగోలు చేసి హైదరాబాదులో రూ. ఐదు వేల నుంచి రూ. 8 వేల వరకు గ్రామ చొప్పున అమ్మకాలు జరుపుతున్నాడు. ఈ మధ్యనే ఎండీఎంఏ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి కండిషన్ బెయిల్ పై బయటకు వచ్చాడు. మళ్లీ డ్రగ్స్ తో మంగళవారం డీటీఎఫ్ శంషాబాద్ టీంకు పట్టుబడ్డాడు. డ్రగ్స్ అమ్మకాలతో మొదటగా ఉప్పల్లో పట్టుబడటంతో చేస్తున్న సాఫ్ట్వేర్ ఉద్యోగం పోయింది. కేసు పూర్వపరాలను శంషాబాద్ ఏఎస్ అయినేని శ్రీనివాసరెడ్డి శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో పోలీస్ వివరించారు.



# సంపాదకీయం..

## హమ్మయ్య యుద్ధం ముగిసింది !

ఇది యుద్ధాల కాలం. ఎవరు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తారో తలియని కాలమిది. ఉక్రెయిన్ రష్యాల మధ్య మాత్రం యుద్ధం ఇంకా కొనసాగుతోంది. గత నాలుగైదేళ్లుగా పరస్పరం ఆయుధాలతో తలపడుతూనే ఉన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీన మధ్య యుద్ధం నిరంతరంగా సాగుతూనే ఉంటుంది. ఈ క్రమంలో భారత్‌లో ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసింది. కానీ పాక్ ప్రతిగా ఇండియాపై దాడికి తెగించింది. దీంతో భారత్ ధీటుగా స్పందించి, పాక్ రెక్కలు విరిచింది.

దీంతో దిక్కుతోచని పాక్ కాళ్ల బేరానికి వచ్చింది. యుద్ధం ఆపాలన్న వినితపై మరోమాట లేకుండా భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. దీంతో జరగాల్సిన యుద్ధం ఆగిపోయింది. అయితే ఈ యుద్ధాన్ని తానే ఆపించానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు భంగపాటు తప్పలేదు. కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదని ప్రదాని మోడీ తేల్చేశారు. ఇకపోతే ఇది ముగిసిన కొన్నాళ్లకే ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేసింది. ఇరాన్ కూడా ప్రతిదాడులతో తెగబడింది. చివరకు అమెరికా కూడా రంగంలోకి దిగి ఇరాన్‌పై ప్రతాపం చూపింది. చివరకు పక్షం రోజులకు కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయి. ఇక్కడా తానే యుద్ధాన్ని ఆపాలని కోరినట్లుగా ట్రంప్ ప్రకటించారు. మొత్తంగా పశ్చిమాసియాలో యద్ధభయం ముగిసింది. లేకుంటే చమురు ధరలపై విపరీత ప్రభావం పడేది. అలాగే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇది ప్రభవం చూపేది. ఆయుధ సంపత్తి కలిగిన దేశాలు తమ ఆయుధానలు పరీక్షించు కోవడానికి ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నాయి. రష్యా దాడులు మాత్రం ఆపడంలేదు. ఉక్రెయిన మాదేనంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన చేశాడు. నిజానికి ఆయా దేశాల నేతల యుద్ధకాంక్షల వల్ల సామాన్యులు నలిగి పోతున్నారు. పూర్వం కూడా రాజులు ఇలాగే నిరంతరంగా యుద్ధాలతో కాలం గడిపేవారు. రాజ్యాలను కొల్లగొట్టేవారు. ఇప్పుడు మరో రూపంలో సామ్రాజ్యవాదం కొనసాగుతోంది. తమ పెత్తనాన్ని అంగీకరించడం లేదన్న ఏకైక కారణంతో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి తెగించింది. ఇరాన్ అణ్వస్త్ర ప్రయోగాలు చేస్తోందన్న కారణంతో ఇజ్రాయిల్, అమెరికాలు దాడికి తెగించాయి. ఈ దాడలతో ఇరాన్‌కు జరగాల్సిన నష్టం జరిగింది. అయితే పెద్దన్న పాత్రను పదిలపర్చుకోవాలన్న అమెరికా ఈ తరహా దాడులను ప్రోత్సహించడం సరికాదు. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో, పరోక్షంగా అన్నీతానై ఇజ్రాయెల్‌తో కథనడిపించిన అమెరికా, ప్రత్యక్షంగా దిగాలా వద్దా అన్న నిర్ణయాన్ని ఓ రెండువారాల్లో తీసుకుంటానని ట్రంప్ ప్రకటించాడు. జి7 సదస్సు నుంచి అర్థాంతరంగా అమెరికా చేరుకున్నారు. వచ్చీ రాగానే పథక రచన చేసి గత ఆదివారం ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో తనను తాను యుద్ధవ్యతిరేకిగా ప్రచారం చేసుకున్న ట్రంప్ స్వయంగా యుద్దానికి సై అన్నాడు. అయితే ఇరాన్ దెబ్బతినడంతో ఇక లాభం లేదనుకుని యుద్ధాన్ని ముగిస్తున్నట్లుగా ప్రకటించారు. అమెరికా నిరంతర యుద్దాల్లో మునిగితేలడంతో ప్రపంచంలో అశాంతి చెలరేగిందంటూ ఆరోపిస్తూ వచ్చిన ట్రంప్ , తాను అధికారంలోకి రాగానే అన్ని యుద్దాలనీ ఆపేసి ప్రపంచానికి శాంతినిస్తానన్నాడు. ఆర్నెల్లకాలంలోనే ఆయన తన అసలు రంగును బయటపెట్టాడు. ఆదివారం తెల్లవారుజామున ఏడు బి2 స్పిరిట్ బాంబర్లు ఇరాన్‌లోకి ప్రవేశించి, మూడు అణుస్థావరాలమీద బంకర్ బస్టర్ బాంబులు కురిపించాయి. ఇజ్రాయెల్ చేద్దామనుకున్న పనిని తానే స్వయంగా పూర్తిచేశారు. ఫర్డో, నతాంజ్ పాటు, శుద్ధిచేసిన యురేనియంను భారీ ఎత్తున నిల్వచేసిన ఇసఫహాన్ అణుకేంద్రాన్ని నాశనం చేయడానికి అదనంగా సబ్‌మెరైన్లనుంచి ప్రయోగించిన టామాహాక్ క్రూయిజ్‌మిసైళ్ళను ఉపయోగించారని వార్తలు వచ్చాయి. బీటూ బాంబర్లు, వందలాది యుద్ధవిమానాలు, సబ్‌మెరైన్లతో సహా సర్వశక్తులనూ వాడి అమెరికా జరిపిన ఈ దాడిలో ఇరాన్ అణుస్థావరాలు ధ్వంసమైపోయాయి. పూర్తిగా, సమూలంగా వాటిని తుడిచిపెట్టేసినట్టు ట్రంప్ ప్రకటించాడు. చివరకు ఫలితం తేలింది కనుక యుద్ధం ముగిస్తున్నట్లు ప్రకటించాడు. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం ఎన్‌పిటీలో భాగస్వామి కాకుండా, భారీగా అణ్వాయుధాలు పోగేసుకున్న ఇజ్రాయెల్, ఆ ఒప్పందంమీద సంతకం చేసిన ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు పోగుబడివున్నాయన్న ఆరోపణతో, ఇరాన్‌ను నిరాయుధం చేయడమే తన లక్ష్యంగా ప్రకటించి జూన్ 13న ఈ యుద్ధంలోకి దిగింది.

కదనరంగంలోకి అమెరికా ప్రత్యక్షప్రవేశంతో ఆ మూడు అణుకేంద్రాలను నాశనం చేయడమనే లక్ష్యం పరిపూర్ణమైంది. అందుకే వెంటనే యుద్ధం ఆగిపోవాలి. ప్రపంచం ఇక కంటినిండా నిద్రపోవచ్చునని ప్రకటించి యుద్ధ విరమణను ప్రకటించేశాడు. అణుస్థావరాల నాశనంతో ఇరాన్ కాళ్ళబేరానికి వస్తుందని ట్రంప్ నమ్ముతున్నారు. శాంతిచర్చలకు, ఒప్పందాలకు కాలం చెల్లిందని, ఇక ప్రతీకారమే మిగిలిందని ప్రకటించిన ఇరాన్ కూడా శాంతిని కోరుకుంటూ యుద్ధ విరమణకు ముందుకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఎందుకంటే ఇందులో ఎవరు పట్టుదలకు పోయినా మారణహోమం తప్పదు. ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించినా ఆపని చేసే శక్తి లేదనే చెప్పాలి. దోహాలో ఉన్న అమెరికా స్థావరంపై దాడి చేసినా అది కూడా నామమాత్రమనే చెప్పుకోవాలి. ఇరాన్‌కు అత్యంత సమీపంలోనే అది గట్టిగాదెబ్బతీయగల దూరంలోనే అమెరికా స్థావరాలు అనేకం ఉన్నాయి. అయినా సాహసం చేయలేకపోయింది. హోర్ముజ్ జలసంధి మూతబడే ప్రమాదం ఉందంటూ వార్తలు రావడంతో స్టాక్‌మార్కెట్లు తలకిందులయ్యాయి. చమురుధరలు అమాంతంగా పెరిగాయి. ఎగబాకుతున్నాయి. ఇరాన్‌కు మాటసాయం చేస్తున్న దేశాలు ఆయుధాలతో ఆదుకుంటాయన్న నమ్మకం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రపంచానికి ఇంధనాన్ని సమకూర్చే ఈ కీలకమైన ప్రాంతం యుద్ధజ్వాలల్లో కొనసాగడం సరికాదు. ఇదే ప్రపంచ దేశాలూ కోరుకున్నాయి. దీంతో ఎట్టకేలకు యుద్ధం ముగిసిందన్న ప్రకటన ప్రపంచ దేశాలకు ఊరటనిచ్చే అంశంగా చూడాలి.

# ట్రంప్ ప్రకటనపై సానుకూలత

- యుద్ధాన్ని ఆపేస్తున్నట్లు ఇరాన్ అంగీకారం

**టెహ్రాన్,జూన్ ( వెలుతురు):**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు క్షణక్షణానికో మలుపు తిరుగుతున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణకు ఒప్పందం జరిగినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించినప్పటికీ.. ఇంకా ఘర్షణలు కొనసాగాయి. ఈ క్రమంలోనే ఇరాన్ తాజాగా కీలక ప్రకటన చేసింది. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం మొదలైనట్లు అధికారికంగా ప్రకటించింది. ఈమేరకు టెహ్రాన్ అధికారిక మీడియా వెల్లడించింది. అటు ట్రంప్ కూడా దీనిపై స్పందించారు. 'కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చింది. దయచేసి దాన్ని ఉల్లంఘించొద్దు' అని అమెరికా అధ్యక్షుడు తన ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఆ పక్రియ ఎలా జరగనుందనే దాన్ని కూడా ఆయన అందులో వివరించారు. 'ఇప్పటినుంచి దాదాపు ఆరు గంటల తర్వాత ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పరం తుదివిడత దాడులు పూర్తి చేసుకొని కాల్పుల విరమణ ఒప్పందానికి వస్తాయి. తొలుత అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత ఇరాన్ కాల్పుల విరమణను మొదలు పెట్టాల్సిఉంటుంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి ఇజ్రాయెల్ కాల్పుల విరమణను మొదలుపెడుతుంది. అలా 12 గంటలు ముగిసిన తర్వాత



12 రోజుల యుద్ధానికి అధికారిక ముగింపు లభిస్తుంది. ఈ ఒప్పందం అమల్లో ఉన్న వేళ పరస్పరం శాంతియుతంగా, గౌరవ ప్రదంగా వ్యవహరించాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. అన్నట్లుగానే ఇరాన్ తొలుత కాల్పుల విరమణను ప్రకటించింది. ఇక్కడి నుంచి 12 గంటల తర్వాత ఇజ్రాయెల్ కూడా దీన్ని పాటించాల్సి ఉంటుంది. అయితే, తాజా పరిణామాలపై ఇజ్రాయెల్ (ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. అయితే, కాల్పుల విరమణను ప్రకటించడానికి చివరి నిమిషం వరకు టెహ్రాన్ దాడులకు పాల్పడింది. పలు దఫాలుగా ఇజ్రాయెల్ పైకి క్షిపణులు ప్రయోగించింది. దీని కారణంగా బీర్‌షెబాలోని ఓ భవనం తీవ్రంగా దెబ్బతింది. ఈ ఘటనలో నలుగురు మృతిచెందగా.. పలువురు గాయపడినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఈ కాల్పుల విరమణ ఒప్పందం గురించి తొలుత ఇరాన్ చేసిన ప్రకటనలు గందరగోళానికి గురిచేశాయి. తాము ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని, ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే తామూ ఆపేస్తామని టెహ్రాన్ విదేశాంగ మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ తర్వాత కాసేపటికే.. టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ సైనిక కార్యకలాపాలు ముగిశాయని అర్థం వచ్చేలా పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దురాక్రమణకు వ్యతిరేకంగా తమ సాయుధ దళాలు చివరివరకు శక్తిమంతమైన పోరాటం కొనసాగించాయని చెబుతూ.. కాల్పుల విరమణకు సిద్ధమేనన్న సంకేతాలిచ్చారు.

## కాల్పు విరమణ ప్రకటనతో దిగొస్తున్న క్రూడాయిల్ ధరలు

- స్టాక్ మార్కెట్లలో సానుకూల పవనాలు

**న్యూఢిల్లీ,జూన్( వెలుతురు):**



కాల్పు విరమణ ప్రకటనతో దిగొస్తున్న క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. స్టాక్ మార్కెట్లలో సానుకూల పవనాలు మొదలయ్యాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా కలవరపెట్టిన క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా దిగొచ్చాయి. ఇజ్రాయెల్- ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో ముడిచమురు ధరలు 5 శాతం మేర తగ్గుముఖం పట్టాయి. ఈ ప్రకటన అనంతరం బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 3.53 డాలర్లు లేదా 4.94 శాతం తగ్గుముఖం పట్టి 67.95 డాలర్లు వద్ద ట్రేడవుతోంది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ రకం కూడా 5 శాతం మేర క్షీణించి బ్యారెల్ 65 డాలర్ల వద్ద కొనసాగుతోంది. వారం కనిష్ఠానికి చేరాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో ఇటీవల అమెరికా కూడా జత కలిసిన సంగతి తెలిసిందే. ఇరాన్ అణుస్థావరాలపై యూఎస్ దాడి చేసింది. దీంతో హర్మూజ్ సంధిని మూసివేత దిశగా ఇరాన్ అడుగులు వేసింది. ఇదే జరిగితే బ్యారెల్ చమురు ధర 80 డాలర్లు దాటుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. దీనివల్ల ప్రధానంగా దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ద్రవ్యలోటు పెరగడంతో పాటు ద్రవ్యోల్బణమూ పెరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ ట్రంప్ ప్రకటించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. మరోవైపు ఈ వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కూడా దూసుకెళ్తున్నాయి. మధ్యాహ్నం సమయానికి సెన్సెక్స్ 945 పాయింట్ల లాభంతో 82,842.37 వద్ద కొనసాగుతుండగా.. నిఫ్టీ సైతం 302 పాయింట్ల లాభంతో 25,274.55 వద్ద ట్రేడయ్యింది.





## కాల్పుల విరమణను అంగీకరించిన ఇజ్రాయిల్

**టెల్ అవీవి,జూన్( వెలుతురు):**

పశ్చిమాసియాలో యుద్ధం చల్లారినట్లే కన్పిస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరు దేశాలు అంగీకరించాయి. ఇప్పటికే టెహ్రాన్ కాల్పుల విరమణను మొదలుపెట్టగా.. సీజ్ ఫైర్‌ను తామూ అంగీకరిస్తున్నట్లు ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ నుంచి అణుముప్పు తొలగిపోయిందని నెతన్యాహు అందులో పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## రియల్ మోసంలో వైకాపా నేత తనయుడు

- ఒంగోలులో ఎపి ఇన్‌ఫ్రాకాన్ నేత విజయ్ అరెస్ట్
- గాలింపుతో పట్టుకున్న సైబరాబాద్ పోలీసులు

**ఒంగోలు,జూన్( వెలుతురు):**

రియల్ ఎస్టేట్ పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన విజయవాడ వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ గోగుల రమణారావు కుమారుడు లక్ష్మి విజయ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ స్కీంల పేరుతో విజయ్ చీటింగ్‌కు పాల్పడ్డాడు ఏపీ ఇన్ ఫ్రాన్ పేరుతో 22 రకాల ప్రాజెక్టుల పేర్లు చెప్పి కోట్ల రూపాయలు వరకు ప్రజల నుంచి వసూలు చేశాడు. అయితే పెట్టుబడి పెట్టిన వారికి ప్లాట్లు ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డాడు. కాలం గడుస్తున్నప్పటికీ తమకు ప్లాట్లు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు ఒంగోలులో లక్ష్మి విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో దాదాపు 200 మంది బాధితులను లక్ష్మి విజయ్ కుమార్ మోసం చేసినట్లు తెలుస్తోంది. వెయ్యి కోట్లు టర్నోవర్ ఉన్న పెద్ద రియల్ ఎస్టేట్ సంస్థ అంటూ జోరుగా ప్రచారం చేశాడు. ఎత్తైన భవనాలు, ఆకర్షణీయ వెంచర్లను చూపి ప్రజలను ఆకర్షించే ప్రకటనలు చేశాడు.

పథకాల పేరుతో దగా చేసిన వైనం బయటపడింది. అమ్మకాలు అద్భుతంగా ఉన్నాయంటూ మోసం చేసి ప్రజల నుంచి కోట్లలో వసూలు చేశాడు. విజయ్ కుమార్‌ను నమ్మి అద్భుతమైన ప్లాట్లు సొంతమవుతాయని భావించిన బాధితులు తమ దగ్గర ఉన్నదంతా పెట్టుబడిగా పెట్టేశారు. అయితే ఎన్ని రోజులైనా విజయ్ కుమార్ ప్లాట్లు ఇవ్వకపోవడంతో అతడిని నిలదీశారు. అడిగిన వారిని వాట్సప్ గ్రూపుల్లో తొలగించి, కార్యాలయానికి రాకుండా ఆంక్షలు విధించాడు విజయ్. స్కీమ్-1లో రూ.2 నెలవారి వడ్డీ, స్కీమ్-3లో రూ.3 వడ్డీ మూడు నెలలకు ఒకసారి చెల్లింపులు అంటూ చేతులెత్తేశాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ప్రభుత్వం కూడా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి లక్ష్మి విజయ్‌ను అరెస్ట్ చేసేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే కేసు నమోదు అవడంతో పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. కానీ చివరకు ఒంగోలులో విజయ్ కుమార్‌ను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

- లెక్కల మాస్టార్‌పై పోక్సో కేసు నమోదు
- విధుల నుంచి తొలగించిన ప్రభుత్వం

**సిమ్లా,జూన్( వెలుతురు):**

24మంది విద్యార్థినులను వేధించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఆ ఉపాధ్యాయుడుని విధుల నుండి తొలగించడంతో పాటు మూడు రోజుల పాటు కస్టడీ విధించినట్లు వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో సిర్మౌర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో నిందితుడు గణితశాస్త్రం బోధిస్తున్నాడు. 8వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయుని వేధింపుల గురించి పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు తమను అనుచితంగా తాకాడని 24 మంది విద్యార్థులు ప్రిన్సిపల్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులను ఒక సమావేశానికి పిలిపించారు. వారిలో చాలామందికి తమ పిల్లలు ఎదుర్కొంటున్న వేధింపుల గురించి తెలియదని తేలింది. అనంతరం పాఠశాల అధికారులు ఈ ఫిర్యాదును పాఠశాల లైంగిక వేధింపుల నిరోధక కమిటీకి పంపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం సాయంత్రం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల కస్టడీ విధించినట్లు తెలిపారు. విద్యాశాఖ సైతం వెంటనే స్పందించిందని, నిందితుడుని తక్షణమే సస్పెండ్ చేసిందని అధికారులు తెలిపారు. 'తీవ్రమైన,సున్నితమైన సమస్య'గా పేర్కొంటూ పాఠశాల డైరెక్టర్.. ఈ ఘటనపై వెంటనే విచారణ జరపాలని డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించారు.





## విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం

- రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు
- రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసి చూపాం: తుమ్మల



**హైదరాబాద్,జూన్24( వెలుతురు):**

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళ్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉద్ఘాటించారు. రేవంత్‌రెడ్డిలా వ్యవసాయంపై ఇంత సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని అన్నారు. కొంతమంది బీఆర్ఎస్, బీజేపీ నేతలు రేవంత్‌రెడ్డిని చూసి కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్నవారు కూడా తమపై విమర్శలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. రూ. 2లక్షల్లోపు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేస్తామని అన్నామని.. అలాగే చేశామని గుర్తుచేశారు. రైతునేస్తం సభలో ఆయన మాట్లాడుతూ..తమను విమర్శించే హక్కు బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని చెప్పారు. బీజేపీ కూడా కేంద్రంలో రూ. 4లక్షలు రుణమాఫీ చేయాలని సవాల్ విసిరారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఐదు నెలల వరకు కూడా రైతుబంధు వేయలేదని.. కానీ ఇప్పుడు తమ ప్రభుత్వానికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా తొమ్మిది రోజుల్లోనే రూ. 9వేల కోట్ల రైతు భరోసా ఇచ్చామని ఉద్ఘాటించారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. 9 రోజుల్లోనే రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేస్తామంటే కొందరు నేతలు నమ్మలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్త పథకాలు తెస్తున్నామని వెల్లడించారు. ఏడాది కాలంలోనే రేవంత్ ప్రభుత్వం రైతుల కోసం లక్ష కోట్లు ఖర్చు చేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా రైతులను మరువబోమని చెప్పారు. తమ ప్రభుత్వం ఇంకా చాలా పథకాలు తీసుకురాబోతుందని ఉద్ఘాటించారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన తర్వాతనే తమకు ఓటు వేయమని అడుగుతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. నిజంగానే ఈరోజు దేశ చరిత్రలో లిఖించదగిన రోజని తెలిపారు. తొమ్మిది రోజుల్లోనే రూ. 9000 కోట్లు రైతుల ఖాతాల్లో వేయడం దేశ చరిత్రలో ఇంతవరకు ఎక్కడ జరగలేదని చెప్పారు. 'వ్యవసాయం అంటే కాంగ్రెస్. వ్యవసాయం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులు కట్టిందే కాంగ్రెస్. రైతుల కోసం ఉచిత కరెంట్‌ని, గిట్టుబాటు ధరను తెచ్చిందే కాంగ్రెస్. హరిత విప్లవాన్ని తెచ్చిందే కాంగ్రెస్. ఏ రాజకీయ పార్టీ వ్యవసాయం, రైతుల గురించి ఆలోచించలేదు. రైతుల కోసం బీఆర్ఎస్ ఏమి చేయలేదు. అందరి ఖాతాల్లో రూ. 9000 కోట్లు వేస్తామని చెప్పామని.. అలానే వేశాం అని పేర్కొన్నారు.

## బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి దాతల చేయూత...

- మానవత్వం చాటుకున్న ఎన్టీఆర్ అభిమానులు...
- దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన టిడిపి నేత జె.దశరథ్



**వెలుతురు, హైదరాబాద్ జూన్ 24:** బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభించి, 25 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఎన్టీఆర్ అభిమానులు ఉడుత భక్తిగా ఆసు పత్రి సిఎండి, సినీ నటుడు నంద మూరి బాలకృష్ణకు చెక్కును అంద జేసి మానవత్వాన్ని చాటి చెప్పారు. ఏన్టీఆర్ అభిమానులు అయిన పు చ్చకాయల చంద్రమౌళి, శైలజ బోప న ప్రవీణ్ లు ప్రత్యేకంగా బసవతా రకం క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్ళి ఆ సుపత్రి సి.ఎం.డి. నందమూరి బాల కృష్ణకు ప్రత్యేకంగా రూ.25 వేల చె క్కును అందజేసి, మానవత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా దాత లందరికి సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ప్రత్యేకంగా దాతలను అభినందించారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చెక్కులు అం దించి వారిలో పుచ్చకాయల చంద్ర మౌళి (రూ. 25వేలు), బొప్పన ప్రవీ ణ్ కుమార్ (రూ. 10వేలు), ఆర్.ఎ స్. శైలజ (రూ.10వేలు), తురగా సూర్యారావు (రూ. 10వేలు),పి. రవిచంద్ర (రూ.10వేలు) ఉన్నారు. క్యాన్సర్ ఆసుపత్రి రోగులకు అం దిస్తున్న సేవలకు స్పందించి, వారం దరు తమవంతు బాధ్యతగా మాన వత్వంతో స్పందించి, ఆస్పత్రి సిఎం డి బాలకృష్ణకు చెక్కు అందించి నందుకు దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు టిడిపి. జాతీయ ప్రచార కార్యదర్శి నేత దశరథ్ ఒక ప్రకటనలో చెప్పా రు.

## డాక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### - డీ.ఎం.హెచ్.వో డాక్టర్ ఉమా గౌరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వెలుతురు జూన్ 24:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అర్హత కలిగిన MBBS డాక్టర్లను నియామకానికి ఎంపిక చేయడం జరుగుతోంది. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ నమోదు కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చును. ఈ నియామకం కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ పద్ధతులపై ఉంటుంది. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (UPHCs) - 13 పోస్టులు, కుకట్‌పల్లిలోని హెల్త్ & వెల్‌నెస్ సెంటర్ (HWC)లో - 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకోవచ్చు: https://medchal-malkajgiri.telangana.gov.in దరఖాస్తులను 27.06. 2025 లోపు, ఉదయం 11:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తారు. అభ్యర్థులు తమ పూర్తి దరఖాస్తు ఫారం, అవసరమైన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు మరియు రూ.500/- విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను "District Medical & Health Officer, Medchal-Malkajgiri District" పేరిట తీసుకొని, కింది చిరునామాకు స్వయంగా సమర్పించాలి, జిల్లా వైద్య మరియు ఆరోగ్యాధికారి కార్యాలయం,ఫస్ట్ ఫ్లోర్, ఎఫ్-1, ఐడీఓసి, అంతాయిపల్లి ,మెడ్చల్-మల్కాజిగిరి జిల్లా అని తెలిపారు

## విద్యా కమిషన్ సభ్యుడుని కలిసిన నాగేంద్ర....




**వెలుతురు, చారకొండ జూన్ 24:** మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అనిశెట్టి నాగేంద్ర మంగళవారం రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చారకొండ మండలానికి విద్యారంగంలో అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.

## మహనీయుల విగ్రహాలకు భద్రత కల్పించాలి



**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూన్ 24:** వికారాబాద్ జిల్లా పుట్టపహాడ్ లో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకుడు సంభు వెంకటరమణ, కొండూరు వెంకటేశ్వర్లు నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కొంతమంది దుండగులు పనిగట్టుకుని ఇలా ధ్వంసం చేయడం బాధాకరమైన విషయం అన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రఆర్యవైశ్య నాయకులు వెంకటరమణ కొండూరు వెంకటేశ్వర్లు జూలూరు సత్యనారాయణ నీల కుమారస్వామి, పంబలి బుచ్చయ్య, ఎండి రహీం శివాజీ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తూర్కయంజాల్ గ్రామంలో మంగళవారం రోజున చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఓంకారేశ్వర స్వామికి ఉదయము పంచామృతాలతో అభిషేకము మరియు సాయంత్రము అన్నాభిషేకము జరుపబడినది స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు
**తూర్కయంజాల్ వెలుతురు జూన్ 24:**



# సంచార జాతులకు రాజకీయ హక్కులు కల్పించలేరా...?

భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు ఇచ్చిందని చెప్పుకుంటున్నా, సమాజంలో కొన్ని వర్గాలు ఇప్పటికీ రాజకీయం నుంచి బహిష్కరించబడ్డ స్థితిలోనే ఉన్నాయి. అందులో ముఖ్యంగా "సంచార జాతులు" (Nomadic Tribes, Denotified Tribes) — వారు ఓటు హక్కు కలిగి ఉన్నా, రాజకీయ ప్రతినిధ్యానికి మాత్రం దూరంగా ఉన్నారు.బ్రిటిష్ పాలనలో "క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ - 1871" ద్వారా వీరిని నేరస్థులుగా ముద్ర వేయడం.1952లో ఈ చట్టాన్ని రద్దు చేసినా, దాని దుష్ఫలితాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి.స్థిర నివాసం లేకపోవడం, పత్రాలులేనితనం, విద్యా ఆరోగ్యాలపై అపరాధపూర్వక దృష్టి వల్ల సంక్షేమం చేరదు.

ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే స్థితి చాలా మంది వద్ద లేదు ు ఆధార్, ఓటర్ కార్డు లేకపోవడం. రాజకీయ పార్టీలకు వీరు ఓటర్లుగా కూడా దృష్టిలోపడరు, అభ్యర్థులుగా పోటీ చేయడం చాలా అరుదు.పార్టీలు వీరిని గుర్తించడంలో విఫలమవుతుండగా, వీరి సమస్యలపై మేనిఫెస్టోల్లో చర్చే లేదు. MLA, MP స్థాయిలో ఒకటి కూడా సంచార జాతుల నుంచి నాయకత్వం లేనిది.

వారు ప్రతినిధులుగా మారకపోతే, వారి సమస్యల పరిష్కారం ఎలా?స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీల్లో సైతం వీరికి అవకాశాలు లేవు.

నేషనల్ కమిషన్ ఫర్ డినోటిఫైడ్, నోమాడిక్ అండ్ సెమీ-నోమాడిక్ ట్రైబ్స్ నివేదికలు ,భారతదేశ స్వాతంత్ర్యం తరువాత కూడా చాలావరకు హక్కులు లేని జీవితం గడిపిన వర్గాలు డినోటిఫైడ్, నోమాడిక్, సెమీ-నోమాడిక్ తెగలు (DNTs, NTs, SNTs). బ్రిటీషు ప్రభుత్వం 1871లో Criminal Tribes Act అమలు చేయగా, చాలా తెగలను నేరగాళ్లుగా ప్రకటించి, దుర్మానవీయంగా పరిగణించింది. స్వాతంత్ర్యం తరువాత ఈ చట్టాన్ని రద్దు చేసినా, ఆ సమాజాలపై నేరస్థుల ముద్ర కొనసాగుతోంది. వారి అభివృద్ధికి లక్ష్యంగా 2003, 2008, 2015, 2017, 2018 వంటి సంవత్సరాల్లో ఎన్నో కమిషన్లు, ఉపకమిటీలు ఏర్పాటయ్యాయి.

2003లో కేంద్ర ప్రభుత్వం "నేషనల్ కమిషన్ ఫర్ డినోటిఫైడ్ ట్రైబ్స్"ను ఏర్పరిచింది. ఈ కమిషన్ 2008లో తన తుది నివేదికను సమర్పించింది. నివేదికలో ముఖ్యంగా ఈ అంశాలు స్పష్టంగా వెల్లడయ్యాయి, DNTలు ప్రత్యేకంగా గుర్తించబడాల్సిన అవసరం ఉంది, ఎందుకంటే వారు SC, ST, OBC లలో కేటగరీస్ చేయడం వల్ల వారి సమస్యలు విస్మరించబడ్డాయి. రెసిడెన్షియల్ ఐడెంటిటీ లేకపోవడం, వారు తరచూ జాతీయ పథకాలకు అర్హులు కాకపోవడం.విద్య, ఆరోగ్య రంగాలలో తీవ్ర వెనుకబడివేత. వారిపై పోలీసులు, సివిల్ సిస్టమ్ అనుమానంతోనే చూస్తున్న పరిస్థితి.భారత ప్రభుత్వం 2015లో ఎస్.వి. రెనక్లే నేతృత్వంలో మరో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇది 2017లో తన నివేదికను సమర్పించింది. ప్రధాన సిఫార్సులు:DNT, NT, SNTల కోసం ప్రత్యేకంగా "DNT సంక్షేమ మంత్రిత్వ శాఖ" ఏర్పాటు చేయాలి.వారికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలి (ఇతర వెనుకబడిన వర్గాలలో కలిపి కాకుండా).DNT డేటాబేస్ తయారుచేయాలి, ఎందుకంటే ఈ వర్గాల సంఖ్య దేశవ్యాప్తంగా సుమారుగా 10 కోట్లకు పైగా ఉంటుంది.వారు నివసించే చోట్లలో హౌసింగ్, విద్య, రేషన్, ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలి.నివేదికలు ఉన్నా కూడా, ప్రభుత్వ యంత్రాంగం వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపిస్తున్నారు ప్రత్యేక బడ్జెట్ లేదన్న కారణంతో ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదు. రాష్ట్రాలు ఈ నివేదికలపై స్పందించలేదు, ఎందుకంటే చాలా తెగలు స్థానిక స్థాయిలో గుర్తించబడలేదు. సాంఘిక వివక్ష కొనసాగుతూనే ఉంది, ఎందుకంటే ఈ తెగలపై సమాజంలో నేరపూరిత దృష్టి ముద్ర పడిపోయింది. ప్రస్తుతం కేంద్రం 2019లో "డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ బోర్డ్ ఫర్ DNTs"ను ఏర్పాటు చేసింది. అయితే ఇది పరిపూర్ణ ప్రణాళికగా చెప్పలేము. నివేదికల ప్రకారం సరైన చర్యలు ఇవే కావాలి,వారికి ప్రత్యేకమైన బడ్జెట్, స్కీములు అవసరం.పోలీసు వ్యవస్థలో అవగాహన పెంచాలి - వీరిని అనుమానితులుగా కాక, పౌరులుగా చూడాలి.నివాస, చదువు, రేషన్, ఆరోగ్య హక్కులను హామీ ఇవ్వాలి. నేషనల్ కమిషన్ల నివేదికలు స్పష్టంగా చూపిస్తున్నదేంటంటే - డినోటిఫైడ్, నోమాడిక్, సెమీ-నోమాడిక్ తెగలకు కేవలం పథకాల లబ్ధిదారులుగా కాక, సమాన హక్కులతో కూడిన పౌరులుగా గుర్తింపు అవసరం. వారికి సంబంధించిన నివేదికలు మౌలిక హక్కుల గురించి, సమాజంలో వారి స్థానం గురించి బలమైన సూచనలతో ఉన్నాయి. వాటి అమలే ప్రధాన బలమైన మార్గం.

సంచార జాతులకు కమిటీ, బలఖీరే కమిషన్ సూచనలు - రాజకీయ హక్కుల పరిరక్షణపై కీలక ఆవశ్యకత సంచార జాతులు అనగా నిరంతరం ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళుతూ జీవనం సాగించే గుంపులు. వీరిని తరచూ చారిత్రకంగా హీనంగా చూసిన సమాజంలో, వారి జీవన శైలి, జీవనోపాధి విధానం వలన ప్రభుత్వ గుర్తింపు, పౌర హక్కులు, ముఖ్యంగా రాజకీయ హక్కులు నుంచి వంచితులవుతుంటారు. ఈ విభాగాల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం రేణుకా చౌదరి కమిటీ (2007) మరియు బలఖీరే కమిషన్ (2015) కీలక సూచనలు చేశాయి. రేణుకా చౌదరి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీ, సంచార జాతుల బాలల సంక్షేమం,



హక్కుల పరిరక్షణపై దృష్టి సారించింది. ముఖ్యంగా, ఓటర్ కార్డులు, గుర్తింపు కార్డుల జారీపై ప్రాధాన్యత. వలస జీవన విధానాన్ని అర్థం చేసుకొని, ప్రత్యేకంగా డిజైన్ చేసిన సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించింది. సంచార జీవిత శైలిని మాన్యంగా స్వీకరించాల్సిన అవసరం ఉందని, న్యాయమైన వనరుల హక్కు ఇవ్వాలనింది.బాలల విద్యపై ప్రత్యేక దృష్టి, వీటి కోసం మొబైల్ స్కూల్స్ అవసరం.

బలఖీరే కమిషన్ సిఫార్సులు (2015) ప్రొఫెసర్ విర్ బలఖీరే నేతృత్వంలోని ఈ కమిషన్, నోమాడిక్ మరియు సెమి-నోమాడిక్ జాతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అధ్యయనం చేసి, వివిధ అంశాలపై సిఫార్సులు చేసింది. ముఖ్యంగా, రాజకీయ హక్కులు - ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే హక్కు వంటి అంశాలపై ఈ జాతుల దౌర్భాగ్యాన్ని గుర్తించింది.ఈ జాతులకు ఓటింగ్ హక్కు పొందేందుకు నివాస ధృవీకరణ, ఆధార్, ఓటర్ ఐడి వంటి పత్రాలను వేగంగా జారీ చేయాలి.ఇది కేవలం సంక్షేమ సమస్య కాక, రాజ్యాంగ పరిరక్షణ సమస్య కూడా అని స్పష్టం చేసింది.సంచార జీవన శైలికి అనుగుణంగా మొబైల్ సర్వీసులు, ఆరోగ్య సంరక్షణ, విద్యా సదుపాయాలు అవసరమని సూచించింది.ఈ జాతులు ఎన్నో దశాబ్దాలుగా ఓటు హక్కు నుండే కాక, ప్రాతినిధ్యం లేకుండా నిశ్శబ్దంగా ఉంటున్నాయి. రాజకీయ పార్టీలకు వీరి సమస్యలు అంతగా కీలకంగా అనిపించవు. దీంతో పోలింగ్ లిస్టుల్లో నమోదు, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, పార్టీ స్థాయిలో ప్రాతినిధ్యం వంటి హక్కుల నుండి వంచితులవుతున్నారు. సంచార జాతుల వివరాలను సేకరించి గుర్తింపు ఇవ్వాలి. వారు ఎక్కడైనా ఉండగలుగుతారు కనుక, ఓటింగ్ కోసం స్థిర నివాస ధృవీకరణను తప్పనిసరి చేయకూడదు.ప్రత్యేక రాజ్యాంగ, న్యాయ పరిరక్షణలు కల్పించాలి - ఎస్సీ, ఎస్టీల మాదిరిగా.ఈ కమిటీలు, కమిషన్లు చేసిన సూచనలు అమలులోకి రావడం వలన మాత్రమే ఈ ప్రజలకు వాస్తవిక రాజకీయ భాగస్వామ్యం లభించగలదు. ప్రజాస్వామ్యంలో అంచున ఉన్న ఈ సముదాయాన్ని కేంద్రంగా తీసుకురావడం ప్రభుత్వాల బాధ్యత.కానీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం.ఈ దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. ఓటు హక్కు ఉంది. కానీ ఓటు వేసిన వారికి గౌరవం ఉందా? అన్ని కులాలూ ఓటు వేస్తున్నాయి. కానీ అన్ని కులాలకూ అధికారంలో భాగస్వామ్యం ఉందా? అన్నిటికన్నా ఎక్కువగా అణచివేతకు గురైన వారు సంచార జాతులు. ఇవాళ రాజకీయాల్లో వీరికి ఉన్న స్థానం "ఉన్నట్టే లేకుండా" మారిపోయింది.ప్రస్తుతం రాజకీయ పార్టీలు ప్రధానంగా ఓటు బ్యాంకుల ఆధారంగా వ్యూహాలు రచిస్తున్నాయి. కులాల వారీగా, మతాల వారీగా ఓటర్లను గుంపులుగా చూసే ధోరణి పెరిగిపోయింది. మేజారిటీ ఓట్లు పోగొట్టుకోకుండా చూసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న రాజకీయ పార్టీలకు, చిన్న జనాభా ఉన్న సంచార జాతుల అవసరం ఏమాత్రం కనిపించడం లేదు. వారి ఓటు విలువను గుర్తించాల్సిన పార్టీలు, తాము గెలిచిన తర్వాత వారు ఎక్కడ ఉన్నారన్నదానిపై ఏమాత్రం శ్రద్ధపెట్టడంలేదు. సంచార జాతులు ఈ దేశ స్వాతంత్రం కోసం పోరాడారు. భూస్వామ్య వ్యవస్థల ఎదురు తిరిగి ఉద్యమించారు. కానీ ప్రస్తుత రాజకీయాలు వారి జీవన పరిస్థితులపై పూర్తి అవగాహన లేకుండా, కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు వారిని పూర్తిగా మరిచిపోయాయి. తాగునీరు, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు కూడా ఇప్పటికీ వారికి అందడం లేదు.ఇతర సామాజిక వర్గాలకు ప్రత్యేక నిధులు, కార్పొరేషన్లు, బోర్డులు ఉన్నా, సంచార జాతుల కోసం అలాంటి ప్రత్యేకంగా నిర్మించిన మెకానిజం లేదు. ఇది నిండుగా వారి పట్ల ఉన్న అజ్ఞానం, మొండి నిర్లక్ష్యాన్ని చూపిస్తుంది.

### ప్రజా ఉద్యమాల్లో ప్రస్తావన మాత్రమే, రాజకీయాల్లో దూరం

సమాజ సేవకులు, హక్కుల కోసం పోరాడే ఉద్యమకారులు వీరి సమస్యల్ని మౌలికంగా ప్రస్తావించ occasionally చేస్తున్నారు. గిరిజనులు, దళితులు, బీసీల ఉద్యమాల్లో వీరు అంచుల్లో మాత్రం కనిపిస్తారు. కానీ ఈ సమస్యలపై రాజకీయంగా పోరాటం జరగడం లేదు. ఒకటి కాదు, రెండు కాదు, దశాబ్దాలుగా ఈ వర్గాలు రాజకీయం నుంచి శూన్యానికి చేరిపోయాయి.వారి నుంచి నాయకత్వం ఎదగనివ్వలేదు. పార్టీలు, బలహీనతగా భావించి టికెట్లు ఇవ్వడంలో వెనుకంజ వేస్తున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా చేసేస్తున్నారు. ఇది కేవలం వారి సంఖ్య తక్కువని కాదు, వారి గొంతును బలంగా వినిపించుకోలేని సమాజాన్ని, రాజకీయవ్యవస్థనుసూచిస్తుంది.సంచార జాతుల పరిస్థితి చూసినప్పుడు మనం ఓ అసహ్యమైన నిజాన్ని అర్థం చేసుకోవాలి - ఈ దేశ ప్రజాస్వామ్యం అందరినీ సమానంగా చూడదు. ఓటు వేయమంటుంది కానీ పాలనలో భాగస్వామ్యం ఇవ్వదు. సంచార జాతుల రాజకీయ స్థానాన్ని పునర్నిర్మించాలి. వారి నాయకత్వాన్ని ప్రోత్సహించాలి. ఓటు వేసే ప్రతి పౌరుడికీ గౌరవం కలిగేలా ప్రజాస్వామ్యాన్ని తిరిగి నిర్మించుకోవాలి.

ఎన్నికల సంఘం పాత్ర - ఓటు హక్కు భద్రతపై బాధ్యతఓటర్ల నమోదు ప్రక్రియలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలి. ఆధార్, ఇతర గుర్తింపు పత్రాల లేనివారికి ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించాలి.

### చట్టపరమైన మార్గాలు - రాజకీయ రిజర్వేషన్:

ఓబీసీల ప్రత్యేక గుర్తింపు అవసరం, భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక రిజర్వేషన్లు అవసరమయ్యాయి. అలాంటి వర్గాల్లో అతి ముఖ్యమైనవారు ఓబీసీలు (Other Backward Classes). విద్యా, ఉద్యోగ రంగాల్లో కొంతవరకు రిజర్వేషన్లు అమలవుతున్నా, రాజకీయ రంగంలో మాత్రం ఓబీసీలకు సరైన ప్రాతినిధ్యం లభించడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఓబీసీలకు ప్రత్యేకంగా రాజకీయ రిజర్వేషన్ కల్పించే చట్టపరమైన మార్గాలు అనుసరించాల్సిన అవసరం ఉంది.ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో ఓబీసీల ఓట్లు అవసరమైనప్పుడే గుర్తించే ధోరణి కొనసాగుతోంది. అయితే ఇది తాత్కాలిక ప్రయోజనాలకే ఉపయోగపడుతుంది. దీన్ని మారుస్తూ, ఓబీసీలను ఒక ప్రత్యేక రాజకీయ కేటగిరీగా చట్టపరంగా గుర్తించాల్సిన అవసరం ఉంది. అలాగే, ఈ వర్గానికి చెందిన వివిధ ఉపకులాలు ఏవో, వాటి జనాభా ఎంత, రాజకీయ ప్రాతినిధ్యం ఎంత అనే దానిపై సమగ్ర అధ్యయనం చేసి, న్యాయమైన ప్రతినిధిత్వం కల్పించాలి.ఎమ్మెల్యే, ఎంపీ స్థాయిలో ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి. రాజ్యాంగంలోని 340వ అధికరణ ప్రకారం వెనుకబడిన వర్గాల గుర్తింపును ప్రభుత్వం చేయగలదు. ఇదే అధారంగా ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్ కోసం కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టాలి. 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో ఓబీసీలకు రిజర్వేషన్ అమలవుతున్నా అసెంబ్లీ, లోక్‌సభ స్థాయిలో ఇది లేదు. ఇది ఒక పెద్ద లోపం. దీన్ని సరిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్గం తీసుకోవాలి. ఓబీసీల రాజకీయ ప్రాతినిధ్యాన్ని సమానంగా కేటాయించాలంటే నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ (delimitation) చాలా కీలకం. ఈ పునర్వ్యవస్థీకరణలో ఓబీసీల జనాభా గణాంకాలను స్పష్టంగా పరిగణలోకి తీసుకుని, వారికి అనుకూలంగా నియోజకవర్గాలు కేటాయించాలి. ఇప్పటి వరకు జరగని ఈ మార్పు జరగాలంటే జనాభా లెక్కలు (caste census) తప్పనిసరి. కుల ఆధారిత జనాభా లెక్కలే ఓబీసీలకు రాజకీయ రిజర్వేషన్ చట్టాన్ని బలంగా నిలబెట్టగలవు. ఓబీసీల రాజకీయ ప్రాతినిధ్యం న్యాయంగా పెరగాలంటే చట్టపరమైన మార్గాల్లో స్పష్టత అవసరం. ప్రత్యేక కేటగిరీగా గుర్తించడం, స్థానిక సంస్థలలో మరియు ఎమ్మెల్యే/ఎంపీ స్థాయిలో రిజర్వేషన్ చట్టం తీసుకురావడం, జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ - ఇవన్నీ ఓబీసీల సమాన హక్కుల దిశగా తీసుకోవాల్సిన కీలక చట్టపరమైన అడుగులే. అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యంలో నిజమైన న్యాయం అమలవుతుంది.



మన్నారం నాగరాజు

## ప్రధాని నరేంద్ర మోడీ "ఏక్ పెడ్ మా కే నామ్ " అనే మహా యజ్ఞాన్ని ప్రారంభించారు..

- అమ్మకు గౌరవం కల్పిస్తూ మరోవైపు పర్యావరణ రక్షణకు పాటుపడాలి...
- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి....

**కరీంనగర్ వెలుతురు జూన్ 24:** భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరు పైన ఒక చెట్టు) అనే మహా యజ్ఞాన్ని ప్రారంభించారని, ఈ మహా యజ్ఞం ప్రారంభించిన నాటినుండి నేటి వరకు దేశవ్యాప్తంగా 100 కోట్ల మొక్కలు నాటబడ్డాయని , అమ్మ పేరు పై చెట్టు పెంచడం మహత్తర కార్యక్రమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. భారతీయ జనతా రాష్ట్ర పార్టీ సూచన మేరకు అమ్మ పేరుతో ఒక మొక్క అనే నినాదం , ప్రోగ్రాంలో భాగంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు తాజా మాజీ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని రామచంద్రపూర్ కాలనీలో స్థానిక మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించిన మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని , ప్రతి ఒక్కరూ మొక్కలు నాటుతూ



ఓవైపు అమ్మకు గౌరవం కల్పిస్తూనే , మరోవైపు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా తల్లి లాంటి ప్రకృతిని కాపాడుకున్న వారిమవుతామని వివరించారు. ఈ సృష్టిలో మనుషులే కాకుండా సకల జీవరాసులు వాటి జీవన విధానం ఆనందకరంగా ఆరోగ్యంగా కొనసాగాలంటే కచ్చితంగా స్వచ్ఛమైన గాలి , నీరు ఉండాలని తెలిపారు. గాలి కలుషితం కాకుండా స్వచ్ఛంగా ఉండాలంటే కచ్చితంగా మొక్కలు అనేవి అధికంగా నాటాలని, తద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని చక్కని కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధాని మోదీ అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజలకు పార్టీ శ్రేణులకు ఇచ్చిన పిలుపు మేరకు , రాష్ట్ర పార్టీ సూచన మేరకు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా భారీ ఎత్తున చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ ఈ సునీల్ రావు, ప్రోగ్రాం కన్వీనర్ దూలం కల్యాణ్ , బండ సుమ , దేశ శిల్పా, గాయత్రి, ప్రేమలత, చంద్రకళ ,తేజశ్రీ, కొత్తపల్లి అరుణ, కొత్త మహేందర్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్ తిప్పారపు శ్రీనివాస్ , బొడ్ల శ్రవణ్, విమల్, రమేష్, పాక ప్రసాద్, దామసాయి, సంతోష్, ?మహేష్ తదితరులతోపాటు కాలనీవాసులు పాల్గొన్నారు



# ప్రైవేట్ కళాశాల లో ఫీజు దోపిడీ అరికట్టాలి

## - మాదగోని నరేందర్ గౌడ్

**మునుగోడు వెలుతురు జూన్ 24:**



ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను అడ్డగోలుగా దోచుకుంటున్నారని తెలుగు బిసి ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు మాదగోని నరేందర్ గౌడ్ పేర్కొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలేజీ లో గానీ స్కూల్ లో 80 శాతం కడితేనే విద్యార్థులకు ఐడి వస్తుందని చెప్పి కనీసం వాయిదాలలో చెల్లించే అవకాశం ఇవ్వకుండా తల్లిదండ్రులను బెదిరింపులకు గురి చేస్తున్నారని ఒక స్కూల్ గాని కాలేజీ లు మాత్రమే అనుమతి తీసుకుని స్కూల్. కాలేజి లు నడుపుతున్న అధికారులు నిద్ర మత్తులో ఉండి పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో అని ప్రైవేట్ విద్యా సంస్థలు నడుపుతున్నారని అధికారులు నిబంధనలు ఉల్లంఘించి ఫీజులు వసూలు చేస్తున్న పట్టించుకోని అధికారులు ఇకనైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరడమైనది.

## జనంపల్లి గురుకుల పాఠశాల ఆకస్మిక సందర్శన చేసిన లీగల్ వాలంటీర్ బత్తుల గణేష్



**రామన్నపేట, వెలుతురు న్యూస్ జూన్ 24**

మండలంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల ను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలనుసారం ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్ లో భాగంగా లీగల్ వాలంటీర్ బత్తుల గణేష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.రాజు సమక్షంలో విద్యార్థులకి కల్పించే భోజన సదుపాయాన్ని ప్రిన్సిపాల్ సమక్షంలో పరిశీలించి, విద్యార్థులతో,ముఖాముఖిగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాఠశాల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు.

## సీఎం సందేశానికి రైతులు ప్రజాప్రతినిధులు..



**నెల్లికుదురు / ఇనుగుర్తి, జూన్ 24,వెలుతురు :**

మానుకోట జిల్లా నెల్లికుదురు,ఇనుగుర్తి మండలాల కు చెందినమునిగలవీడు,నెల్లికుదురు,ఆలేరు,ఇనుగుర్తి,చిన్న ముప్పారం రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి సందేశం రైతులు ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు మంగళవారం శ్రద్ధగా విన్నారు. మునిగల వీడులో తహసిల్దార్ చంద నరేష్, ఆలేరులో ఎంపీడీవో బాలరాజు, నెల్లికుదురులో ఎంఏవో షేక్ యాస్మిన్ పాల్గొనగా ఇనుగుర్తి మండల కేంద్రం రైతు వేదికలో ఎంఏవో మహేందర్, ఏఎంసి డైరెక్టర్ కొట్టం రాము తదితరులు పాల్గొన్నారు.

# దత్తు రెడ్డి హఠాన్మరణం నన్ను ఎంతగానో కలచి వేసింది

## - మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు వెలుతురు జూన్ 24:**

ఈనాడు దినపత్రిక వరంగల్ జిల్లా ప్రతినిధి జీడిపల్లి దత్తు రెడ్డి అకాల మృతి పట్ల మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తీవ్ర సంతాపం ప్రకటించారు. జర్నలిజంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన ఆయన కేవలం 37 సంవత్సరాల చిన్న వయసులోనే గుండెపోటుతో హఠాన్మరణానికి గురి కావడం బాధాకరమన్నారు... ఉమ్మడి నల్గొండ జిల్లా ఈనాడు బ్యూరోగా పనిచేసిన దత్తు రెడ్డి తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.. సమాజం పట్ల అవగాహన ఉన్న వ్యక్తిగా ఎన్నో పరిశోధనాత్మక కథనాలు ప్రచురించాడన్నారు. దత్తురెడ్డి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ఇవ్వాల్సిందిగా ప్రార్థించారు.

## దుండగుల చేతిలో తీవ్రంగా గాయపడి కప్పల రాజేష్‌ను పరామర్శించిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 24:**



తుంగతుర్తి నియోజకవర్గం లో అక్రమ మట్టి దందాను ప్రశ్నిస్తున్న యూత్ కాంగ్రెస్ తుంగతుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కప్పల రాజేష్ పై అడ్డ గూడూరు మండల కేంద్రంలో ఈనెల 21 శనివారం రాత్రి దుండగులు దాడి చేశారు, ఈ దాడిలో గాయపడ్డ కప్పల రాజేష్ ను వనస్థలిపురం లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు, దాడి విషయం తెలుసుకున్న గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంగళవారం రోజున ఆసుపత్రికి వెళ్లి కప్పల రాజేష్ ను పరామర్శించారు.... రాజేష్ తో పాటు నియోజకవర్గ నాయకులు దాడి జరిగిన తీరు ను రాజ్ గోపాల్ రెడ్డి గారికి తెలియజేశారు....

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం చిత్రపటానికి పాలాభిషేకం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 24**



మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు ప్రభుత్వాలేనని, రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని కాంగ్రెస్ పార్టీ తన చిత్త శుద్ధి చాటుకుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఉన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజులలో తొమ్మిది వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద రైతు ఖాతాలో జమ చేసి రైతు పక్షపాతి ప్రభుత్వం అనిపించుకున్నారని ఆయన అన్నారు. ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ, సన్న ధాన్యానికి 500 బోనస్, ఎకరానికి ఆరువేల రూపాయల చొప్పున రైతు భరోసా, రైతు బీమా కార్యక్రమాలను అమలు చేశారని ఆయన తెలిపారు. ఒక లక్ష రూపాయల రుణమాఫీ ఐదు సంవత్సరాలలో చేయలేని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్త నరసింహారెడ్డి, జేల్లా వెంకటేష్, గోదాసు పృథ్వీరాజ్, ఎండి రెహాన్, మాదురి జ్యోతి, బొడ్డు సురేందర్ రావు, కోట సుధాకర్, ఎండి నాసర్, గోదాసు శ్రీమన్నారాయణ, గొలుసుల ప్రసాద్, బొడ్డుపల్లి లింగయ్య, చల్ల ప్రకాష్, బత్తుల నవీన్, గంపల రామచంద్రారెడ్డి, మీర్జా బషీర్ బేగ్, ఉప్పు ప్రకాష్, మన్సూర్ అలీ, నోముల ప్రవీణ్, రైతులు తదితరులున్నారు.

## రైతు భరోసా నిధుల విడుదలతో రైతుల పండుగ సంబరాలు..

**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూన్ 24:**



కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతన్నలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బాణాసంచాతో సంబరాలు ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరినారాయణ గౌడ్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో రైతన్నలతో రైస్ భరోసా పండుగ సంబరాలు జరుపుకున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తొమ్మిది రోజులలో 9 వేల కోట్ల రూపాయలు 70 లక్షల మంది రైతన్నలకు రైతు భరోసా సహాయం అందజేయడం వలన రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారనారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ రైతు భరోసా పథకంలో భాగంగా రైతన్నలు రైతు భరోసా సహాయం రైతులకు వారి ఖాతాలో జమ చేయడం వలన పెట్టుబడి సహాయం విత్తనాలు ఎరువులు కొనుగోలు చేసేందుకు సహాయం అందించడంతో వారి సంతోషానికి అవధులు లేవు అందువలన ప్రజా ప్రభుత్వ పాలనలో భాగంగా ప్రజలందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకం, రాజీవ్ యువ వికాసం, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం, ,మహిళలందరికీ ఉచిత సిలిండర్లు అందించడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం పథకాలు అందజేయడం జరుగుతుందని. కావున రైతన్నలు తమ ఖాతాలో రైతు భరోసా నిధులు జమ చేసినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, అచ్చంపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మార్కెట్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటయ్య ,మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు బీసీ సెల్ అధ్యక్షులు జాల మల్లేష్, సురేష్ గౌడ్ రైతులు, మహిళలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు





**మునుగోడు,జూన్ 24 ( వెలుతురు):**

మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్స్ వాడుతున్న పలు కిరాణా,కూరగాయ దుకాణాలను మండల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్స్ వాడుతున్న యజమానులకు రూ.13,000 జరిమానాలు విధించారు. అదేవిధంగా షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ప్లాస్టిక్ కవర్స్ గ్రామపంచాయతీ సిబ్బంది జప్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో మేకల విజయభాస్కర్,ఎంపీఓ స్వరూపారాణి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్రాబాద్ పులుల రక్షిత అటవీ అభయారణ్యంలో వదిలిన భారీ కొండచిలువ





**వెలుతురు న్యూస్, అచ్చంపేట జూన్ 24:**

వనపర్తి జిల్లా గోపాల్ పేట లో బంధించిన భారీ కొండచిలువను మంగళవారం రోజున అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నల్లమల్ల అడవి ప్రాంతానికి తరలించారు.సాగర్ స్నేక్ సొసైటీ అధ్యక్షులు కృష్ణసాగర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలో అసలుకుంట లో రెండు రోజుల క్రితం భారీ కొండచిలువను సాగర్ స్నేక్ సొసైటీ ద్వారా బంధించడం జరిగింది. బంధించిన కొండచిలువను గ్రామ సమీప అడవి ప్రాంతాలలో వదిలి వేస్తానని ఆయన దీనికి ఆ గ్రామస్తులు ఆందోళనలకు గురై పామును నల్లమల్ల అడవి ప్రాంతానికి తరలించాలని సాగర్ కు గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. కృష్ణ సాగర్ అచ్చంపేట డీఎఫ్ఓ రోహిత్ కి ఫోన్ ద్వారా సమాచారం తెలుపగా వారు వెంటనే స్పందించి బంధించిన కొండచిలువను అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ అయిన నల్లమల్ల అడవి ప్రాంతానికి తీసుకురావాలని సూచించడంతో మంగళవారం రోజు స్నేక్ సొసైటీ సభ్యులతో కలిసి కృష సాగర్ మన్ననూర్ సెక్షన్ ఆఫీసర్ ప్రశాంత్ , బీట్ ఆఫీసర్ ఆనంద్ తో కలిసి సురక్షితమైన నల్లమల్ల అడవి ప్రాంతంలో కొండచిలువను వదిలి వేశారు.

కృష్ణ సాగర్ మాట్లాడుతూ సకాలంలో స్పందించిన డీఎఫ్ఓ రోహిత్ కు స్నేక్ సొసైటీ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో స్నాక్స్ సొసైటీ సభ్యులు గోవర్ధన్ విష్ణు సాగర్ ఆనందు నాగరాజు సంగు సురేష్, ప్రకాష్ సుగురు రాజు సూరి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ



**కొత్తగూడెం వెలుతురు జూన్ 24:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో పని చేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కల్పిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వర చారి మంగళవారం జీవో విడుదల చేశారు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (TUWJ -IJU) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యవర్గం విజ్ఞప్తి మేరకు ఈ జీవోను విడుదల చేశారు. ఈ కాపీని తీసుకున్న యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్షుడిగా బెల్లి లింగస్వామి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 24**



కొమ్మాయిగూడెం గ్రామంలో నల్లగొండ రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం కి చెందిన అధ్యక్ష ఎన్నికలలో గత రెండు పర్యాయాలు విజయవంతంగా సేవలందించి పాల ఉత్పత్తిదారుల మన్ననలు పొంది పాలఉత్పత్తి దారులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రతి సమస్యని,పరిష్కరించుకుంటూ, మదర్ డైరీ ప్రతి వార్షిక సమావేశంలో, పాడి రైతుల సమస్యల కొరకై గలమెత్తి మాట్లాడి నిరంతరం వారి శ్రేయస్సు కోసమే అహర్నిశలు కష్టపడిన బెల్లి లింగస్వామిని వరుసగా మూడవ సారి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఢిల్లీ లింగస్వామి మాట్లాడుతూ పాల సెంటర్ అభివృద్ధి కొరకై పాల వినియోగదారుల సమస్యలని పరిష్కరిస్తానని, అన్నివేళలా వారి సహాయార్థం అందుబాటులో ఉంటానని చెప్పడం జరిగింది. వారికి ఇవే మా శుభాభినందనలు అలాగే నూతనంగా నియమితులు అయినటువంటి డైరెక్టర్లు బండ మధుకర్ రెడ్డి, మోటె శ్రీనివాస్, గురజాల సుదర్శన్ రెడ్డి, కందగట్ల రామచంద్రారెడ్డి, సాగర్ల శేఖర్, గురజాల రామ్ రెడ్డి, గురజాల నర్సిరెడ్డి, కాసర్ల కృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

# శోభనాద్రిపురం అసిఫ్ నహర్ కాలువ నూతన వంతెన వద్ద సిసి రోడ్డు నిర్మించాలి.

## - సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిరసన



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 24**

శోభనాద్రిపురం గ్రామంలో ఉన్న అసిఫ్ నహర్(రాచకాల్వ) నూతన వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా సిసి రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలని సిపిఎం మండల కమిటీ సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ ఎండి రషీద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో నూతన వంతెన వద్ద నిరసన తెలపడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 202లో గత ప్రభుత్వం హయాంలో 65 లక్షలతో, నూతన వంతెన నిర్మించినా రెండు వైపులా కేవలం మట్టి పోసి వదిలిపెట్టడంతో, అధిక వర్షాలు పడినప్పుడు మట్టి కొట్టుకపోయి గుంతల మయంగా మారి, వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతుందని, అన్నారు. గతం నుండి పలుమార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించిన పట్టించుకునే నాథుడే కరువయ్యాయని ప్రయాణాలు నరక కోపంగా మారుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే సమస్య పరిష్కారం చేసి నిధులు వెచ్చించి రోడ్డుకి ఇరువైపులా సిసి రోడ్డు నిర్మించి సమస్య పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి గోగు లింగస్వామి, నాయకుల కొమ్ము అంజయ్య, బోడిగే వెంకటేష్,ఎండి లతీఫ్, బీంపాక ప్రశాంత్,వడ్లకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ " మహాప్రస్థానం" పుస్తక పరిచయ సభ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 24**



మహాకవి శ్రీ శ్రీ రచించిన"మహాప్రస్థానం " నేటికి 75 సంవత్సరాలు పూర్తి అయినది. మహాప్రస్థానం ఆనాడు సమాజం లో, విప్లవాత్మకమైన మార్పు తీసుకొని వచ్చింది. ఈ శతాబ్దం నాది అని గర్వం గా ప్రకటించు కున్న, శ్రీ శ్రీ సాహితీ రంగం లో "మహాకవి" గా అందరి ప్రశంసలు, అందుకు న్నారు. ఈ సందర్భంగా జులై రెండవ వారం లో నల్లగొండ జిల్లా కేంద్రం లో నిర్వహించ నున్న ,,శ్రీ శ్రీ మహా ప్రస్థానం పుస్తక పరిచయ సభ – యువ కవి సమ్మేళనం " ను జయప్రదం చేయాలని కోరుచున్నాం. హైస్కూల్ నుండి పీజీ స్థాయి విద్యార్థుల నుండి శ్రామిక జన నేపథ్యం, అణచి వేతలపై, ప్రశ్నించే తత్త్వం, విద్వేషాల స్థానంలో ప్రేమ, శాంతి నెలకొల్పడం, జెండర్ కుల మతాల కు అతీతంగా ప్రజల్ని ఐక్య పరిచే అంశాల పై కవితలను ఆహ్వానిస్తున్నాం. కవి సమ్మేళనం లో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను మరియు కవితలను 9848228004 వాట్సాప్ నెంబర్ కు జులై 10 వ తేది నాటికి పంపగలరు.

## జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి.

## - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు




**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 24**

కార్మిక హక్కుల పరిరక్షణ కోసం, కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన కార్మిక వ్యతిరేక చట్టాలను, రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో, జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగి సోమలు పిలుపునిచ్చారు. స్థానిక ఏఎల్ఓ,తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో, సమ్మె నోటీసులు అందజేసి అనంతరం మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు.కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ విచ్ఛిన్నం చేస్తుందని, అన్నారు. బిజెపి అవలంబించే కార్మిక ప్రజావ్యతిరేక విధానాలపై, జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు అన్ని వర్గాల కార్మికులు సమ్మెలో, పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం.మండల నాయకులు వంగాల మారయ్య, నకిరకంటి రాము, బూడిద బిక్షం,వరికుప్పల వెంకటేశం, తుర్కపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్

**మునుగోడు,జూన్ 24 (వెలుతురు)**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు భరోసా పథకం ద్వారా రైతు బ్యాంకు ఖాతాలలో విజయవంతం గా డబ్బులు జమ చేసిన సందర్భంగా మండలంలోని కొంపల్లి, పులిపల్పుల రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖిగా మాట్లాడడంతో రైతులందరూ రైతు వేదికల ద్వారా వీక్షించి ఆనంద వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో మేకల విజయభాస్కర్,మండల వ్యవసాయ అధికారి పద్మజ,వ్యవసాయ విస్తరణ అధికారులు యాదగిరి,నరసింహ, వహీద్,ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు హాజరయ్యారు.

https://epaper.velthuru.com

హైదరాబాద్ వెలుతురు

## ఎల్లారెడ్డి నియోజకవర్గం మీసాన్ పల్లి గ్రామంలో రైతు వేదిక లో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్





**మీసాన్ పల్లి వెలుతురు జూన్ 24:**
9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయం కింద వేయడంతో సంబరాల్లో రైతులు.. మీసాన్ పల్లి రైతు నేస్తం కార్యక్రమంలో రైతు వేదిక లో రైతుల కు స్వీట్లు తినిపించి సంబరాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్,వ్యవసాయ శాఖ అధికారులు రైతులు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా కింద పంట పెట్టుబడి సహాయం రైతుల ఖాతాలో వేసింది.. లక్షలాది మంది ఈరోజు రైతులు సంబరాలు చేసుకుంటున్నారు.. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మీ ఆశీర్వాదంతో ఏర్పడింది..రైతాంగానికి పెద్దపీట వేస్తుంది రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది.. ఎద్దు ఏడ్చిన వ్యవసాయ రైతు ఏడ్చిన రాజ్యం బాగుండదు రైతుల సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుంది కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ రైతులకు అండగా ఉంటుంది.. రైతులకు సంబంధించి వారి అభివృద్ధికి ఏ ఆలోచన ఉన్న మా ప్రభుత్వం అమలు చేస్తుందని ముఖ్యమంత్రి గారు చెప్పారు రైతులకు వ్యవసాయం చేసిన అనుభవం ఉంది.. మీరు మొక్కజొన్న, పత్తి ,ఆయిల్ ఫామ్ కూరగాయలు ఏ పంట వేసినా ఒక్క గుంట కూడా వృధా గా ఉంచద్దు పంట సహకారం పొందిన ఎల్లారెడ్డి నియోజకవర్గ లక్షా 10 వేల మంది రైతులు 100 కోట్ల రూపాయలు పొందారు వారికి శు భాకాంక్షలు.

## రైతు భరోసాలో 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో నగదు జమ

- జిల్లా వ్యవసాయ అధికారి కల్పన



**వెలుతురు మంచిర్యాల ప్రతినిధి జూన్ 24**
రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో 189 కోట్ల 37 లక్షల 10 వేల 233 రూపాయలు జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాలలోని 419 గ్రామాలలో 1 లక్షా 71 వేల 307 మంది రైతులకు 205 కోట్ల రూపాయల రైతు భరోసా అందించవలసి ఉండగా 1 లక్షా 52 వేల 621 మంది రైతులకు సంబంధించిన 198 కోట్ల 96 లక్షల 63 వేల 519 రూపాయలు ప్రభుత్వ ఖజానాకు పంపించడం జరిగిందని, 1 లక్షా 48 వేల 739 రైతుల ఖాతాలలో 189 కోట్ల 37 లక్షల 10 వేల 233 రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.

## సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి


- మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
2025-26 విద్యాసంవత్సరానికి గాన సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాల, సిసిసి-నస్పూర్లో మొదటి సంవత్సరం లో ప్రవేశాల కోసం విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని మందమరి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు కొత్తగూడెం ఎడ్యుకేషనల్ సొసైటి నుండి నోటిఫికేషన్ విడుద లైనట్లు తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం సివిల్ కోర్సులో 60, ఎలక్ట్రిక ల్-ఎలక్ట్రానిక్స్-60, మెకానికల్-60, మైనింగ్-60.. మొత్తం 300సీట్లు ఉన్నాయన్నారు. వీటిలో 150 సీట్లను సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగల పిల్లలకు, 150 సీట్లు ఇతరు లకు కేటాయించడం జరుగుతుందన్నారు. సింగరేణి ఉద్యో గులు, మాజీ ఉద్యోగుల పిల్లలు జులై 3వ తేదీ లోపు సింగరేణి పాలిసెట్ వెబ్సైట్ ద్వారా(https://scp.scpolytechnic.com/online_admission), ఇతరులు తెలంగాణ పాలిసెట్ వెబ్సైట్ (https://tgpolycet.nic.in) ద్వారా ఈ నెల 24 నుంచి 28 వ తేదీలోపు ఆన్లైన్ ధరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9010222161, 8790112515, 9491144168 సంప్రదించాలని అన్నారు.

## జిల్లాలో స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**



జిల్లాలో స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని పకడ్బంధీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? హరీష్రజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి స్టాప్-డయేరియా సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జూలై 31వ తేదీ వరకు చేపట్టిన స్టాప్-డయేరియా కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బంధీగా నిర్వహించాలని తెలిపారు. అతిసార వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని, ఆహారం తీసుకునే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రపరుచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలు తల్లిపాలు త్రాగకపోవడం, వాంతులు అధికంగా కావడం, తరుచుగా మల విసర్జన, అనారోగ్యానికి గురి కావడం, అపస్మారక స్థితి, జ్వరం ఉండటం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఇతర అనారోగ్య లక్షణాలు గుర్తించినట్లయితే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్ళి సరైన సమయంలో వైద్య సేవలు పొందాలని తెలిపారు. స్టాప్-డయేరియా కార్యక్రమంలో భాగంగా ఓ.ఆర్.ఎస్., జింక్ కార్నర్లు ఏర్పాటు చేయడం, 5 సం?ల లోపు పిల్లలలో అతిసార వ్యాధిని నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, వైద్యాధికారులు డా. కృపాబాయి, డా.ప్రసాద్, డా. సుధాకర్ నాయక్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# కన్నతల్లిని కడ తేర్చిన కూతురు..

- ప్రియుడితో కలిసి దారుణంగా చంపేశారు.



మృతురాలు అంజలి ఫైల్

**ఇనుగుర్తి జూన్ 24, వెలుతురు:**
నవ మాసాలు మోసి కని అల్లారుముద్దుగా పెంచి న తల్లిని ప్రియుడి మోజులో పడి తన ప్రేమకు అడ్డు వస్తోందని ప్రేమికునితో కలిసి కడతేర్చింది. తల్లీ కూతుర్ల బంధాన్ని చిదిమేసింది. మానవత్వాన్ని మంటగలిగింది. 16 సంవత్సరాల ప్రారంభంలోనే సభ్య సమాజం తల దించుకునేలా పైశాచికంగా వ్యవహరించింది. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మానుకోట జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన అంజలి హైదరాబాదులోని జీడిమెట్ల ఎన్ ఎల్ బి నగర్ లో ఓ కళాశాలలో ఉద్యోగం చేస్తూ జీవిస్తోంది. తెలంగాణ సాంస్కృతిక సారధి ఫోక్ సింగర్ గా ప్రదర్శనలిచ్చేది. ఆమెకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కూతురు తేజశ్రీ 10వ,తరగతి చదువుతోంది. ఈమెకు నల్లగొండకు చెందిన పగిల్ల శివ అనే యువకుడితో ఎనిమిది నెలల క్రితం ఇంస్టాగ్రామ్ లో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. శివ తేజశ్రీ ఫోన్లు,మెసేజ్లతో ప్రేమాయణం కొనసాగించారు. ఈ విషయం తల్లికి తెలిసింది. ఐదు రోజుల క్రితం శివ తేజశ్రీ ఇంటి నుంచి వెళ్ళిపోయారు. ఈ మేరకు పోలీసులకు కంప్లైంట్ చేయడంతో మూడు రోజుల క్రితం తిరిగివచ్చారు. ఈ వయసులో ఇది మంచిది కాదని కూతుర్ని అంజలి మందలించింది. మా ప్రేమకు అడ్డు



శివ, తేజశ్రీ

వస్తోందని తల్లిని ఎలాగైనా చంపాలనుకుంది. ప్రియుడి శివతో కలిసి ప్లాన్ చేసుకుంది. అంజలి ఒంటరిగా పూజ చేసుకుంటున్న క్రమంలో సోమవారం శివ తన తమ్ముడు పగిల్ల యశ్వంత్ తో కలిసి తేజశ్రీ తో సహా ముగ్గురు అంజలిని రాడ్ తో తలపై కొట్టారు. సుత్తితో మోది చు న్నితో ఉరివేసి దారుణంగా చంపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఎంతో మందితో పరిచయాలు పెంచుకున్న అంజలిని ప్రేమ మోజులో పడి సొంత కూతురు ప్రియుడితో కలిసి చంపడం కలకలం రేపు తోంది. కాగా అంజలి పార్థివదేహాన్ని సొంతూరు ఇనుగుర్తికి తీసుకువచ్చారు. పార్థివ దేహం వద్ద కళాకారు లు శోకంతో కూడిన పాటలు ఆలపిస్తూ ఉంటే బంధువులు శోకసముద్రంలో మునిగిపోగా గ్రామస్తులు విచార వదనంతో కనిపించారు.

## ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సదస్సును విజయవంతం చేయాలి..

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

**కరీంనగర్ వెలుతురు జూన్ 24:**
బిజెపి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున నిర్వహించనున్న ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సదస్సును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళ వారం రోజున కరీంనగర్ లో బీజేపీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25, 1975 అర్ధరాత్రి దేశంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితి , ఎమర్జెన్సీ విధించిందని తెలిపారు. దేశంలో ఎమర్జెన్సీ రోజులు ఆ చీకటి రోజులని, అలాంటి ఎమర్జెన్సీకి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా కరీంనగర్ బిజెపి ఆధ్వర్యంలో బుధవారం






రోజున మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక ఈఎన్ గార్డెన్లో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధి, ప్రధాన వక్తగా మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు హాజరవుతారని తెలిపారు. బిజెపి శ్రేణులందరూ ఇట్టి సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిళ్ళపు రమేష్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కన్నబోయిన ఓదెలు , మాజీ ఎంపీపీ వాసాల రమేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, గుర్రాల వెంకటరెడ్డి, కళ్లెం వాసుదేవ రెడ్డి, వైదరామానుజం దండు కొమురయ్య, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, వంగల పవన్, బండ రమణారెడ్డి , దూలం కళ్యాణ్, రాజు, శ్రీనివాస్, తణుకు సాయి తదితరులు పాల్గొన్నారు.

# వెలుతురు

## ఈ నెల 26న మినీ జాబ్మేళా

- జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26వ తేదీన ఉదయం 10.30 గం?లకు మినీ జాబ్మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్.ఐ.సి. ఆఫ్ ఇండియా-మంచిర్యాల శాఖలో మంచిర్యాల జిల్లాలో ఖాళీగా ఉన్న 100 (మహిళా కెరీర్ ఏజెంట్స్-భీమా శక్తి) పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్.ఎస్.సి. పైన విద్యార్హత కలిగి, 18 సం।।ల పైన వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులని, ఎం.ఎన్.సి. బ్యాంక్ కంపెనీ నందు తెలంగాణ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 60 రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టుల భర్తీ చేసేందుకు ఏదేని డిగ్రీ అర్హత కలిగిన 26 సం।।ల వరకు వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9912832330, 8096857078, 9110368501 నంబర్లలో సంప్రదించవచ్చని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## స్వయం సహాయక సంఘాల సభ్యురాలి కుటుంబానికి భీమా చెక్కు అందజేత

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణ భీమా, ప్రమాద భీమా క్రింద మృతి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్తో కలిసి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రుణ భీమా క్రింద బ్యాంక్ రుణం తీసుకొని సక్రమంగా చెల్లిస్తున్న సమయంలో అకస్మాత్తుగా మృతి చెందినట్లయితే సభ్యురాలు చెల్లించవలసిన మిగిలిన రుణాన్ని గరిష్టంగా 2 లక్షల వరకు ప్రభుత్వం స్త్రీ నిధి ద్వారా చనిపోయిన సభ్యురాలి స్వయం సహాయక సంఘాల ఖాతాలో జమ చేస్తుందని, ప్రమాద భీమా క్రింద సభ్యురాలు నామినీగా నమోదు చేసిన కుటుంబ సభ్యులకు 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా మొదటి విడతలో జిల్లాలోని బెల్లంపల్లి మండలంలో ఇద్దరు సభ్యులకు సంబంధించిన సంఘ సభ్యులకు చెక్కులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి అంజయ్య, స్త్రీ నిధి ఆర్.ఎం. వెంకటరమణ, బెల్లంపల్లి మండల ఏ.పి.ఎం. శ్యామల, సి.సి. రామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలోని తహశిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్కార్డుల కొరకు చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధృవపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని కర్ణమామిడి గ్రామంలో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి వంటశాల, గదులు, హాజరు పట్టిక, పరిసరాలను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్



పుస్తకాలు, ఏక రూప దుస్తుల అందించాలని తెలిపారు. నూతన మెనూ ప్రకారం సకాలంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.




మూత్రశాలలు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలు పరిశు భ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య నిర్వహణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి వారిని తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా ఏకాగ్రతతో కృషి చేయాలని తెలిపారు. దఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థిని ప్రతిభ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
జపాన్ సకురా అంతర్జాతీయ సైన్స్ కార్యక్రమంలో జిల్లా విద్యార్థిని శ్రీవల్లి పాల్గొనడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జాతీయ స్థాయి ఇన్స్పైర్ పోటీలలో అద్భుత ప్రదర్శన అందించి రాష్ట్రపతి అభినందనలు పొంది అంతర్జాతీయ స్థాయి సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవల్లిని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్రావు, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు లతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుండి 21వ తేదీ వరకు అంతర్జాతీయ స్థాయి సైన్స్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీవల్లి జపాన్లోని యూనివర్సిటీలు, అంతరిక్ష కేంద్రం, పాఠశాల, మ్యూజియంలను సందర్శించి విజ్ఞానాన్ని పొందిందని, ఆధునిక సాంకేతిక జ్ఞానాన్ని పొంది భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం "ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్", ఇన్స్పైర్ అవార్డుల కొరకు నామినేషన్ల సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేందుకు, వారిలోని వినూత్న ఆలోచనలు బహిర్గతం చేసి నూతన ఆవిష్కరణలు రూపొందించి సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ఇన్స్పైర్ అవార్డ్స్ మానక్ వేదికగా పని చేస్తుందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఇన్స్పైర్ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల నుండి నామినేషన్లు స్వీకరించాలని, ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాట్‌లో ఆమ్రపాలికి ఊరట

- తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ ఆదేశాలు




**న్యూఢిల్లీ,జూన్24( వెలుతురు):**
క్యాట్‌లో ఐఏఎస్ అధికారి కాట్ర ఆమ్రపాలికి ఊరట దక్కింది. ఆమెను తెలంగాణకు కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. తెలంగాణ నుంచి రిలీవై ఏపీ క్యాడర్‌లో చేరిన ఐఏఎస్ అధికారిణ కాటా ఆమ్రపాలికి కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ క్యాట్‌ఊరట లభించింది. ఆమెను తిరిగి తెలంగాణకు కేటాయిస్తూ క్యాట్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తెలంగాణలో పని చేసిన ఆమె.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీఓపీటీ) ఉత్తర్వులతో నాలుగు నెలల క్రితం ఏపీకి వెళ్లిన సంగతి తెలిసిందే. అయితే, డీవోపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ తనను తెలంగాణకు కేటాయించాలని ఆమె క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌ను అనుమతించిన క్యాట్.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె తిరిగి తెలంగాణకు వచ్చే అవకాశం ఉంది.

# గంజాయి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై భావితరాలకు మంచి భవిష్యత్ అందిద్దాం
- రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్
- మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహనా




**వెలుతురు మంచిర్యాల ప్రతినిధి జూన్ 24**
గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని ఒక మంచి ఉదేశ్యంతో మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. అందులో బాగంగా ఈరోజు జైపూర్ మండలంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్ ముఖ్య అతిదిగా పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తు రోజుల్లో మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతిలోనే ఉంది అని అన్నారు. విద్యార్థుల దృష్టి తమ భవిష్యత్తు జీవిత లక్ష్యం పై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి డ్రగ్స్ మరియు ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల విద్యార్థులు ఆకర్షితులు కావద్దని సీపీ సూచించారు. గంజాయి డ్రగ్స్ అలవాటు వలన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పాడుచేస్తుందని కావున చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్ములన గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యం గా రామగుండం కమీషనరేట్ పోలీస్ శాఖ కృషి చేస్తోందని అందులో బాగంగా విద్యాసంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. మత్తుకు బానిస అవడానికీ అనేక కారణాలు ఉంటాయి పరిసరాల ప్రభావం, చెడు స్నేహితులు, సన్నిహితుల వలన చెడు మార్గాల వైపు వెళ్ళవద్దు. గంజాయి, డ్రగ్స్ జీవితాన్ని నాశనం చేయడంతో పాటు భవిష్యత్ లేకుండా చేస్తుందనే విషయాన్ని విద్యార్థులు గ్రహించి అలాంటి చెడు అలవాట్లకు ఆకర్షితులవ్వద్దని విజ్ఞప్తి చేశారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు యువత/విద్యార్థులు అంతా యాంటీ డ్రగ్స్ కమిటీలలో సభ్యులుగా చేరి యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా సహకరించాలని తెలిపారు. ఈరోజు ఇక్కడ తెలుసుకున్న విషయాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, బంధువులకు తెలియజేసి డ్రగ్స్ నివారణలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు ఎక్కువ సమయం స్కూల్స్, హాస్టల్ లలో ఉంటారు కావున ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారు ఎలాంటి చెడు అలవాట్లకు బానిసలు కాకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు. మీ మీ ప్రాంతాలలో ఎక్కడైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు, తాగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబధిత సమాచారాన్ని స్థానిక పోలీసులకు ఇవ్వాలని కోరారు. యువతను లక్ష్యంగా చేసుకొని గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను అమ్ముతూన్న వారిపై కేసులు నమోదు చేశాం అన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సరఫరా చేసిన, సేవించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారుల తో కలిసి మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంపై పోస్టర్లను ఆవిష్కరించారు అనంతరం మేము డ్రగ్స్ తీసుకోము, బంధుమిత్రులు, చుట్టుపక్కల వారు, స్నేహితులు మాధకద్రవ్యాలకు అలవాటు పడకుండా వారిని చూసుకునే బాధ్యత మాదే అని డ్రగ్స్ వల్ల కలిగే అనార్థాల గురించి వారికి వివరిస్తాం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ ఐపిఎస్., జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లా రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, జైపూర్ ఎస్ ఐ శ్రీధర్, బీమారం ఎస్ఐ శ్వేతా, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, సిసి హరీష్, కస్తూర్బా ప్రిన్సిపాల్. ఫణి బాల, సాంఘిక సంక్షేమ ప్రిన్సిపాల్. కోలా నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ కోటపల్లి ప్రిన్సిపాల్ బి. రమేష్ బాబు, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు, నార్కోటిక్ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఈ నెల 26న వాక్-ఇన్-ఇంటర్వ్యూ

- జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా.. హరీప్రజ్

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
జాతీయ ఆరోగ్య మిషన్ విభాగం నందు యు.పి.హెచ్.సి.లో ఖాళీగా ఉన్న 2 పోస్టులు, ఎ.ఎ.ఎం.లో ఖాళీగా ఉన్న 2 పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన ఉదయం 11 గం?లకు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? హరీప్రజ్ ఒక ప్రకటనలో తెలిపారు. యు.పి. హెచ్.సి. లలో 2 ఎం.ఓ. పోస్టులకు గాను ఎం.బి.బి.ఎస్. అర్హత కలిగి ఉండాలని, ఎ.ఎ.ఎం.లలో 2 ఎం.ఎల్.హెచ్.పి. పోస్టులకు గాను ఎం.బి.బి.ఎస్./బి.ఎ. ఎం.ఎస్. అర్హత కలిగి ఉండాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# దేశంలోనే బ్లాక్ బాక్స్ విశ్లేషణ

- విదేశాలకు పంపినట్లు పుకార్లు మాత్రమే
- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టీకరణ



**పుణె,జూన్24( వెలుతురు):**
అహ్మదాబాద్ విమానప్రమాదం తరవాత విశ్లేషణ కోసం బ్లాక్ బాక్స్‌ను అమెరికా పంపినట్టు వస్తున్న ఊహాగానాలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు మంగళవారంనాడు తోసిపుచ్చారు. 'అవన్నీ ఊహాగానాలే. బ్లాక్ బాక్స్ ఇండియాలోనే ఉంది. ప్రస్తుతం దీనిని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) పరిశీలిస్తోందని రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఎప్పటిలోగా బ్లాక్ బాక్స్‌లోని సమాచారాన్ని వెలికితీసే అవకాశం ఉందని అడిగినప్పుడు, ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం పక్రియను పరిశీలించనీయండని అన్నారు. విమానం కూలిపోవడానికి ముందు ఏమి జరిగిందో లోతుగా తెలుసుకునేందుకు బ్లాక్ బాక్స్ డీకోడింగ్ జరుగుతోందని ఇంతకుముందు మంత్రి చెప్పారు. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం కుప్పకూలిన దుర్ఘటన యావత్ ప్రపంచాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్ప కూలడం వెనుక గల కారణాలను అన్వేషించేందుకు ఉన్నత స్థాయి దర్యాప్తును అధికారులు కొనసాగిస్తు న్నారు. ప్రమాదానికి కొద్ది క్షణాల ముందు ఈ విమానంలో అసలేం జరిగిందో తెలుసుకోనేందుకు అందరి దృష్టీ ఇప్పుడు 'బ్లాక్ బాక్స్' విశ్లేషణపై పడింది. ఈ నేపథ్యంలో బ్లాక్‌బాక్స్‌ను విచారణ కోసం విదేశాలకు పంపించారంటూ జరుగుతోన్న ప్రచారాన్ని కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తోసిపుచ్చారు. అవన్నీ కేవలం ఊహాగానాలేనంటూ కొట్టిపారేశారు. ఫిక్కీ, కేంద్ర విమానయాన మంత్రిత్వశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పుణెలో జరిగిన హెలికాప్టర్స్ అండ్ స్మాల్ ఎయిర్‌క్రాఫ్ట్ సమ్మిట్ 2025 సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్లాక్ బాక్స్‌ను విదేశాలకు పంపిస్తున్నారా? అని విలేకర్లు అడగ్గా.. 'అవన్నీ కేవలం ఊహాగానాలే. బ్లాక్‌బాక్స్ భారత్‌లోనే ఉంది. దీన్ని ప్రస్తుతం ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పరిశీలిస్తోంది' అని స్పష్టం చేశారు. ఎప్పటివరకు దీంట్లోని డేటాను పొందొచ్చని మరో ప్రశ్నకు స్పందిస్తూ.. 'ఇది చాలా సాంకేతికతతో కూడిన వ్యవహారం. ఏఏఐబీ దర్యాప్తు చేపట్టి మొత్తం పక్రియను పరిశీలించనివ్వండి' అన్నారు. జూన్ 12న లండన్ వెళ్లేందుకు అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన విమానం గాల్లోకి ఎగిరిన కాసేపటికే ఓ వైద్య కళాశాల వసతిగృహంపై కూలడం పెను విషాదం నింపింది. ఈ ఘటనలో 240 మంది ప్రయాణికులతో పాటు 270మంది ప్రాణాలు కోల్పోగా.. విమాన ప్రయాణికుల్లో ఒకే ఒక్కరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ క్రమంలో జూన్ 13న ఎయిరిండియా బోయింగ్ 787 -8 డ్రీమ్‌లైనర్ విమానం బ్లాక్ బాక్స్‌ను అధికారులు ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ బాక్స్ అనేది విమానంలో ఏం జరిగిందో అన్న సమాచారాన్ని రికార్డు చేసే ఓ చిన్న పరికరం. ఇది విమాన ప్రమాదాల దర్యాప్తులో దీన్ని డీకోడ్ చేయడం వల్ల విమాన ప్రమాదానికి కొన్ని క్షణాల ముందే ఏం జరిగిందో తెలుసుకొనేందుకు ఉపయోగపడుతుంది.

# పెరగనున్న రైల్వే టిక్కెట్ ధరలు


- జూలై 1నుంచే అమల్లోకి కొత్త రేట్లు

**న్యూఢిల్లీ,జూన్24( వెలుతురు):**
రైల్వే ప్రయాణికులకు ఇది షాకింగ్ న్యూస్. జూలై 1వ తేదీ నుంచి రైల్వే టికెట్ ధరలు పెరగనున్నాయి. నాన్ ఎసి మెయిల్/ఎక్స్‌ప్రెస్ ట్రైన్ టికెట్ ధరపై కిలోమీటర్‌కు పైసా, ఎసి తరగతి టికెట్ ధర కిలోమీటర్‌కు రెండు పైసలు పెరుగనుంది. ఈ విషయాన్ని కొన్ని మీడియా సంస్థలు వెల్లడించాయి. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. చాలా రోజుల తర్వాత రైల్వే టికెట్ ధరలు సవరిస్తున్నారు. తత్కాల్ టికెట్ బుక్ చేసుకోవాలంటే.. ఆధార్ అథంటికేషన్ తప్పనిసరని రైల్వే శాఖ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మార్పు జూలై 1 నుంచి అమలులోకి రానుంది. దీంతో పాటే సమరించిన టికెట్ ధరలు కూడా అమలులోకి వస్తాయని తెలుస్తోంది. సబర్బన్ టికెట్ ధరలు, 500 కిలోమీటర్ల వరకూ సెకండ్ క్లాస్ ప్రయాణానికి ఈ పెంపు వర్తించదు.. 500 కిలోమీటర్లు దాటితే పైసా చొప్పున చెల్లించాలి. సెలవారీ టికెట్ ధరల్లోనూ ఎలాంటి మార్పు ఉండబోదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అర్హత ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**
ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాల ఫలాలు అర్హత గల ప్రతి లబ్దిదారుడికి అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి సి.సి.ఎల్.ఎ. కమిషనర్ లోకేష్ కుమార్, వైద్య-ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టియాన, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్రావు, గృహ నిర్మాణ శాఖ ఎం.డి. గౌతమ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల





నిర్మాణం, ఉచిత ఇసుక సరఫరా, భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, వానాకాలం వ్యవసాయ సాగులో విత్తనాలు, ఎరువుల నిర్వహణ, వనమహోత్సవం -2025 లక్ష్యసాధన, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, టి.బి. ముక్త్ భారత్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ఇందులో భాగంగా అర్హులైన లబ్దిదారులకు మంజూరు పత్రాలను లబ్దిదారులకు అందించడం జరిగిందని, భారీ వర్షాలు ప్రారంభం కాకముందే లబ్దిదారులు ఇండ్ల గ్రౌండ్, మేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇండ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ మొక్కలను పంపిణీ చేసి సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో నిర్దేశించిన 18 కోట్ల మొక్కలు నాటే కార్యక్రమం 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. పంట సాగులో ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేరకు జిల్లాల వారీగా కేటాయించడం జరుగుతుందని, మండల ప్రత్యేక అధికారులు ఫర్టిలైజర్ షాపులను సందర్శించి నిల్వలు, విక్రయాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం 1 లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ ఫామ్ పంట సాగు జరిగేలా లక్ష్యం నిర్దేశించడం జరిగిందని, పంట లాభంపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన భూభారతి చట్టంలో భాగంగా మొదటి విడతలో రాష్ట్రంలోని 4 జిల్లాలో 4 మండలాలను ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, 2వ విడతలో ఉమ్మడి జిల్లాలో ఒక మండలం చొప్పున, 3వ విడతలో అన్ని మండలాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, ఇందులలో 2 లక్షల 48 వేల సాదాబైనామా దరఖాస్తులు రాగా, ఆర్.ఓ.ఆర్. సమస్యలు, పట్టాల మార్పిడి వంటి వివిధ సమస్యలపై అందిన దరఖాస్తులను ఆగస్టు 15వ తేదీ నాటికి పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాలలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి విష జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని, ఫ్రైడే డ్రైడే, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, వసతిగృహాలు, మున్సిపాలిటీలు ఇతర అన్ని ప్రాంతాలపై దృష్టి సారించాలని, వ్యాధుల ప్రభావిత ప్రాంతాలలో ఫాగింగ్, ఆయిల్ బాల్స్ పిచికారీ చేయాలని తెలిపారు. టి. బి. ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలలో ప్రభావిత ప్రాంతాలలో 100 రోజుల వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి చికిత్స అందించాలని తెలిపారు. టి.బి. నివారణలో భాగంగా నిరంతరం పర్యవేక్షిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలలను పర్యవేక్షణ కమిటీ సభ్యులు సందర్శించి స్థితిగతులను పరిశీలిస్తారని, రోగుల సంక్షేమం, విద్యా సంవత్సరం అంశాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. శాఖల వారిగా రోజు వారీ కార్యక్రమాలను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ప్రముఖుల సమావేశాలలో మొదటగా చెట్లు నాటే కార్యక్రమం ప్రారంభించాలని, అటవీ ప్రాంతంలో పండ్ల మొక్కలు ఎక్కువగా నాటి జంతువులకు ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. "ఏక్ పేడ్ మా కే నామ్"లో భాగంగా పాఠశాలలల్లో విద్యార్థినీ, విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ, ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలని, సకాలంలో నీటిని అందించాలని, టి.జి.ఎఫ్.ఎం.ఐ.ఎస్. వెబ్సైట్లో జియో-కోఆర్డినేట్ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులలో వివిధ భూ సమస్యలపై అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరి చూసి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వన మహోత్సవం క్రింద జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను సాధించేలా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వానాకాలం సీజన్ లో విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా ప్రతిరోజు పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించే విధంగా రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. వానకాలం సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్ అశిష్ సింగ్, జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డా? హరీప్రజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ శివాజీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ తప్ప మరే పార్టీ ఆలోచన చేయలేదు

- సీఎం రేవంత్ రెడ్డి

**మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వెలుతురు జూన్ 24**





రైతుల కోసం ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీ తప్ప మరే పార్టీ ఆలోచన చేయలేదని, రైతులను ప్రేమించలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సెక్రటేరియట్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ప్రసంగించారు. రైతులు సాగు చేసుకునేందుకు ఈ దేశంలోబహుళార్థక సార్ధక ప్రాజెక్టులు నిర్మించింది , రైతుల కోసం ఉచిత కరెంటు, రైతులు పండించే పంటకు మద్దతు ధర, బ్యాంకులు తప్పనిసరిగా రైతులకు రుణాలు ఇవ్వాలన్న నిబంధన పెట్టింది, వ్యవసాయంలో రెట్టింపు దిగుబడులు సాధించేందుకు హరిత విప్లవం వంటి గొప్ప గొప్ప కార్యక్రమాలను ఈ దేశంలో చేపట్టింది కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు తప్ప మరే ప్రభుత్వాలు చేయలేదని, రైతులను కాంగ్రెస్ పార్టీ ప్రేమించినంతగా మరే పార్టీ దగ్గరకు తీసుకోలేదని సీఎం అన్నారు. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అంటేనే వ్యవసాయం అన్నారు. కేవలం తొమ్మిది రోజుల్లో రైతు భరోసా నిధులు 9 వేల కోట్ల రూపాయలు రైతులు ఖాతాల్లో జమ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఈరోజు దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన సందర్భం అని హర్షం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం లో ప్రజా ప్రభుత్వ క్యాబినెట్ సమిష్టి నిర్ణయంతో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి తొమ్మిది రోజుల్లో 9,000 కోట్లు జమ చేశాం అని సీఎం తెలిపారు. ఈ దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకువెళ్లాలని, ఈ దేశంలో అద్భుతాలు సృష్టించాలని కలలుగన్న దేశం కోసం ప్రాణాలు అర్పించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ సాక్షిగా రైతులు పండుగ చేసుకోవడం సంతోషంగా ఉందని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇరవై ఒక్క వేల కోట్ల రైతుల రుణమాఫీ చేశాం దేశంలోని ఏ ప్రభుత్వము ఈ సాహసం ఇప్పటివరకు చేయలేదు అన్నారు. భూమిలేని నిరుపేద రైతు కూలీలకు సంవత్సరానికి 12,000 చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం అని అన్నారు. 10 సంవత్సరాల పాటు ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ పాలకులు రైతు బంధు పేరిట అరకొర నిధులు జమ చేసి వడ్డీ లేని రుణాలు, పావలా వడ్డీకే రుణాలు, డ్రిప్పు, స్ప్రింక్లర్ల, మద్దతు ధర, పండిన పంటకు బోనస్, పంట నష్ట పరిహారం వీటన్నిటిని నిలిపివేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు రుణమాఫీ చేపట్టాం, రైతు భరోసా ఇస్తూ కూడా డ్రిప్పు, స్ప్రింక్లర్లను ఇస్తున్నాం, పంట నష్టం జరిగితే పరిహారం అందిస్తున్నాం, రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు పంపిణీ చేస్తున్నాం రైతుల కోసం కావలసిన అన్ని సౌకర్యాలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప మరో ప్రభుత్వం ఈ రాష్ట్రంలో చేయలేదు, చేయబోరు అన్నారు. ఈనెల 16న అగ్రికల్చర్ యూనివర్సిటీలో తొమ్మిది రోజుల్లో రైతు భరోసా కింద 9వేల కోట్లు జమ చేసి ఈనెల 24న పెద్ద ఎత్తున పండుగ చేస్తామని ప్రకటించాం అన్నట్టుగానే మాట నిలబెట్టుకున్నాం, రైతుల పండుగకు కారణమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని సిఎం కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో రైతు నేస్తం కార్యక్రమాన్ని 8 రైతు వేదిక కేంద్రాలలో నిర్వహించడం జరిగింది. శామీర్ పేట్, సింగాయిపల్లి, కీసర,యాద్గార్ పల్లి, ప్రతాపసింగారం ఘట్కెసర్, మేడ్చల్, మూడుచింతలపల్లి మండలాలలోరైతు వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అందులో మూడుచింతలపల్లి మండలంలో రైతు వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ మను చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల తర్వాతే నోటిఫికేషన్




**హైదరాబాద్, జూన్ 24, ( వెలుతురు)**

తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ఈ అంశంపై కోర్టులో జరిగిన వాదనల్లో తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు మరో అరవై రోజుల సమయం కావాలని కోరింది. వాదనల్లో ప్రభుత్వం ఎన్ని రోజుల్లో ఎన్నికలు నిర్వహిస్తారో చెప్పాలని ధర్మాసనం ప్రశ్నించింది. దానికి అరవై రోజుల గడువు కోరింది. గతంలో జరిగిన విచారణల్లో గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ ఎందుకు నిర్వహించలేదని హైకోర్టు ప్రశ్నించింది. వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తెలంగాణలో జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీల ఎన్నికల్లో జాప్యంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు అయింది. గతంలోనే విచారణ జరిగింది. జనవరి 30, 2025న జరిగిన విచారణలో, హైకోర్టు బెంచ్ పంచాయతీ రాజ్ శాఖను మూడు వారాలలో సమాధానం దాఖలు చేయాలని ఆదేశించింది. కొంత జాప్యం తర్వాత ఇప్పుడు మళ్లీ విచారణకు వచ్చింది. గత విచారణలో ప్రభుత్వం ఫిబ్రవరిలోపు ఎన్నికుల నిర్వహిస్తామని చెప్పింది.కానీ ఫిబ్రవరి ముగిసిపోయి మరో నాలుగు నెలలు గడిచిపోయినా ఎన్నికలు నిరవహించలేదు. ఇప్పుడు మరో అరవై రోజుల సమయం కావాలని ఎన్నికల కమిషన్ హైకోర్టుకు తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇది గ్రామీణ ప్రాంతాలలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను దెబ్బతీస్తోందని పిటిషనర్ విచారణలో వాదించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సంవత్సరాలుగా నిర్వహించకపోవడం వల్ల సంబంధిత గ్రామాలకు సంక్షేమ కార్యకలాపాలు అందకుండా పోయాయని పిల్‌లో వాదించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటి పోవడంతో పాటు అన్ని స్థానిక సంస్థలకు సంబందించిన పాలక వర్గాల గడువు ముగిసింది. అన్ని పాలక వర్గాలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ. 1,500 కోట్లు నష్టం జరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి.మరో వైపు కాంగ్రెస్ పార్టీ క్యాడర్ నుంచి కూడా ఎన్నికలు నిర్వహించాలన్న ఒత్తిడి వస్తోంది. స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్న ఉద్దేశంతోనే.. వెంటనే ప్రభుత్వం రైతు భరోసాని అమలు చేసిందని చెబుతున్నారు. ఈసారి తైరు భరోసాని రైతులందరి ఖాతాల్లో జమ చేశారు. ఇప్పుడు మరో రెండు నెలల గడువు కావాలని హైకోర్టును కోరడంతో.. స్థానిక ఎన్నికలు ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొంత మంది మంత్రులు.. వచ్చే పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ వస్తుందన్నట్లుగా మాట్లాడటం కూడా వివాదాస్పదం అయింది.

## హౌజింగ్ బోర్డు స్థలాలకు రికార్డ్ వేలం

**హైదరాబాద్, జూన్ 24, ( వెలుతురు)**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక కమర్షియల్ ప్లాట్‌ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకు రాగా, మరో చోట రూ. 13.51 కోట్లు పలికింది. రెండు ఎంఐజి ప్లాట్లను కూడా సుమారు 4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి పోటీపడ్డారు. అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, హౌజింగ్ కమిషనర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు.నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి. కూకట్‌పల్లి కెపీహెచ్‌బీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారు.గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చింది.గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు. ఈ భూములకు చదరపు గజానికి 1.20 లక్షలను ఆఫ్ సెట్ ధరగా నిర్ధారించగా వేలం పాటలో అది 2.22 లక్షలు పలికింది. అట్లాగే ఇదే ప్రాంతంలోని 1200 గజాల పాఠశాల భూములకు ఆఫ్ సెట్ ధర చదరపు గజానికి 80 వేలుగా నిర్ధారించగా, వేలంలో ఆ భూములకు రూ 1.12 లక్షలకు కొనుగోలు చేశారు. ఇక్కడి రెండు ఎంఐజి ప్లాట్లు చదరపు గజం రూ.1.86 లక్షలు, రూ. 1.32 లక్షల ధరలు పలికాయి. ఒక్క గచ్చిబౌలి ప్రాంతానికి సంబంధించిన భూముల ద్వారానే 55 కోట్ల 56 లక్షల 84 వేల మేర ఆదాయం హౌజింగ్ బోర్డుకు సమకూరింది.కుత్బుల్లాపూర్ మండలంలోని చింతల్ ప్రాంతంలోని హౌజింగ్ బోర్డు ఎంఐజీ ప్లాట్లు కూడా అత్యధిక ధరలతో బహిరంగ వేలంలో అమ్ముడు పోయాయి. ఈ ప్రాంతంలో మొత్తం పది ప్లాట్లను వేలం వేయగా వీటిలో ప్లాట్ నెం.113,114,115ల ద్వారానే సుమారు 8.11 కోట్ల మేర ఆదాయం వచ్చింది. నిజాంపేట- బాచుపల్లిలోని నాలుగు ప్లాట్లను సుమారు రూ.70 లక్షలకు వేలం పాటలో కొనుగోలు చేశారు.

## స్వదేశానికి పెద్ద ఎత్తున ఇండియన్స్

**న్యూఢిల్లీ, జూన్ 24, ( వెలుతురు)**


ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య టెన్షన్లు తగ్గలేదు. 11 రోజులుగా జరుగుతున్న యుద్ధంతో అక్కడి జనజీవనం భయానకంగా మారింది. జెరూసలెం లాంటి కొన్ని నగరాలైతే ఏ క్షణం ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు . ఇటు.. యుద్ధభూమి నుంచి భారత పౌరులను స్వదేశానికి తరలించే ఆపరేషన్ సింధు కొనసాగుతోంది. ఐదు రోజుల్లో ఇరాన్ నుంచి ఎనిమిది విమానాల్లో 1700 మందికి పైగా భారతీయులు స్వదేశానికి చేరుకున్నారు. 162 మంది భారతీయులు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్ సరిహద్దు దాటి వచ్చారు. టెల్అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయంనుంచి బస్సుల్లో భారతీయులను జోర్డాన్‌కి తరలిస్తున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానాల్లో స్వదేశానికి తీసుకొస్తున్నారు.అటు.. ఇరాన్ నుంచి ఇజ్రాయిల్ నుంచి సొంత రాష్ట్రాలకు వస్తున్నారు తెలుగువారు. ఇప్పటి వరకు ఇరాన్ నుంచి నలుగురు, ఇజ్రాయెల్ నుంచి ఇద్దరు విద్యార్థులు తిరిగివచ్చారు. ఢిల్లీ నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకున్న విద్యార్దులకు తోడుగా నిలబడి అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారు తెలంగాణ భవన్ అధికారులు. సోమవారం సాయంత్రం నాలుగున్నరకు 291 మందితో ఒక విమానం, రాత్రి పదకొండున్నరకు 165 మందితో ఒక విమానం ఢిల్లీకి చేరుకున్నాయి. ఇందులో వచ్చే మొత్తం 18 మంది తెలుగు విద్యార్థులను స్వస్థలాలకు పంపేందుకు ఢిల్లీలోని ఏపీ భవన్ ఏర్పాట్లు చేసింది. ఇదిలా ఉంటే బిహార్ శివాన్ జిల్లాకు ఓ కుర్రాడు ఇరాన్‌లో మిస్సయ్యాడు. ఇంజనీరింగ్ చదువుకున్న పాతికేళ్ల సిరాజ్ అలీ అన్సారీ ఒక పెట్రోలియం కంపెనీలో క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్‌గా చేరాడు. జూన్ 9న సౌదీ అరేబియా నుంచి ఇరాన్ చేరుకున్నాడు. జూన్ 17న మధ్యాహ్నం తర్వాత అతడితో కమ్యూనికేషన్ తెగిపోయింది. తమవాడి ఆచూకీ చెప్పాలంటూ భారత ప్రభుత్వానికి వేడుకుంటోంది అతడి కుటుంబం.

## తెలంగాణ రైతుల జీవితం భూమితో ముడిపడి ఉంది

- వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది
- రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి







**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 24**

రైతుభరోసా పథకంలో వానాకాలం పంట సాగు కొరకు రాష్ట్రంలోని 1 కోటి 49 లక్షల ఎకరాలకు దాదాపు 70 లక్షల మంది రైతుల ఖాతాలలో 9 వేల కోట్ల రూపాయలు విజయవంతంగా జమ చేయడం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్లోని రాజీవ్‌ంధీ విగ్రహ ప్రాంగణం నుండి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఇతర రాష్ట్ర మంత్రులు, వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం.రఘునందనావు లతో కలిసి రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో గల 1 వేయి 600 రైతు వేదికలలో జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తెలంగాణ రైతుల జీవితం భూమితో ముడిపడి ఉందని, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గత సంవత్సరం ఆగస్టు 15వ తేదీన రైతు రుణమాఫీ కార్యక్రమం ద్వారా 25 లక్షల 35 వేల 964 మంది రైతులకు 20 వేల 617 కోట్ల రూపాయలు అందించి రుణ విముక్తులను చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 2 కోట్ల 80 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం ఉత్పత్తి జరిగిందని, ప్రజా ప్రభుత్వ పాలనలో దళారుల నుండి విముక్తి కలిగించేందుకు కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరతో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి 48 గంటలలోగా సంబంధిత రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరిగిందని, సన్నరకం వడ్లు పండించిన రైతులకు మద్దతు ధరతో పాటు 500 రూపాయలు బోనస్ అందించడం జరిగిందని తెలిపారు. సంవత్సర కాలంలో దాదాపు 60 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి ఎల్.బి. స్టేడియం వేదికగా నియామక పత్రాలు అందించడం జరిగిందని తెలిపారు. రైతులు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై వ్యవసాయంలో సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. 18 నెలల కాలంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్, రైతు భీమా, రైతు రుణమాఫీ, పంట కొనుగోలు, సన్నరకం వడ్లకు బోనస్ లలో మొత్తంగా 1 లక్షా 4 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పంట సాగులో సేంద్రియ వ్యవసాయాన్ని అమలు చేసి ఆరోగ్యకరమైన పంట దిగుబడితో ప్రజల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తూ అవసరమైన పనిముట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి దిశగా అడుగులు వేయడం జరుగుతుందని, తద్వారా ఉచిత విద్యుత్ అందడంతో పాటు మహిళలకు అదనపు ఆదాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. గిరిజన రైతుల సంక్షేమం కోసం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక చేయూత ఇస్తూ ఒక సంవత్సరంలో 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు ఏకరూప దుస్తులు తయారు చేసేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ క్రింద స్వయం సహాయక సంఘాల మహిళలకు అవకాశం కల్పించి అదనపు ఆదాయాన్ని అందించడం జరిగిందని తెలిపారు. మహిళల ఆధ్వర్యంలో దాదాపు 1000 నూతన బస్సులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళలతో రాష్ట్ర వ్యాప్తంగా 8 వేల ఐ.కె.పి. కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు, పండ్లు, పాలు, గ్రుడ్లు అందించేందుకు మహిళల ఆర్థికాభివృద్ధికి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద పేద రైతులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందని తెలిపారు. వరితో పాటు లాభదాయకమైన పంటలు సాగు చేయడం, భూసారానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించి ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అన్ని రంగాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై మాట్లాడుతూ రైతు సంక్షేమం దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను జిల్లాలో అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. రైతు నేస్తం ద్వారా రైతులకు పంట సాగులో మెళకువలు అందించడం జరుగుతుందని, భూసారానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంట వివరాలు తెలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, మండల వ్యవసాయాధికారి సుధాకర్, వ్యవసాయ విస్తరణాధికారి అరుణ్కుమార్, సాంకేతిక ఎ.ఓ. శ్రీనివాస్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను భాగస్వామ్యం చేస్తూ
## వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలి

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు

**మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా జూన్ 24, ( వెలుతురు)**









ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సి.ఎస్ కే.రామ కృష్ణా రావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్ లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కోండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్ల, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాల పై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే. రామ కృష్ణా రావు మాట్లాడుతూ, 2 లక్షల 30 వేల కు పైగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. పెద్ద వర్షాలు కురవడానికి ముందే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్, బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరిగేలా చూడాలని సీఎస్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ సీనరేజి చార్జిలను ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ప్రస్తుతం ఎంత మేరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం జరిగిందో ఎంబీ రికార్డులను నమోదు చేసి లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని, ప్రభుత్వం మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుందని అన్నారు. పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 క్రింద మనకు లక్షా 13 వేల ఇండ్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ప్రతి పట్టణం నుంచి కనీసం 500 మంది నిరు పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల పెంపకం సైతం పరిశీలించాలని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సీఎస్ కలెక్టర్ లకు సూచించారు. ప్రతి జిల్లా ప్రత్యేకమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని, నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు జియో కో-ఆర్డినేట్స్ తో ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. ప్రతి జిల్లాలో ఎరువుల లభ్యత స్టాక్ పై రివ్యూ పెట్టాలని అన్నారు. జూలై వరకు అవసరమైన స్టాక్ ప్రస్తుతం అందుబాటులో ఉందని, సెప్టెంబర్ నాటికి అవసరమైన ఎరువుల స్టాక్ ప్రోక్యూర్ చేస్తున్నామని అన్నారు. ఎరువుల స్టాక్ ను ప్రత్యేక అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. రిటైల్ విక్రయాలను డిజిటలైజ్ చేయాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల షాప్ వద్ద ఎక్కడ కొరత రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. లక్షా 25 వేల ఎకరాలలో ఆయిల్ పామ్ పంట సాగు ప్రస్తుత సంవత్సరం విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. రైతులకు లాభసాటి పంట ఆయిల్ పామ్ పట్ల అవగాహన కల్పిస్తూ పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా దాదాపు 8 లక్షల 27 వేల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సాధా బైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టాలో కరెక్షన్స్ వంటి వివిధ సమస్యల పై దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఆగస్టు 15 నాటికి ఈ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. డెంగ్యూ, మల్లేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు జిల్లాల్లో పటిష్ట చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ లు ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధుల నియంత్రణ పై అవగాహన కల్పన, పర్యవేక్షణ వంటి పలు కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వల్నరబుల్ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి లక్షణాలు గల ప్రతి ఒక్కరికి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ జరిగిన వారికి అవసరమైన చికిత్స అందించాలని అన్నారు. ఆన్ లైన్ నుంచి వీసి లో పాల్గోన్న అటవీ, పర్యావరణ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ మాట్లాడుతూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గోన్నాలని అన్నారు. గతం కంటే మెరుగ్గా ప్రజల్లో వన మహోత్సవం కార్యక్రమం తీసుకుని వెళ్ళాలని, ప్రతి రోజూ ఒక్కో శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వసించాలని అన్నారు. జిల్లాలో వి.ఐ.పి పర్యటనల సందర్భంగా తప్పనిసరిగా మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పరిధిలో ఎత్తైన మొక్కలు నాటి వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అటవీ ప్రాంతంలో కోతులకు అవసరమైన పండ్ల మొక్కలను పెద్ద ఎత్తున బ్లాక్ ప్లాంటేషన్ పెంచాలని అన్నారు. జిల్లాలకు కేటాయించిన వన మహోత్సవం లక్ష్యాలను కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ వహించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు మను చౌదరి, అదనపుకలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్ ఓ హరిప్రియ, సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల తనిఖీకై ఉపాధ్యాయులను వినియోగించాలనే అసంబద్ధ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాల

### తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ మంచిర్యాల జిల్లా శాఖ అధ్యక్షులు రాసపల్లి రవి

**హైదరాబాద్, జూన్ 24, ( వెలుతురు)**




పాఠశాలల తనిఖీకై ఉపాధ్యాయులను వినియోగించాలనే అసంబద్ధ ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని TRTF మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రాసపల్లి రవి, ప్రధాన కార్యదర్శి ఎం తిరుపతి ప్రభుత్వాన్ని కోరారు పక్క రాష్ట్రం ఏపీ తరహాలో ప్రతి మండలానికి ఇద్దరు ఎంఈఓ లను నియమించాలి ఒకరు పాలనపరమైన బాధ్యతలను చూస్తే మరొకరు కేవలం పాఠశాల పర్యవేక్షణ కోసం నియమించబడాలి. ఆ రాష్ట్రంలో పగడ్బందీగా అమలవుతున్న ఈ విధానాన్ని మన రాష్ట్రంలో అమలు పరచాలి .అంతేకాకుండా ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతికి ఒక తరగతి గది ఉండాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుని కేటాయించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి ఉన్నత పాఠశాల పర్యవేక్షణను బలోపేతం చేసేందుకు ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒకటి చొప్పున డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టులను మంజూరు చేయాలి అంతేకానీ కిందిస్థాయి అధికారులతో పై స్థాయి అధికారుల పనితీరును పర్యవేక్షించే ఈ తిరోగమన ఉత్తర్వులను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను కొనసాగించే ఎంఈఓ పోస్టులను ఏళ్ల తరబడి ఇన్చార్జిలతో కొనసాగిస్తూ ఉన్నత పాఠశాలలను పర్యవేక్షించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టులను ప్రమోషన్స్ ద్వారా నింపకుండా ఏళ్ల తరబడి విద్య వ్యవస్థను కొనసాగిస్తున్న ప్రభుత్వం వెంటనే మండలానికి ఇద్దరు ఎంఈఓ పోస్టులను, శాసనసభ నియోజకవర్గానికి ఒక్క డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టు లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు

# అఖండగోదావరికి 26న శంకుస్థాపన

● టూరిజం మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి



**అమరావతి, జూన్( వెలుతురు):**
కూటమి ప్రభుత్వం నేపథ్యంలో జూన్ 26న అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. చిరకాల వాంఛగా ఉన్న అఖండ గోదావరి ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తాజాగా ఏపీ టూరిజం మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఈనెల 26న అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షకావత్, ఎంపీ పురంధేశ్వరి పాల్గొన్నారని అయన తెలిపారు. అలాగే ఆయన మాట్లాడుతూ.. 127 సంవత్సరాల రాజమండ్రి హ్యావ్ లాక్ వంతెన పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. 97 కోట్ల 44 లక్షల రూపాయల అంచనాలతో అఖండ గోదావరి ప్రాజెక్టుకు సిద్ధం కానున్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఈ ఏడాది ఏపీలో టూరిజం అభివృద్ధి 375 కోట్ల రూపాయల పనులు మంజూరు చేయించుకున్నామన్నారు. ఇకపోతే అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు ద్వారా రాజమహేంద్రవరం నగరం, గోదావరి పర్యాటక ప్రాంతాలకు కొత్త రానున్నాయి. రాష్ట్రాన్ని మరింత పర్యాటక ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే లక్ష్యంగా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఆయన అన్నారు. ఈ నిధులు స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్ మెంట్ పథకం ద్వారా మంజూరయ్యాయి. ఈ రూ.97 కోట్లతో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం, కొవ్వూరు, నిడదవోలు వంటి ఇతర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి పనులు శరవేంగంగా జరగనున్నాయి. రాబోయే పుష్కరాల లోపే ఈ ప్రాజెక్టును పూర్తి చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగనుంది.

# అక్కడ వానలే..వానలు

**నిజామాబాద్, జూన్( వెలుతురు):**
మిన్ను కురిస్తేనే మన్ను పండుతుంది. మొన్న పండితేనే నోట్లోకి ఐదు వేళ్ళూ వెళతాయి. లేకుంటే అంతే సంగతులు.. మనదేశమే కాదు.. ప్రపంచం మొత్తం మీదే పరిస్థితి. వర్షం కురిస్తేనే పంటలు పండుతాయి. పంటలు పండితేనే భూమ్మీద మనిషి మనుగడ కొనసాగుతుంది. వర్షాలు కురువని నాడు.. ఆ పంటలు పండని నాడు.. మనిషి మనుగడ ముగిసిపోతుంది. ఈ ఏడాది వర్షాలు బాగా కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మే చివరి వారం లోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని.. బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడతాయని.. తద్వారా వర్షాలు విస్తారంగా కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు వెల్లడించారు. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. అడపాదడప వర్షాలు కూడా కురిసాయి. దీంతో రైతులు దుక్కులు దున్నారు. విత్తనాలు కూడా విత్తారు. సాగు పనులు చేపట్టేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే మందు మురిపించిన వర్షాలు ఆ తర్వాత ముఖం చాటేసాయి. ఫలితంగా నిండు వాన కాలంలో రెండో ఎండాకాలం మాదిరిగా సూర్యుడి రెచ్చిపోతున్నాడు. బీభత్సంగా ఎండకాస్తూ జనాలకు చుక్కలు చూపిస్తున్నాడు. దీంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఎండకు తీవ్ర ఉక్కపోత కూడా కారణం కావడంతో పగటిపూట కాదు రాత్రిపూట కూడా ప్రజలు నరకం చూస్తున్నారు. కంటినిండా కునుకు కూడా కరువు కావడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉంది. వర్షాలు లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తలేదు. మొలకెత్తిన మొలకలు మాడిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న వనరులతో నీటి తడులు ఇస్తున్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లో అయితే రైతులు వాన దేవుడికి పూజలు చేస్తున్నారు. కప్పతల్లి ఆట ఆడుతూ వరుణుడు కరుణించాలని కోరుతున్నారు. వరద పాశం నాకుతూ వర్షాలు కురవాలని దేవుడికి మొక్కుతున్నారు.. తెలంగాణలోని ఓ ప్రాంతంలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. రోకలిని ఇద్దరు వ్యక్తులు మోస్తూ.. మధ్యలో ఒక వస్త్రంలో కప్పను కట్టారు. ఆ కప్ప మీద నీళ్లు చల్లుతూ ఊరంతా ప్రదర్శన చేశారు. డప్పులు కొట్టుకుంటూ వర్షాలు కురవాలని పూజలు చేశారు. అయితే వాతావరణ శాఖ అంచనా ప్రకారం జూలై మొదటి వారం దాకా వర్షాలు కురిసే అవకాశం లేదని తెలుస్తోంది. ఋతుపవనాల విస్తరణలో మందగమనం వల్లే ఇలాంటి పరిస్థితి చోటుచేసుకుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా వాయుగుండం లేదా ఉపరితల ద్రోణి ఏర్పడితేనే పరిస్థితి మెరుగవుతుందని వారు అంటున్నారు. అయితే కప్పతల్లి ఆట ఆడటం వల్ల వర్షాలు కురుస్తాయని గ్రామస్తులు నమ్ముతారు. వరద పాశం నాకినా కూడా వర్షాలు కురుస్తాయని భావిస్తుంటారు. వర్షాకాలంలో వర్షాలు కురియకపోతే రైతులు ఇలాంటి పనులు చేస్తుంటారు.. అయితే ఇవి చేస్తే వర్షాలు పడతాయని రైతులు భావిస్తుంటే.. వీటికి వర్షాలకు ఏంటి సంబంధం అని కొంతమంది ప్రశ్నిస్తుంటారు. అయినప్పటికీ వారి నమ్మకం ఆధారంగానే రైతులు ముందుకు సాగుతుంటారు.

# డబ్బులతో ఛైర్మన్ పరార్...

**అదిలాబాద్, జూన్( వెలుతురు):**
అది తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల.. ఆ ప్రాంతంలో మహేందర్ రెడ్డి అనే వ్యక్తి ప్రతిభ జూనియర్ కాలేజీ ని నిర్వహిస్తున్నాడు. మొదట్లో ఈ కాలేజీలో చదివిన విద్యార్థులకు మంచిర్యాంకులు రావడంతో.. గుర్తింపు సంపాదించుకుంది. అప్పటిదాకా మంచివాడిగా.. కాలేజీ చైర్మన్ గా కనిపించిన మహేందర్ రెడ్డి.. ఒక్కసారిగా తన అసలు రూపాన్ని చూపించడం మొదలుపెట్టాడు. కాలేజీ పేరు చెప్పి తెలిసిన వాళ్ళ దగ్గర అప్పులు చేయడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత వాటిని ఇవ్వకుండా అలానే కాలయాపన చేశాడు. వచ్చిన డబ్బులను ఇతర మార్గాల్లో పెట్టుబడిగా పెట్టాడు. అవి కాస్త వచ్చే మార్గం లేకపోవడం.. అప్పులు తెచ్చిన దగ్గర ఒత్తిడి పెరిగిపోవడంతో మహేందర్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నాడు. రాత్రికి రాత్రే జెండా ఎత్తేశాడు. అప్పులు ఇచ్చిన వారికి డబ్బులు చెల్లించకుండా.. తన కాలేజీని మధ్యవర్తుల సహాయంతో అమ్మాలని మహేందర్ రెడ్డి నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లను మధ్యవర్తుల ద్వారానే అందించాలని భావించినట్టు సమాచారం. అందువల్లే అతడు కొంతమంది మధ్యవర్తులను నియమించుకొని ఈ తతంగాన్ని చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే ఈ విషయాన్ని తెలుసుకున్న అప్పులు ఇచ్చినవారు ఆందోళనకు దిగారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మహేందర్ రెడ్డి నిర్వాకం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వడానికి డబ్బులు అడుగుతున్నట్టు సమాచారం. అయితే ఈ విషయం కాస్త పోలీసుల దాకా వెళ్ళింది. పోలీసులు మధ్యవర్తులను అదుపులోకి తీసుకున్నారు. మహేందర్ రెడ్డి ఆచూకీ ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి.. వారిని సన్మార్గంలో పెట్టాల్సిన చైర్మన్ ఇలా దారి తప్పడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యను వ్యాపారంగా మార్చేసి.. అడ్డగోలుగా అప్పులు తెచ్చి.. చివరికి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న మహేందర్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.. మహేందర్ రెడ్డి తొలి రోజుల్లో కాలేజీ నిర్వహణ సక్రమంగానే చేపట్టారని.. ఆ తర్వాతే డబ్బు మీద మోజుతో అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అప్పులు తెచ్చి.. వాటిని ఇతర మార్గాల్లో పెట్టుబడులుగా పెట్టారని.. అవి తిరిగి వచ్చే అవకాశం లేకపోవడంతో కాలేజీని మొత్తం ఎత్తివేసారని.. రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు మహేందర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని.. విద్యార్థులకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. కాలేజీ భవనం విక్రయించి అప్పులు ఇచ్చిన వారికి తిరిగి డబ్బులు చెల్లించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి దశాదిశా కరువైంది..


**(మొదటి పేజీ తరువాయి..)**
ఏమీలేదు. నిర్ణయాలు ఏవీ లేవు.
రైతుభరోసా పేరిట రైతుల ఖాతాల్లో మొత్తం డబ్బులు జమ చేశామని చెప్పుకుంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుని సమావేశాన్ని ముగించారు.
అసలు ఆరు గంటల పాటు చర్చించిన అంశాలు ఏమిటో ప్రజలకు చెప్పడం లేదు.
రైతు భరోసా పైసలు గత మూడు విడతలు ఎగ్గొట్టారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కోర్టు మొట్టికాయలు వేస్తుందేమోననే భయంతో, పోటీకి అభ్యర్థులు దొరకరన్న ఆందోళనతో రైతు భరోసా పేరిట హడావుడిగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేశారు.
వాస్తవంగా భూముల అమ్మకంల ద్వారా వచ్చిన నిధులను, అప్పులు తెచ్చిన పైసలతో రైతులకు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు. భూములమ్మనిదే రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు దొరికే పరిస్థితి లేదు. అప్పులు చేయనిదే రోజులు గడిచే పరిస్థితి లేదు.
గతంలో కేసీఆర్ రూ.10 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీఎం పదవిలోకి వచ్చాక అదే దారిలో కొనసాగుతూ... కేసీఆర్‌ను మించిపోయే స్థాయిలో ప్రజలపై అప్పుల భారం పెడతారేమోనన్న అనుమానం కనపడుతోంది.
అప్పులు తేవడంలో కేసీఆర్ కు అన్నగా మారే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్-బీఆర్ఎస్ దొందుదొందే. తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసే ప్రయత్నం చేస్తున్నాయి.
బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలు అవినీతిలో కవలపిల్లలు. ఒకరినొకరు రక్షించుకోవడానికి ఎన్ని కసరత్తులు చేస్తున్నారో స్పష్టంగా కనిపిస్తోంది.
కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి విషయంలో.. సీఎం రేవంత్ రెడ్డి సీబీఐ విచారణకు ఎందుకు కోరడం లేదు?
ఒకవైపు అవినీతి విచారణ కోసం ఘోష్ కమిషన్‌ను నియమించినట్టుగా పబ్లిక్‌కి చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కానీ 18 నెలలు గడిచినా, ఆ కమిషన్‌కి ఆధారాలు ఇవ్వలేకపోయిన దురదృష్టకరమైన స్థితిలో ఉంది. ఇంకా కేబినెట్ లో 'ఆధారాలు ఇవ్వాలా? వద్దా?' అనే ఆలోచన చేశారు.
ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని కేసీఆర్ కాపాడారు. ఇప్పుడు కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నాడు.
ఒకవైపు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరగలేదని, అది తెలంగాణకు వరప్రదాయిని అని బీఆర్ఎస్ నాయకులు చెప్తున్నరు.
మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ అధికారుల ఇళ్లలో ఎలాంటి అక్రమాస్తులు దొరికాయో ప్రజలందరికీ తెలిసిన విషయమే.
ఒక అధికారి నూనె శ్రీధర్ వద్ద రూ.200 కోట్లు హరిరామ్ అనే ప్రాజెక్టు ఈఎన్సీ వద్ద రూ.500 కోట్ల అక్రమాస్తులు బయటపడినప్పుడు, అధికారులే ఈ స్థాయిలో దోచుకున్నారంటే అటు అధికారుల నియామకానికి, ముఖ్యమైన నిర్ణయాలకు బాధ్యత వహించినవారు ఎంత దోచుకున్నారో ప్రజలు ఊహించుకోవచ్చు.
బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కాళేశ్వరంలో అవినీతి లేదు అని నిస్సిగ్గుగా తేల్చేస్తే, కాగ్ రిపోర్ట్ మాత్రం వారిని బొక్కబొర్లా పడేసింది.
భారతదేశ చరిత్రలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద కుంభకోణమని కాగ్ రిపోర్టు చెబుతోంది.
అసలు ప్రాజెక్ట్ ఖర్చు రూ. 81 వేల 911 కోట్లుగా మొదలై... అది చివరకు రూ.1.47 లక్షల కోట్లకు ఎలా దూసుకెళ్లిందో కాగ్ స్పష్టంగా బయటపెట్టింది.
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఒక్క రూపాయికి గరిష్ఠంగా 52 పైసలే ఖర్చుపెట్టారని కాగ్ చేసిన వ్యాఖ్య బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిని చాటిచెప్పే ఆధారం.
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ గారు నాలుగు పార్టీలు మారిన నాయకుడు. దేశ చరిత్రలో ఓ విద్యార్థి నాయకుడు అవినీతి ఆరోపణలతో సస్పెండైన చరిత్ర లేదు. కాని అలాంటిది దాసోజు శ్రవణ్ విద్యార్థి నాయకుడిగా ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేసి అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన ఏకైక వ్యక్తి.
అలాంటి వ్యక్తి నీతి గురించి మాట్లాడటం వింతగా ఉంది. ఐరన్ లెగ్ శాస్త్రిలా పార్టీలు మారుకుంటూ వచ్చిన ఆయనకు బిజెపిని విమర్శించే, నీతులు వల్లించే నైతిక హక్కులేదు.
మాజీ మంత్రి గంగుల కమలాకర్ పుస్తకాల గురించి, చదువు గురించి నీతులు చెబుతున్నారు. అసలు ఆయన జీవితమే కుంభకోణాలమయం.
విలువైన ఖనిజాలను మైనింగ్ మాఫియాలకు విదేశాలకు ఎగుమతి చేసి రూ. 500 కోట్ల పన్నును ఎగ్గొట్టిన వ్యక్తి.
కరీంనగర్‌లో మైనింగ్ మాఫియా అంటే గంగుల కమలాకర్ గుర్తు వస్తారు. అలాంటి వ్యక్తికి బిజెపి పై విమర్శలు చేసే నైతిక హక్కులేదు.
అలాంటి వ్యక్తి కాంగ్రెస్-బిజెపి ఒక్కటంటూ విమర్శలు చేయడం సిగ్గుచేటు.
నిజాయితీ అంటే తానే.. న్యాయానికి నిర్వచనం తానే అన్నట్లుగా మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ రావు పాత్రను ప్రజలే ప్రశ్నిస్తున్నారు.
గతంలో కేసీఆర్‌కు తప్పుడు సలహాలు ఇచ్చి ఆయనను నష్టపరిచింది ఈయననే.
యాదాద్రి పవర్ ప్రాజెక్టులో రూ. 500 కోట్ల అవినీతికి సంబంధించి వినోద్ పైనే ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ శాఖలో అవినీతిని విచారించేందుకు ప్రభుత్వం నియమించిన కమిషన్ నివేదిక బయటకి రాకపోయినా, ఆ కమిషన్‌లో అవినీతి వ్యవహారానికి సంబంధించి వినోద్ పాత్రే ప్రముఖంగా కనపడినట్లు తెలిసింది.
వినోద్, దాసోజు శ్రవణ్, గంగుల కమలాకర్ లాంటి నాయకులు బిజెపి-కాంగ్రెస్ ఒకటేనంటూ జతకట్టే ప్రయత్నం చేస్తూ.. ముగ్గురూ నీతి గురించి మాట్లాడుతుంటే గురివింద గింజ సామెతలా ఉంది.
ఇంకో బీఆర్ఎస్ నేత... తనకు ప్రజలు ఓటేయకుంటే చనిపోతానన్న వ్యక్తి కూడా ఇప్పుడు బిజెపి విమర్శలు చేస్తున్నాడు.
బీఆర్ఎస్ చేసిన అవినీతి పనులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఉద్యమం పేరుతో అమరవీరులపై రాజకీయం చేసి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, మోసపు హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది.
దాదాపు రూ.10 లక్షల కోట్ల వరకు అప్పులు తెలంగాణ ప్రజల మీద నెత్తిన మోపింది. ప్రజలు చీకొట్టినా బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి రావడం లేదు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పాపాలన్నీ బీఆర్ఎస్‌ని వెంటాడతాయి.
బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన లక్షలకోట్ల రూపాయల ప్రజాసొమ్మును దోచుకుని, దాచుకున్నారు.
బీఆర్ఎస్ నాయకుల మాటలు .. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయి.
కాళేశ్వరం ప్రాజెక్టు అనేది పూర్తిగా అవినీతిలో కూరుకుపోయింది.
గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఉన్నపుడు కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని, తాము అధికారంలోకి వస్తే అవినీతి సొమ్మును కక్కిస్తామని చెప్పారు.
కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి గతంలో అనేకసార్లు "కాళేశ్వరం అవినీతిని బట్టబయలు చేస్తాం", సీబీఐతో విచారణ జరిపించాలని మాట్లాడారు.
కానీ ఇప్పుడు తెలంగాణలో అధికారంలోకి వచ్చాక ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు?
రాహుల్ గాంధీకి, రేవంత్ రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసుపై సీబీఐ విచారణకు కోరాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది.

# రాజధాని అమరావతిలో మరో 44వేల ఎకరాల సేకరణ

**(మొదటి పేజీ తరువాయి..)**
కొలుసు పార్థసారథి.. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.. ఈ ఏడాదిలో 25 కేబినెట్ సమావేశాలు జరిగాయి.. కొన్ని వందల నిర్ణయాలు ఇప్పటి వరకు తీసుకున్నాం.. ఏపీ సీఆర్డీఏ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ ప్రకారం మరో విడత భూ సమీకరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్.. విద్యా సంస్థలు.. ఆస్పత్రులు అందించే విధంగా భవిష్యత్ అవసరాల కోసం.. ల్యాండ్ పూలింగ్ జరుగుతుందన్నారు.. 2015లో కూడా 35 వేల ఎకరాల ల్యాండ్ పూలింగ్ జరిగింది.. అసైన్‌మెంట్, భూముల విషయంలో స్థానిక అధికారులతో విచారణ తర్వాత భూ సమీకరణ జరుగుతుందన్నారు. అన్ని నియమ నిబంధనలు ప్రకారం.. ఆధార్, పాస్‌పోర్ట్ వివరాల ఆధారంగా ల్యాండ్ పూలింగ్ జరుగుతుంది.. రైతులకు సంబంధించి ల్యాండ్ పూలింగ్ కు ఇచ్చే వారికి మెరుగైన ప్యాకేజ్ అందిస్తున్నాం అన్నారు.. అమరావతిలో జీఏడీ టవర్.. హెచ్‌వోడీ టవర్.. ఎన్సీసీ షాపూర్‌జీ పల్లంజీకి, ఎల్ అండ్ టీకి టెండర్ ఆర్డర్ ఇవ్వడానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు..ఇక, మున్సిపల్ శాఖలో 40 టౌన్ ప్లానర్ పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. భవన నిర్మాణంలో ఉన్న సమస్యలకు పరిష్కారం కోసం మున్సిపల్ నిబంధనల సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. టెన్నిస్ క్రీడాకారుడు మైనేని సాకేత్ కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గండికోట ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకునేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. కరోన వల్ల నిర్మాణ సంస్థల పనులు నిలిచి పోయాయి.. కరోన వల్ల వ్యాపారం దెబ్బ తిన్న కాంట్రాక్టర్లకు పనులకు సంబంధించిన టెండర్లలో ప్రాధాన్యత ఇచ్చేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు.. పోలవరం ప్రాజెక్ట్ 2027లో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులను సూచించారని తెలిపారు. . ఇక, బనకచర్ల ప్రాజెక్ట్ కు సంబంధించి చర్చ జరిగింది. రెండు రాష్ట్రాలకు నష్టం జరగకుండా వృథాగా పోయే నీటిని రెండు రాష్ట్రాల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని సీఎం ఆలోచన. ఎవరికి నష్టం చెయ్యాలని. హక్కులు తీసుకోవాలని ఆలోచన లేదని స్పష్టం చేశారు.. అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు సీఎం సూచన చేశారు.. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాంతంలో సాంస్కృతిక శాఖకు బాధ్యతలు అప్పగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అమరావతిలో స్టార్ హోటల్ నిర్మాణానికి ఎస్ఐపీబీ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు.. రెవెన్యూ సమస్యలను ఏడాదిలోపు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. అన్నక్యాంటీన్లను ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని నిర్దేశిరచారు. అన్న క్యాంటీన్లను మానిటర్ చేయడానికి, ఎవరైనా విరాళాలు ఇస్తే తీసుకోవడానికి ఒక కమిటీని వేయాలని చంద్రబాబు సూచించారు. అనకాపల్లిలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసే విధంగా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. జాతీయ స్థాయిలో కొన్ని పంటలకు డిమాండ్ లేకపోవడంతో మనం మార్కెట్‌లోనే కొంటున్నామని స్పష్టం చేశారు. పొగాకుకు మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటంతో రూ. 250 కోట్లు కేటాయించామని అన్నారు. పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు సీఎం చంద్రబాబు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకు, మామిడి, కోకో పంటల రైతులను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉందనే కారణంతో పొగాకుకు మార్కెట్‌లో డిమాండ్ తక్కువ ఉన్నా మనం చొరవ తీసుకుని రైతులను ఆదుకుంటున్నామని అన్నారు. చేసిన మంచిని చెప్పుకోవటంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని వివరిస్తూనే ప్రత్యామ్నాయ పంటల వైపు రైతును ప్రోత్సహించాలని సూచించారు. డిమాండ్‌కు తగ్గట్లుగా వాణిజ్య పంటలు వేసేలా రైతులను చైతన్య పరచాలని అన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకును ఇంత పెద్దమొత్తంలో కొనుగోలు చేయటం దేశ చరిత్రలో ఇదే ప్రథమమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. వాణిజ్య పంటలని కొనుగోలు చేసింది కూడా ఏపీనేనని గుర్తుచేశారు. ప్రజలకు ఈ విషయం మాత్రం ఎందుకు చెప్పుకోలేక పోతున్నామని నేతలను అడిగారు. అమరావతిలో వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వ పరంగా కన్వెన్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో 6497 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తామని అన్నారు. టెంపుల్ టూరిజంతో పాటు ఏపీలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మచిలీపట్నం బీచ్ ఫెస్టివల్ సక్సెస్‌పై నేతలను సీఎం చంద్రబాబు ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తూ రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ముఖ్యమంత్రి చంద్రబాబు. సీఆర్డీఏ పరిధిలో కొత్తగా తీసుకునే భూముల్లో ప్రభుత్వానికి సంబంధించి... 2019కు ముందు ఆరేళ్ల అనుభవ దారు ఎవరు ఉంటారో వారికే నష్టపరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వాళు రాజధానిలో లా యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి సంబంధిత భూమి వాళ్లకు లీజ్‌కు ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. బిల్డింగ్ రూల్స్‌ను మరింత సరళతరం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గుజరాత్‌లో మాదిరిగా బిల్డింగ్ రూల్స్‌ను సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకి వెంటనే ఎ÷-లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

## బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు

సచివాలయంలో రాష్ట్రమంత్రివర్గ సమావేశం ముగిసింది. మొత్తం 42 అజెండా అంశాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టినా అభ్యంతరం చెప్పలేదు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలంతా మాట్లాడాలి. కేవలం రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉంది.' అని అన్నారు. అమరావతిలో మలివిడత భూసేకరణపై మంత్రివర్గంలో చర్చ జరిగింది. తొలివిడత నిబంధనలే మలివిడతకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాలను ఇన్‌ఛార్జి మంత్రి నేతృత్వంలో జిల్లాస్థాయిలో నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఆ తర్వాత నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ఆమోదం తెలిపారు. ఏడాదిలోగా రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరించాలని సీఎం తేల్చి చెప్పారు. సాంకేతిక సమస్యల సాకుతో దాటవేత ధోరణి సరికాదని, ఇబ్బందులుంటే తనతో మాట్లాడవచ్చన్నారు. రెవెన్యూ సమస్యలపై తరచూ అడుగుతూనే ఉంటానని గట్టిగా చెప్పారు. కూటమి ఏడాది విజయాలు ఇంటింటికీ తీసుకెళ్లే కార్యాచరణ రూపొందించామన్న సీఎం.. జులై 1 నుంచి ఎమ్మెల్యేలు ఆ బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై



సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశిరచారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

గుర్తుచేశారు. ఇంకా చాలా ప్రాజెక్ట్‌లను వాళ్లు కడుతున్నారని తెలిపారు. తెలంగాణ వాడుకోగా మిగిలిన నీళ్లను మాత్రమే కదా ఏపీ వాడుకునేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తెలంగాణ నేతలు బనకచర్లపై రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వరద జలాలను మనం వాడుకుంటామని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యే రీతిలో కూటమి నేతలు చెప్పాలని ఆదేశించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్ట్‌పై మనం దశల వారిగా ముందుకు వెళ్తామని సూచించారు. ఆ తర్వాత కేంద్రప్రభుత్వం ఏం చెబుతుందో దాని ఆధారంగా మనం నిర్ణయం తీసుకుందామని వివరించారు. ఈ ప్రాజెక్ట్‌లు ఎప్పుడూ శంకుస్థాపన చేస్తామనేది త్వరగా నిర్ణయించాలని మంత్రి లోకేష్ అన్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌కి అవసరమైతే కేంద్ర ప్రభుత్వ జోక్యం కూడా అవసరమని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ విషయం అర్థమయ్యేలా చెప్పేందుకు అవసరమైతే కేంద్రం ద్వారా ఓ సమావేశం ఏర్పాటు చేద్దామని చెప్పారు. సున్నితమైన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్‌పై నేతలు పూర్తి అవగాహనతో జాగ్రత్తగా మాట్లాడాలని దిశానిర్దేశరచేశారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని సీఎం చంద్రబాబు మంత్రులు, నేతలకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema

# ధనుష్ ..మీరెంత మంచి వారో

## ప్రశంసలతో పోస్ట్ చేసిన రష్మిక

కోలీవుడ్ స్టార్ ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రలో, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందించిన తాజా చిత్రం 'కుబేర' సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్‌ని సొంతం చేసుకున్న కుబేర.. మంచి వసూళ్లతో సత్తా చాటుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అదిరిపోయే కలెక్షన్లు రాబడుతోంది. ఈ మూవీ ద్వారా నాగ్ లో కొత్తకోణం కనిపించింది. ఇక ధనుష్ యాక్టింగ్ కి తెలుగు ప్రేక్షకులు అయితే ఫిదా అయ్యారు. ఇందులో సమీరా పాత్రలో నటించిన రష్మిక కూడా ప్రేక్షకులను మెప్పించింది. అయితే తాజాగా తన కోస్టార్ ధనుష్ గురించి ఒక ఎమోషనల్ పోస్ట్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది రష్మిక. 'మీతో అంత పెద్ద సినిమా చేసినప్పటికీ మనిద్దరిది ఒక్క సెల్ఫీ మాత్రమే ఉంది. మీరు అద్భుతమైన వ్యక్తి, మనం మట్లాడుకున్న ప్రతిసారీ వేర్వేరు నగరాల్లో ఉన్నాం. ఇద్దరం వేర్వేరు పనులు చేసుకుంటూ మాట్లాడుకునేవాళ్లం. విశ్రాంతి ఎంత ముఖ్యమో చర్చించేవాళ్లం. కానీ, విశ్రాంతి మాత్రం తీసుకోలేదు. కుబేర నటనపరంగానే కాదు.. నిజ జీవితంలోనూ మీరు చేసే పనులు ఎంతోమందికి ఆదర్శం. చుట్టూ ఉన్న వారితో ఎంతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటారు.



ముఖ్యంగా మీరు సెట్‌ల్లో నాకోసం తెచ్చిన లడ్డులను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. నాకు తమిళ డైలాగుల్లో మీరు చేసిన సహాయం.. నేను ఏదైనా డైలాగ్ చెప్పినప్పుడు మీరు ప్రశంసించిన తీరు. ఇవన్నీ చిన్న చిన్న విషయాలు కావచ్చు. కానీ, జీవితమంతా గుర్తుంటాయి' అంటూ ధనుష్ దిగిన సెల్ఫీ ని షేర్ చేశారు రష్మిక. తాజాగా రష్మిక మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విజయ్ లవ్‌లో త్రిష ... అంటూ పుకార్లు

ఓ స్టార్ హీరోతో హీరోయిన్ త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ కోలీవుడ్‌లో వార్తలొచ్చాయి. సదరు హీరోతో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో త్రిష పంచుకుంటూ బర్త్‌డే విషెస్ తెలియజేయడం, అదే ఫొటోను ఆమె తల్లి షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీ జోడించడం అందుకు కారణం. ఆ రూమర్స్‌పై త్రిష పరోక్షంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రేమపై పోస్టు పెట్టారు. పూర్తిగా ప్రేమలో మునిగిపోతే, అది కొందరిని తికమక చేస్తుందని పేర్కొన్నారు. తాజాగా కోలీవుడ్ హీరోయిన్ త్రిష చేసిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో రచ్చకు కారణమైంది. జూన్ 22న విజయ్ బర్త్ డే సందర్భంగా హ్యాపీ బర్త్ డే బెస్టెస్ట్ అని హగ్ సింబల్ జత చేసి విజయ్ తో పక్క పక్కనే కూర్చున్న పిక్ షేర్ చేసింది త్రిష. అంతేనా ఈ ఫోటోకు త్రిష తల్లి సైతం లవ్ సింబల్స్ జోడించి ఇన్ స్టా స్టోరీ పెట్టింది. దాంతో త్రిష, విజయ్ మధ్య లవ్ అఫైర్ ఉందని నెటిజన్స్ వీరిని లవర్స్ గా కన్ఫామ్ చేసారు. ఈ ఇద్దరూ డేటింగ్ చేస్తున్నారని చాలా కాలం వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ ఇద్దరు ఎప్పుడు వాటిని ఖండించలేదు. విజయ్ అండ్ త్రిష లవ్ బర్డ్స్ అంటూ ఇప్పటి నుండే కాదు.. ఎప్పటి నుండో గాసిప్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఇద్దరూ కలిసి జర్నీ చేయడం, కీర్తి సురేష్ పెళ్లికి గోవా వెళ్లడం కూడా వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని కన్ఫర్మ్ చేస్తున్నారు నెటిజన్లు. రీసెంట్లీ గుడ్ పీపుల్, గుడ్ టైమ్స్ అంటూ ఓ పోస్ట్ పెట్టింది త్రిష. బర్త్ డే రోజు విజయ్ కుక్క పిల్లని ఎత్తుకున్న ఫోటో షేర్ చేసింది. కుక్క పిల్లను ఈ ఏడాదే ఫిబ్రవరిలో త్రిష దత్తత తీసుకుంది. అంటే ఆ ఫోటో రీసెంట్ గా తీసుకుంది. ఇద్దరు కలిసి త్రిష ఇంట్లో పార్టీ చేసుకున్నారన్న టాక్ నడుస్తోంది. త్రిష, విజయ్ 2004లో గిల్లీ సినిమాలో తొలిసారి జతకట్టారు. 2006లో ఆదితో పాటు రీసెంట్లీ లియోలోను కలిసి నటించారు. తన 25 సంవత్సరాల కెరీర్లో ఇప్పటి వరకు స్పెషల్ సాంగ్ చేయని త్రిష గోట్‌లో విజయ్ కోసం నర్తించింది. దీంతో ఈ ఇద్దరి మధ్య సమ్‌థింగ్ సమ్‌థింగ్ అనే చర్చకు బలం చేకూరింది.



# హిందీలో మజ్దూర్‌గా వస్తున్న రజనీకాంత్




తలైవా రజనీకాంత్ ప్రస్తుతం లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా ఇది. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించను న్నారు. అగ్ర నటులు నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహీర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి వరుస ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు మేకర్స్. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించి తాజాగా హిందీలో టైటిల్‌ను మార్చారు మేకర్స్. హిందీలో ఈ సినిమాను 'మజ్దూర్' అనే పేరుతో తీసుకురాబోతున్నట్లు సమాచారం. మజ్దూర్ అంటే హిందీలో కార్మికుడు అని అర్థం. అయితే కూలీ అనే టైటిల్ బాగానే ఉన్నప్పటికి పేరు మార్చడంపై చాలా మంది నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు గతంలో వచ్చిన అమితాబ్ బచ్చన్ కూలీ (1983), గోవిందా కూలీ నెం. 1 (1995), వరుణ్ ధావన్ కూలీ నెం. 1 (2020) వంటి చిత్రాల కాపీరైట్ సమస్యల వల్లే ఈ పేరు మార్పు జరిగిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

# నవీన్ చంద్ర షో టైమ్ ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యువ నటుడు నవీన్ చంద్ర, పొలిమేర ఫేం కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'షో టైమ్'. ఈ సినిమాకు మదన్ దక్షిణామూర్తి దర్శకత్వం వహిస్తుండగా.. నరేష్, రాజా రవీంద్ర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అనుకోకుండా మర్డర్ చేసిన నవీన్ చంద్ర కామాక్షి దంపతులు.. ఆ సమస్య నుంచి ఎలా బయటపడ్డారు అనే కథతో ఈ సినిమా రాబోతుంది.





# అనుపమ మూవీకి సెన్సార్ కష్టాలు




మలయాళ నటులు అనుపమ పరమేశ్వరన్, కేంద్రమంత్రి సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను కాస్మోస్ ఎంటర్‌టైనమెంట్స్ నిర్మిస్తుండగా.. శృతి రామచంద్రన్, మాధవ్ సురేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూన్ 27 ఈ సినిమా విడుదల కావాల్సి ఉండగా.. సెన్సార్ అభ్యంతరం వలన సినిమా వాయిదా పడినట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో బాధితురాలి పాత్రకు జానకి అని దైవ సంబంధమైన పేరుని పెట్టడంపై ముంబై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో జానకి అనే పేరుతో ఓ మహిళ అత్యాచార బాధితురాలిగా న్యాయపోరాటం చేస్తుందని, అయితే 'జానకి' అనేది సీతాదేవికి మరో పేరు కావడంతో, అలాంటి పేరును అత్యాచార బాధితురాలికి పెట్టకూడదని సెన్సార్ బోర్డు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై దర్శకుడు ప్రవీణ్ నారాయణన్ తన ఫేస్‌బుక్ పోస్ట్‌లో స్పందిస్తూ, జూన్ 27న విడుదల కావాల్సిన సినిమా వాయిదా పడిందని ధృవీకరించారు. ఈ నిర్ణయంపై మలయాళ సినీ పరిశ్రమలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఫిల్మ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ జనరల్ సెక్రటరీ బి. ఉన్నికృష్ణన్ సెన్సార్ బోర్డు నిర్ణయాన్ని విమర్శించారు. దేవుళ్ల పేర్లు కలిగిన పాత్రలకు ఇటువంటి నిబంధనలు పెట్టడం విడ్డూరంగా ఉందని, ఇది కళాత్మక స్వేచ్ఛను అడ్డుకుంటుందని ఆయన అన్నారు. ఇలాంటి నిబంధనలు ఉంటే, హిందూ మతానికి చెందిన పాత్రలకు పేర్లు ఎంపిక చేసుకోవడం చాలా కష్టమవుతుందని ఆయన ప్రశ్నించారు. తిరువనంతపురంలోని ప్రాంతీయ సెన్సార్ కార్యాలయం ఈ చిత్రానికి జ/ం సర్టిఫికేట్ జారీ చేసినప్పటికీ, ముంబైలోని ప్రధాన కార్యాలయం ఈ టైటిల్‌ను మార్చాలని డిమాండ్ చేయడంతో ఈ సమస్య తలెత్తింది. పేరు మార్చాల్సి వస్తే, సినిమాలోని అనేక సంభాషణలను కూడా మార్చాల్సి వస్తుందని మేకర్స్ ఆందోళన చెందుతున్నారు.

# మీనాకుమారి బయోపిక్‌లో కియారా అద్వానీ

బాలీవుడ్‌లో మళ్లీ బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మరో బయెపిక్ తెరమీదకి రాబోతుంది. దివంగత నటి, 'ట్రాజెడీ క్వీన్' గా ప్రసిద్ధి చెందిన మీనా కుమారి జీవితం ఆధారంగా ఒక బయోపిక్ రాబోతున్నట్లు తెలుస్తుండగా.. ఈ చిత్రంలో కియారా అద్వాణీ మీనాకుమారి పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. అలనాటి 'ట్రాజెడీ క్వీన్' మీనా కుమారి గురించి సినీ ప్రియులకు ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. 'బైజుబాౖన్రా', 'పాకీజా' వంటి క్లాసిక్ చిత్రాలతో భారతీయ సినిమా చరిత్రలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు మీనా కుమారి. ఆమె జీవితంలో దాగి ఉన్న భావోద్వేగాలు, బాధలు, కీర్తి, ప్రేమ.. ఇలా అన్నీ వెండితెరపై మరోసారి ప్రతిభావంతంగా ఆవిష్కరిం చేందుకు బాలీవుడ్ సిద్ధమవుతోంది. ఈ భారీ బయోపిక్‌కు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా స్వయంగా నిర్మించి, దర్శకత్వం వహించబోతున్నట్లు సమాచారం. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మనీష్, ఇప్పుడు సినిమా దర్శకత్వంలో అరంగేట్రం చేయనుండగా, ఆయన తొలి చిత్రమే 'మీనా కుమారి' బయోపిక్ కావడం విశేషం. తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌లో కియారా అద్వాణీనే కథానాయికగా ఎంపికైనట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. మీనా కుమారి పాత్రలో నటించేందుకు పలువురు హీరోయిన్‌లు ఆసక్తి చూపినప్పటికీ, ఆ పాత్రకు అవసరమైన భావోద్వేగం, విలువ, గంభీరత కియారా నుంచే రావచ్చని చిత్ర బృందం బలంగా నమ్ముతోందట. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశలో ఉన్నాయని, దీనిపై అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుందని కియారా సన్నిహిత వర్గాలు వెల్లడించాయి.





## లడ్డూ కష్టాలకు ఫుల్ స్టాప్...



**తిరుమల, జూన్( వెలుతురు):**

తిరుమల శ్రీవారి భక్తులకు టీటీడీ గుడ్ న్యూస్ చెప్పింది. భక్తులకు లడ్డూ కష్టాలు తొలగించేందుకు కియోస్క్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దర్శన టికెట్ లేదా ఆధార్ నెంబర్ ను కియోస్క్ మిషన్ లో ఎంటర్ చేసి అక్కడ కనిపించే క్యూఆర్ కోడ్ పై పేమెంట్ చేస్తే రసీదు వస్తుంది. అది తీసుకెళ్లి కౌంటర్ లో అందిస్తే లడ్డూలు పంపిణీ చేస్తారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుని భక్తుల సేవలు మరింత సులభతరం చేసే విధంగా టీటీడీ వినూత్న ఏర్పాట్లు చేసింది. తిరుమలలో లడ్డూ కౌంటర్ల వద్ద కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసింది. సాధారణంగా లడ్డూ ప్రసాదం కావాలంటే నేరుగా కౌంటర్ వద్దకు వెళ్లి ఆధార్ కార్డ్ లేదా దర్శన టికెట్లు చూపించి భక్తులు లడ్డూలు తీసుకునే వారు. అయితే, టీటీడీ నూతన విధానం తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా 5 కియోస్క్ మెషీన్లను లడ్డూ కౌంటర్ల దగ్గర ఏర్పాటు చేసింది. ఈ మెషిన్ లో భక్తులు తమ దర్శన టికెట్ టోకెన్ నెంబర్ లేదా ఆధార్ నెంబర్ ఎంటర్ చేయాలి. ఆ తర్వాత వారికి క్యూఆర్ కోడ్ వస్తుంది. దాన్ని ఫోన్ లో స్కాన్ చేయడం ద్వారా పేమెంట్ చేయాలి. ఆ తర్వాత ఒక స్లిప్ వస్తుంది. దాన్ని కౌంటర్ లో చూపిస్తే లడ్డూలు ఇస్తారు. దర్శన టికెట్ లేని భక్తులు సైతం లడ్డూలను పొందొచ్చు. అలాంటి భక్తులు తమ ఆధార్ నెంబర్ ను కియోస్క్ మెషిన్ లో నమోదు చేసి రెండు లడ్డూలను పొందొచ్చు. ఈ కొత్త సిస్టమ్ ని టీటీడీ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ఈ విధానం అన్నప్రసాదంలో ఉంది. డోనర్లు 99వేల రూపాయల వరకు నేరుగా డొనేషన్ చేసుకునే విధంగా ఇలాంటి కియోస్క్ మిషన్లు పెట్టింది.తాజాగా తిరుమల లడ్డూ కౌంటర్లలో కూడా కియోస్క్ మిషన్లను టీటీడీ ఏర్పాటు చేసింది. భక్తులు మరింత సులభతరంగా లడ్డూలు పొందే అవకాశం ఉందని టీటీడీ అంటోంది. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రస్తుతం 5 కియోస్క్ మిషన్లు ఏర్పాటు చేశారు. భక్తులు వీటి ద్వారా లడ్డూలు పొందుతున్నారు. కొన్ని రోజుల పాటు దీన్ని పరిశీలన చేసి ఇందులో ఏవైనా లోటుపాట్లు ఉంటే సరి చేసే విధంగా టీటీడీ దృష్టి పెట్టింది. అన్నప్రసాదం కేంద్రంలో డొనేషన్లు సమర్పించడానికి, లడ్డూలు పొందడానికి కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసిన టీటీడీ త్వరలో గదులు పొందడానికి కూడా కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## వైసీపీకి కలిసి రాని కాలం



**గుంటూరు, జూన్( వెలుతురు):**

వైసీపీలో నేతలు ఎందుకు భయపడుతున్నారు? పల్నాడు టూర్ వ్యవహారం అధినేతతోపాటు కేడర్‌కు చిక్కులు తెచ్చిపెట్టిందా? ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు కీలక నేతలు ముఖం చాటేస్తున్నారా? పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని కేడర్ ఆలోచన చేస్తోందా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అధినేత అనేవారు జాగ్రత్తగా అడుగులు వేయాలి. ఆవేశంతో నిర్ణయాలు తీసుకుంటే నేతలేకాదు.. చివరకు కేడర్ సైతం దూరం అవుతుంది. వైసీపీకి ఇప్పుడు అలాంటి పరిస్థితి ఎదురైంది. పల్నాడు టూర్ వ్యవహారంలో కీలక నేతలపై గుంటూరు జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ టూర్‌లో జగన్ ప్రయాణిస్తున్న వాహనం కిందపడి ఓ వ్యక్తి చనిపోవడంతో కలకలం రేపింది. దీనికి సంబంధించి సాక్ష్యాలు బయటపెట్టి కేసు నమోదు చేశారు పోలీసులు. ఏ1 రమణారెడ్డి కాగా, ఏ2గా జగన్ పేరు ప్రస్తావించారు. హత్య కిందకు రాని కల్పబుల్ హోమీ సైడ్ సెక్షన్ కింద కేసు రిజిస్టర్ అయ్యింది. అంటే ఒక వ్యక్తికి చావుకు కారణమైనప్పుడు ఆ తరహా సెక్షన్ ఉపయోగిస్తారు. ప్రస్తుతం పల్నాడు పోలీసులు అదే చేశారు. ఈ కేసు నమోదు చేయడానికి ముందు ఆ సెక్షన్‌పై కూలంకుషంగా చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకున్నారు. నిర్లక్ష్యంతో చావుకు కారణమని భావించి బీఎన్ఎస్ 106(1)) సెక్షన్ కింద కేసు నమోదు చేశారు పోలీసులు. దర్యాప్తులో దొరికిన ఫుటేజీలు ఆధారంగా కల్పబుల్ హోమీసైడేనని నిర్ధారణకు వచ్చారు అధికారులు. చివరకు ఈ సెక్షన్ జత చేశారు.జగన్ సహా మిగతా నిందితులపై ఈ సెక్షన్ పెట్టారు పోలీసుల. నేరం నిరూపణ అయితే ఈ సెక్షన్ కింద జీవిత ఖైదు విధించే అవకాశముందని కొందరు అడ్వకేట్లు చెబుతున్నమాట. నేర తీవ్రతను బట్టి జైలు శిక్ష, జరిమానా రెండూ విధించేందుకు అవకాశముందని అంటున్నారు. ఈ సెక్షన్ పూర్తిగా నాన్ బెయిల్‌బుల్ సెక్షన్ అని అంటున్నారు. నేరానికి ప్రేరేపించారనే అభియోగంపై బీఎన్ఎస్ 49 సెక్షన్‌ను ఈ కేసులో చేర్చినట్టు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఫుటేజ్ ఉండడంతో అధినేత జగన్‌కు కష్టాలు తప్పవని అంటున్నారు నేతలు, కేడర్. కేసు వేగంగా దర్యాప్తు న్యాయస్థానం ముందుకు వస్తే జగన్‌కు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. మరోవైపు సాక్షి టీవీ డిబేట్‌లో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు అమరావతి మహిళలు. ఆయనకు మద్దతుగా మాట్లాడిన వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. 'సాక్షి ఛానల్‌పై కడుపు మంటతో నిరసన వ్యక్తం చేస్తున్నారని చెబుతూనే మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతేకాదు అమరావతి మహిళలను పిశాచులు, రాక్షసులు, రెండు కలిసిన సంకరజాతికి చెందినవారుగా వర్ణించారు. ఆ తెగకు చెందినవారిగా కనిపిస్తున్నారని, అలాంటి వారు మాత్రమే చేస్తారని' వ్యాఖ్యానించారు. తమ ఆత్మాభిమానం దెబ్బతినేలా సజ్జల వ్యాఖ్యలు చేశారని భావించింది మాదిగ కార్పొరేషన్. ఆ సంస్థ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలను హేళన చేయడంతోపాటు వారి పుట్టుకను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని ఆమె తన ఫిర్యాదులో ప్రస్తావించారు. ఒకేరోజు అధినేత, కీలక నేతపై కేసులు నమోదు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతోంది కేడర్.

## పహల్గామ్ దాడిపై కొనసాగుతున్న ఎన్ఐఏ దర్యాప్తు

- **ఉగ్రవాదుల ప్రవేశంపై కూపీ లాగుతున్న పోలీసులు**

**న్యూఢిల్లీ,జూన్( వెలుతురు):**




పహల్గామ్ ఉగ్ర దాడిపై కేంద్ర సంస్థ ఎన్ఐఏ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే కీలక ఆధారాలను సేకరించింది. తాజాగా ఉగ్రవాదులు భారత్‌లోకి ఎలా ప్రవేశించారన్న దానిపై దర్యాప్తు చేపట్టగా అధికారులకు కీలక సమాచారం లభించింది. బాట్కోట్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, హిల్ పార్క్‌కు చెందిన బషీర్ అహ్మద్ జోథర్‌లను అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరు ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించినట్లుగా ఒప్పుకున్నారు. ఇక పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత.. ముగ్గురు ఉగ్రవాదులకు హిల్ పార్క్‌లోని ఒక గుడిసెలో ఉన్నట్లుగా తేలింది. ఈ ఉగ్రవాదులకు స్థానికులైన పర్వైజ్, బషీర్ ఆహారం, ఇతర వసతులు కల్పించినట్లుగా తేలింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ చేరవేసినట్లుగా గుర్తించారు. ఇక ముగ్గురు ఉగ్రవాదులు.. పాకిస్థాన్‌లోని అబోటాబాద్ నుంచి ముజఫరాబాద్ మీదుగా పూంజ్–రాజౌరికి చేరుకున్నట్లు అధికారులు గుర్తించారు. సరిహద్దు కారిడార్ ద్వారా భారత్‌లోకి ప్రవేశించి ఉంటారని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక నిఘా వర్గాల దర్యాప్తు మేరకు.. ముగ్గురు ఉగ్రవాదులు కూడా అధిక శిక్షణ పొందినవారుగా కనిపెట్టారు. శిక్షణలో అధునాతన పోరాట పటిమలు కలిగిన వారిగా తేల్చారు. అంతేకాకుండా రహస్య కదలికలు, మనుగడ వ్యూహాలు కలిగి ఉన్నట్లుగా తేలింది. పహల్గామ్‌కు ముందు జమ్మూకాశ్మీర్‌లోని స్పిన్నర్ ప్రాంతంలో జరిగిన దాడులతో పాటు పలు దాడుల్లో ఈ ముగ్గురు ఉగ్రవాదులు పాల్గొని ఉండొచ్చని భావిస్తున్నారు. ఇక ఉగ్రవాదుల కదలికలు గురించి డిజిటల్ పాదముద్రలు, కమ్యూనికేషన్ మార్గాలను దర్యాప్తు సంస్థ విశ్లేషిస్తోంది. ప్రత్యేక కమ్యూనికేషన్ ఉపయోగించడం వల్ల ట్రాకింగ్ కష్టతరంగా మారింది. ప్రధానంగా స్థానికుల మద్దతుతోనే ఉగ్రవాదులు ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా గుర్తించారు. ప్రస్తుతం స్థానికులు ఇచ్చిన సమాచారంతో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాదులు చెలరేగిపోయారు. 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. స్త్రీలను, పిల్లలను వదిలిపెట్టి భర్తలను చంపేశారు. పదుల కొద్ది గాయపడ్డారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం.. పాకిస్థాన్‌పై కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇక మే 7న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తానికి పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడంతో భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది.

## అక్రమాస్తుల కేసులో శ్రీధర్ విచారణ

- **భారీగా ఆస్తులు గుర్తించిన ఏసిబి అధికారులు**

**హైదరాబాద్, జూన్( వెలుతురు):**




అక్రమాస్తుల కేసులో ఐదో రోజు మంగళవారం నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ ను కస్టడీలోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారించారు. మంగళవారంతో ఆయన కస్టడీ ముగియనుంది. కోర్టు అనుమతితో మరోసారి శ్రీధర్‌ను కస్టడీకి తీసుకునే ఆలోచనలో ఏసీబీ అధికారులు అన్నారు. ఇంత వరకు జరిగిన విచారణలో శ్రీధర్ అక్రమంగా సంపాదించిన డబ్బును రియల్ ఎస్టేట్‌లో పెట్టినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించారు. శ్రీధర్ బ్యాంకు లాకర్లలో భారీగా ఆస్తి పత్రాలు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లలో స్వాధీనం చేసుకున్న ఆస్తులు విలువ సుమారు రూ. 5 కోట్లు పైనే ఉంటుందని అంచనా వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 6, 7, 8 పనులు పర్యవేక్షించిన నీటిపారుదల శాఖ ఈఈ నూనె శ్రీధర్ అక్రమాస్తుల చిట్టా అంతకంతకు పెరుగుతోంది. ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అతన్ని అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే రూ. వందల కోట్ల విలువైన ఆస్తుల్ని గుర్తించిన అధికారులు.. కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారిస్తున్న క్రమంలో మరికొన్ని ఆస్తుల్ని కనుగొన్నారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న శ్రీధర్‌ను కోర్టు అనుమతితో ఏసీబీ అధికారులు ఐదు రోజుల కస్టడీకి తీసుకున్నారు. సోమవారం అతని బ్యాంకు లాకర్లను తెరిచారు. వాటిలో దొరికిన స్థిరాస్తుల పత్రాలు, బంగారం విలువ రూ.5 కోట్లపైనే ఉంటుందని అంచనా వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి సంబంధించి అరెస్టయిన మిగతా వారు కూడా అక్రమంగా సంపాదించిన సొమ్మును రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులుగా పెట్టినట్లు ఏసీబీ అధికారులు ఆధారాలు సేకరించారు. శ్రీధర్ కస్టడీ గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ క్రమంలో కోర్టు అనుమతితో అతన్ని మరోసారి కస్టడీకి తీసుకుని ప్రశ్నించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అక్రమంగా ఆస్తులు కూడబెట్టారంటూ కాళేశ్వరం ప్రాజెక్టు ఈఈగా పనిచేసిన శ్రీధర్‌పై ఏసీబీ అధికారులు ఈ నెల 11న కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అధికారుల సోదాల్లో పెద్ద ఎత్తున ఆస్తులు గుర్తించారు. వాటి విలువ మార్కెట్ లెక్కల ప్రకారం రూ. 150 కోట్ల మేర ఉంటుందని అంచనా. శ్రీధర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించిన అధికారులు తదుపరి దర్యాప్తులో భాగంగా న్యాయస్థానం అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని ఈనెల 20వ తేదీ నుంచి విచారిస్తున్నారు. దీనిలో భాగంగా ఎస్‌బీఐలో శ్రీధర్ పేరు మీద ఉన్న లాకర్‌ను ఆయన సమక్షంలోనే అధికారులు తెరిచారు. ఇందులో పెద్దఎత్తున ఆస్తిపత్రాలు, బంగారు ఆభరణాలు గుర్తించారు. వాటికి పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో చివరి రోజైన మంగళవారం మరికొన్ని లాకర్లు కూడా తెరిచే అవకాశం ఉంది.

## మూలపాడు వద్ద అమరావతి గేట్ వే

**విజయవాడ, జూన్( వెలుతురు):**




ఇప్పటి వరకు ఎన్నో గేట్ వేలు చూసి ఉంటారు. కానీ ఇక్కడ నిర్మిస్తున్న గేట్ వే గురించి తెలుసుకుంటే, ఔరా అనేస్తారు. అందుకు వేదికగా మారింది ఏపీ రాజధాని అమరావతి. ఇప్పటికే ఎన్నో రికార్డులను దక్కించుకున్న అమరావతి అమ్ముల పొదిలో మరో రికార్డు చేరువ కానుంది. ఇంతకు ఆ రికార్డు ఏమిటి? అసలు గేట్ వే వింతలు విశేషాలు ఏమిటో తెలుసుకుందాం. అమరావతి ఇది కేవలం ఒక పేరు కాదు. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల రాజధాని. కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న మౌన చలనాలకి ఇప్పుడు కొత్త ఊపొస్తుందనిపిస్తోంది. మళ్లీ ఓ దిశగా అమరావతి వైపు అధికారులు, ఇంజినీర్లు కదులుతున్నట్టుంది. అయితే ఈసారి దృష్టి కేంద్రంలో ఉన్నది ఒక ప్రత్యేక ప్రాంతం. అక్కడే రాజధానికి ప్రధాన ద్వారం ఏర్పడబోతోందన్న వార్తలు అధికార వర్గాల్లో హల్‌చల్ సృష్టిస్తున్నాయి. ఈ బ్రిడ్జి ఎక్కడా.. చూసి ఉండరేమో! ఇప్పటికే విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారి వెంబడి మూలపాడు వద్ద ఒక ప్రతిష్ఠాత్మకమైన బ్రిడ్జి నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఈ బ్రిడ్జి కేవలం ఓ ట్రాన్స్‌పోర్ట్ కనెక్టివిటీ గానే కాకుండా, అమరావతి నగరానికి ఒక గుర్తింపు చిహ్నంగా మారే అవకాశం ఉన్నదని అధికారులు భావిస్తున్నారు. అందుకే, మూలపాడు ప్రాంతాన్ని అమరావతికి ప్రధాన ప్రవేశ ద్వారంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనతో భూకణాలను పరీక్షించేందుకు అక్కడ మట్టి నమూనాల పరీక్షలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ భూసామర్థ్య పరీక్షలు విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారి పై అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఇది కేవలం ఒక సాధారణ పరీక్ష ప్రక్రియ కాదు.. ఇది రాజధాని యొక్క భవిష్యత్ ప్రవేశద్వారానికి వేసే మొదటి అడుగు అని చెప్పవచ్చు. మూలపాడు ప్రాంతం రాజధానికి దగ్గరగా ఉండడమే కాకుండా, రవాణా దృష్టికోణంలోనూ అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉంది. అందువల్లే అధికార యంత్రాంగం ఈ ప్రాంతాన్ని పరిశీలిస్తూ, అక్కడే ఐకానిక్ బ్రిడ్జితో కూడిన గేట్‌వే అభివృద్ధికి పునాదులు వేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వ స్థాయిలో ఆమోదం లభిస్తే, మూలపాడు ప్రాంతం అమరావతి నగరానికి ప్రధాన ఎంట్రీ పాయింట్‌గా మారనుంది. దీంతో ఆ ప్రాంత అభివృద్ధి వేగంగా పెరిగే అవకాశముంది. ఒకవేళ మూలపాడు ద్వారా రాజధాని అభివృద్ధికి తొలి అడుగు పడితే, అక్కడి స్థానికులకు, వ్యాపారికులకు, రవాణా రంగానికి ఎంతో లాభం చేకూరుతుంది. అంతేగాకుండా, విమానాశ్రయాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఇతర రాష్ట్రాల నుండి వచ్చే ప్రముఖులకూ ఇదే ప్రధాన మార్గంగా నిలవనుంది! ఇకపోతే, మూలపాడు బ్రిడ్జి ప్రాజెక్టు ప్రత్యేకత ఏంటంటే, ఇది కేవలం వాహనాల రాకపోకలకే కాదు, నగర ముఖచిత్రాన్ని ప్రతిబింబించేలా ఒక ఐకానిక్ ఆర్కిటెక్చర్‌గానూ నిర్మించనున్నారు. శిల్పకళ, ఆధునిక నిర్మాణ శైలి కలబోతగా ఇది ఉండనుంది. ఒక నగరాన్ని గుర్తించే ప్రధాన ద్వారం ఎలానీ ఉండాలో దానికి ఇది ఒక ప్రేరణగా నిలవబోతోంది. విదేశీ మోడళ్లను పరిశీలించి, ఉత్తమ డిజైన్‌ను ఎంచుకునేందుకు అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇదొక అద్భుతం.. ఇక మొట్టమొదటగా మూలపాడును ఎంపిక చేయడానికి మరో కారణం.. ఇది విజయవాడకు అత్యంత సమీపంగా ఉంది. విజయవాడ మెట్రో రైలు, రింగ్ రోడ్ల ప్రాజెక్టులతో కలిపి అమరావతికి తీసుకెళ్లే ప్రధాన రహదారిగా దీన్ని అభివృద్ధి చేయవచ్చు. దీంతో పర్యాటక రంగం, వాణిజ్య కార్యకలాపాలు మరియు ఆస్తి విలువలు అన్నీ పెరిగే అవకాశముంది. మూలపాడు పేరే వచ్చే రోజుల్లో హాట్ లొకేషన్‌గా మారిపోవచ్చని అంటున్నారు రియల్ ఎస్టేట్ వర్గాలు కూడా. ఇప్పటికే రాజధాని నిర్మాణం విషయంలో ప్రభుత్వం సరికొత్త చర్యలు చేపడుతుండగా, వాస్తవిక దిశగా ముందడుగులు పడుతున్నాయి. అలా ముందుగా ప్రారంభించబోయే ప్రధాన అడుగు.. గేట్‌వే టు అమరావతి అనేది మూలపాడులో ఉండబోతుందన్న సంకేతాలు ఇప్పుడు అధికార వర్గాల్లో స్పష్టంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మట్టినమూనాల పరీక్షలు ఆ ప్రాంత భవిష్యత్తుకు పునాది వేస్తున్నట్లుగా భావించవచ్చు. మొత్తంగా చూస్తే, మూలపాడు ప్రాంతం ఒక సాధారణ గ్రామం నుండి రాజధానికి ముఖద్వారంగా అభివృద్ధి చెందబోతుంది. అక్కడ ప్రారంభించబోయే బ్రిడ్జి కేవలం కాంక్రీటు నిర్మాణం కాదు.. అది అక్షరాలా అమరావతికి తలుపుగా నిలవనుంది. ఇది రాజధాని నగరంలో అధికారిక అభివృద్ధి ప్రారంభమవుతోందని సంకేతమిచ్చే తొలి నిర్మాణం కావడం విశేషం. ఇక అమరావతికి మార్గం ఖరారవుతోంది, కదలిక మొదలైంది.

## మరో కొత్తరెండు మున్సిపాల్టీలు

**హైదరాబాద్, జూన్( వెలుతురు):**

ష్ట్రంలో కొత్తగా రెండు మున్సిపాలిటీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, జిన్నారం గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జిన్నారం, ఇంద్రేశం ప్రాంతాలను మున్సిపాలిటీలుగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, జనాభా పెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల నేపథ్యంలో ఈ డిమాండ్ తెరపైకి వచ్చిందిఈ రెండు గ్రామాలు పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోకి వస్తాయి. పటాన్ చెరు పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం. ఇక్కడ అనేక పరిశ్రమలు ఉండటం వల్ల జనాభా పెరుగుదల అధికంగా ఉంది. దీంతో ప్రాథమిక సదుపాయాలు, పట్టణీకరణ అవసరాలు పెరిగాయి. ఈ ప్రాంతాలు హైదరాబాద్ నగరానికి ఆనుకుని ఉండటం, ఇక్కడ పెద్ద ఎత్తున పారిశ్రామిక కార్యకలాపాలు సాగడం, రియల్ ఎస్టేట్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపించడంతో, పట్టణ అవసరాలు గ్రామ పంచాయతీల పరిధిలో తీర్చడం కష్టతరంగా మారింది. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతులను మెరుగుపరచడానికి మున్సిపల్ హోదా అవశ్యకతను స్థానిక ప్రజలు, నాయకులు తెరపైకి తీసుకొచ్చారు. మున్సిపాలిటీలుగా మారితే నిధుల కేటాయింపులు పెరుగుతాయని.. తద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని ప్రభుత్వాన్ని కోరారు. గతంలో అమీన్‌పూర్, బొల్లారం, తెల్లాపూర్ వంటి సమీప గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారినందున జిన్నారం, ఇంద్రేశం కూడా మున్సిపాలిటీలుగా మారాలని డిమాండ్ బలంగా వినిపించింది. ఈ నేపథ్యంలోనే జిన్నారం, ఇంద్రేశం గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటుగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని కూడా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీల్లో కమిషనర్లతో పాటు వివిధ విభాగాల్లో 316 పోస్టుల భర్తీకి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ప్రభుత్వ నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిమాండ్ నెరవేరిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలు మున్సిపాలిటీలుగా ఏర్పడటం వల్ల ఈ ప్రాంతాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు.


Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com